


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు




కల్తీ మద్యం పాపాత్ముడు జగనే!

7



దుబాయ్‌లోని భారత ఎంబసీ ప్రతినిధులతో భేటీలో చంద్రబాబు




శోభా గ్రూప్ ఫౌండర్ చైర్మన్ పీఎన్సీ మీనన్‌తో సీఎం భేటీ




షరాఫ్ గ్రూప్ వైస్ చైర్మన్ షరాఫుద్దీన్ షరాఫ్‌తో భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు



## తొలిరోజు పర్యటన..
# సూపర్ సక్సెస్

రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు సాధించమే లక్ష్యంగా పెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు -తాజాగా యూఏఈ పర్యటనలో బిజీగా ఉన్నారు. పెట్టుబడుల సాధనతోపాటు.. విశాఖ సమ్మిట్‌కు పారిశ్రామికవేత్తలను స్వయంగా ఆహ్వానించేందుకు యూఏఈలో మూడు రోజులు పర్యటించనున్న ముఖ్యమంత్రి -తొలిరోజు వివిధ పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. ఉత్సాహంగా పారిశ్రామికవేత్తలతో భేటీలు నిర్వహించిన చంద్రబాబు... ఏపీలో పెట్టుబడులకున్న అవకాశాలను వివరించడంతోపాటు వచ్చేనెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు రావాల్సిందిగా ఆహ్వానించారు. తొలిరోజు సీఎం చంద్రబాబు 5 వన్ టూ వన్ సమావేశాలు నిర్వహించారు. అనంతరం దుబాయ్ ఫ్యూచర్ మ్యూజియాన్ని మంత్రులు, అధికారులతో కలిసి సందర్శించారు. చంద్రబాబు తొలిరోజు పర్యటన సూపర్ సక్సెస్ అయ్యిందనడానికి -ఏపీలో పెట్టబడులు పెట్టేందుకు యూఏఈ పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపించటమే నిదర్శనం. అమరావతిలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో లైబ్రరీ నిర్మాణానికి శోభా గ్రూప్ రూ.100 కోట్లు విరాళం ప్రకటించడం మరో విశేషం. ఇక దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ యూనిట్ నిర్మాణంలో భాగస్వాములు కావడానికి ట్రాన్స్ వరల్డ్ గ్రూప్ సంస్థను సీఎం ఆహ్వానించారు. వైద్యారోగ్య రంగంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా బుర్జిల్ హెల్త్ కేర్ హెూల్డింగ్స్ సంస్థను ముఖ్యమంత్రి కోరారు. ఈమేరకు ఆ రెండు సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరిచాయి. వన్ టూ వన్ సమావేశాల్లో పలువురు యూఏఈ పారిశ్రామికవేత్తలు సీఎం చంద్రబాబుతో ఉన్న అనుబంధాన్ని, గతాన్ని గుర్తు చేసుకున్నారు. వచ్చేనెల 14, 15 తేదీల్లో విశాఖ వచ్చేందుకు ఆసక్తి చూపించారు. ముఖాముఖీ భేటీల్లో ఏపీలో గూగుల్ పెట్టుబడులపైనా చర్చ జరిగింది. బ్రేక్ లేకుండా వరుసగా మీటింగ్‌లకు సీఎం హాజరయ్యారు. తొలిరోజు పర్యటనలో చివరిగా సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ రోడ్ షోలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

(పూర్తి కథనాలు లోపలి పేజీలలో)

### ఏపీలో ఎన్నో అవకాశాలు..

ఏపీని ప్రధాన పెట్టుబడి కేంద్రంగా ప్రదర్శించడానికి, కీలక వృద్ధి రంగాలలో మా బలాలను హైలైట్ చేయడానికి నేను యూఏఈకి వచ్చాను. ఫలవంతమైన సమావేశాలతో ప్రారంభమైన పర్యటనలో దుబాయ్ కాన్సుల్ జనరల్ సతీష్ శివన్‌జీ, భారత రాయబార కార్యాలయం ఛార్జ్ డి అఫైర్స్ అమర్‌నాథ్‌జీ, దుబాయ్‌లోని అధికారులను కలవడం ఆనందంగా ఉంది. భారత్ -యుఏఈ మధ్య వాణిజ్య సంబంధాలను మెరుగుపర్చడం.. ఆంధ్రప్రదేశ్‌లో యూఏఈ ఆధారిత సంస్థల వృద్ధి అవకాశాలను అన్వేషించడంపైనే ప్రధానంగా చర్చించాము. ఆంధ్ర రాష్ట్రం ప్రపంచ వ్యాపారాలకు బలమైన పెట్టుబడి వాతావరణాన్ని అందిస్తుంది. ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి సరైన సమయం ఆసన్నమైంది. ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ, పర్యాటక రంగాలలో సంభావ్య పెట్టుబడి అవకాశాలను అన్వేషించడానికి దుబాయ్‌కి చెందిన శోభా గ్రూప్ చైర్మన్ రవి పిఎన్‌సి మీనన్‌ను కలవడం ఆనందంగా ఉంది. అమరావతిలో ప్రపంచస్థాయి లైబ్రరీ నిర్మిణానికి రూ.100 కోట్ల ఉదార సహకారానికి ముందుకు రావడాన్ని అభినందిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించమని వీరిని ఆహ్వానించడానికి సంతోషపడుతున్నాను.

## వినూత్న ఆలోచనలే
# మానవాళి భవిష్యత్!

- సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ రోడ్ షోలో చంద్రబాబు
- సీఎం ప్రజెంటేషన్‌కు ముగ్దులైన పారిశ్రామికవేత్తలు

2

# భారత్‌లో పెట్టుబడులకు ఏపీ గేట్ వే!

గేమ్‌ఛేంజర్‌కు ఘన స్వాగతం



బ్రిస్బేన్ పర్యటన ముగించుకుని మెల్‌బోర్న్ చేరుకున్న ఐటీ మంత్రి లోకేష్‌ను చుట్టుముట్టి.. ఆప్యాయంగా ఆహ్వానం పలుకుతున్న తెలుగు ప్రవాసాంధ్రులు

భారత్-ఆస్ట్రేలియా వాణిజ్యంలో ఏపీది కీలక పాత్రని, భారత్‌లో పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానమని ఐటీ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా.. బుధవారం బ్రిస్బేన్ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. ఏపీలో స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలు అమలు చేస్తున్నాం. గత 16 నెలల్లో ఏపీకి రూ.10లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు సాధించాం. విశాఖలో రూ.1.33 లక్షల కోట్లతో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటుకు ఒప్పందం జరిగిందని బ్రిస్బేన్ బిజినెస్ రౌండ్ టేబుల్‌లో మంత్రి స్పష్టం చేశారు. తొలుత.. ప్రతిష్టాత్మక గ్రిఫిత్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్) మార్నీ వాట్సన్‌తో గోల్డ్ కోస్ట్ క్యాంపస్‌లో లోకేష్ భేటీ అయ్యారు. పబ్లిక్ పాలసీ, సస్టైనబిలిటీ, ఇన్నోవేషన్ రంగాల్లో సంయుక్త కార్యక్రమాలకు ఏపీ-గ్రిఫిత్ భాగస్వామ్య ఏర్పాటుపై చొరవ చూపాలని ప్రతిపాదించారు. గ్రిఫిత్ యూనివర్సిటీ ఇండియా సెంటర్ లేదా హబ్‌ను ఏపీలో ఏర్పాటుకు ఆహ్వానించారు. అలాగే, జేమ్స్ కుక్ యూనివర్సిటీలో సెంటర్ ఫర్ సస్టయినబుల్ ట్రోఫికల్ ఫిషరీస్ అండ్ అక్వా కల్చర్ విభాగం ప్రొఫెసర్ క్యాల్ జెంజర్‌తో భేటీ అయ్యారు. ఆక్వా విస్తారంగావున్న ఏపీకి ఆక్వా జెనెటిక్స్ నైపుణ్యాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆక్వాసాగులో నష్టాలను నియంత్రించి.. ఉత్పత్తి స్థిరీకరణకు ఏఐ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఇక -విద్యారంగంపై క్వీన్స్ ల్యాండ్ ట్రేడ్ మరియు ఇన్వెస్టిమెంట్ సెంటర్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన లోకేష్.. విద్యారంగ సంస్కరణల్లో భారత్‌లో ఏపీ ముందువరుసలో ఉందని ప్రకటించారు. అంతర్జాతీయంగా అధునాతన సాంకేతికతలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఏపీలో హైస్కూలు స్థాయినుంచే ఏఐ పాఠ్యాంశాలను ప్రవేశపెడుతున్నామని వివరిస్తూనే.. ఏపీ ఏఐ వర్శిటీ ఏర్పాటుకు నిర్ణయించామని ప్రకటించారు. -పాపులస్ సంస్థ సీనియర్ ప్రిన్సిపల్ ఆర్కిటెక్ట్ షాన్ గల్లఘర్, పాపులస్ ఆసియా పసిఫిక్ బిజినెస్ డెవలప్‌మెంట్, బిడ్స్ అండ్ కమ్యూనికేషన్ హెడ్ ఎలిజిబెట్ డిసిల్వాలతో సమావేశమైన మంత్రి లోకేష్.. ఏపీని స్పోర్ట్స్ హబ్‌గా మార్చాలన్న సీఎం చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా అత్యాధునిక స్పోర్ట్స్ స్టేడియంలు, శిక్షణా సౌకర్యాల డిజైన్లు అందించాలని కోరారు. బుధవారం గోల్డ్ కోస్ట్, బ్రిస్బేన్ పర్యటన ముగించుకున్న ఐటీ మంత్రి లోకేష్.. అక్కడినుంచి మెల్‌బోర్న్ చేరుకున్నారు. మెల్బోర్న్‌లో తెలుగు ప్రవాసాంధ్రులు మంత్రి లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు.

(పూర్తి కథనాలు లోపలి పేజీలలో)



## బంగాళాఖాతంలో
# వాయుగుండం!

- దంచికొడుతున్న వానలు
- పలు జిల్లాలకు ఫ్లాష్ ఫ్లడ్ హెచ్చరికలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఏపీలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఏపీలోని ప్రకాశం, వైఎస్ఆర్ కడప, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది -తీవ్ర అల్పపీడనం నేపథ్యంలో రాయలసీమ, కోస్తాలోని జిల్లాలకు ఫ్లాష్ ఫ్లడ్ అలర్ట్ జారీ అయ్యింది.

(సమగ్ర సమాచారం లోపలి పేజీలలో..)




# వినూత్న ఆలోచనలే మానవాళి భవిష్యత్!

- టెక్నాలజీని అందుకున్న దుబాయ్ అభివృద్ధి సాధించింది
- 2047నాటికి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యంగా పని చేస్తున్నాం
- అమరావతిని ఫ్యూచరిస్టిక్ సిటీగా తీర్చిదిద్దుతున్నాం
- ఏపీలో పర్యాటక అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం..
- పోర్టుల నుంచి ఎయిర్‌పోర్టుల వరకూ మౌలికసదుపాయాలున్నాయి
- పెట్టుబడుల ఆకర్షణకే పాలసీలు తెచ్చాం.. తెస్తున్నాం
- ఏపీలో పెట్టుబడులకు ఇదే సరైన సమయం..
- విశాఖలో నిర్వహిస్తోన్న పార్టనర్ షిప్ సమ్మిట్‌కు ఆహ్వానం
- దుబాయ్‌లోని పారిశ్రామికవేత్తలకు చంద్రబాబు పిలుపు
- సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ రోడ్ షోకు హాజరైన ముఖ్యమంత్రి

దుబాయ్ (చైతన్య రథం): మానవాళి భవిష్యత్ ఇన్నోవేషన్లు.. వినూత్న ఆలోచనలపైనే ఆధారపడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. ఆధునిక యుగంలో టెక్నాలజీని అందిపుచ్చుకున్న దేశాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని, అందుకు దుబాయ్ సాధించిన అభివృద్ధి కళ్లముందున్న దృశ్యమన్నారు. పెట్టుబడుల ఆకర్షణ, విశాఖ పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించేందుకు మూడు రోజుల దుబాయ్ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. తొలిరోజు కార్యక్రమంలో చివరిగా దుబాయ్‌లో సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ రోడ్ షోలో పాల్గొన్నారు. రోడ్ షోకు హాజరైన యూఏఈ దేశాలకు చెందిన వివిధ కంపెనీల ప్రతినిధులకు ఏపీలో పెట్టుబడులకున్న అవకాశాలను వివరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఏపీలోని వనరులు, పెట్టుబడుల ఆవరణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. దుబాయ్ దేశం టెక్నాలజీని అందిపుచ్చుకునే అభివృద్ధి చెందిందన్నారు. టెక్నాలజీతో వచ్చే లాభాలను ముందుగా అర్థం చేసుకునే తాను ఐటీని ప్రమోట్ చేశానని, నాడు ఐటీని అందిపుచ్చుకున్నవాళ్లే ఇప్పుడు పెద్దఎత్తున ఐటీ దిగ్గజాలుగా ఎదిగారని గుర్తు చేసుకున్నారు. 2047నాటికి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యంగా ప్రస్తుత ఏపీ ప్రభుత్వం పని చేస్తోందని వివరిస్తూ.. తమ దేశ ఆవిర్భావాన్ని గుర్తు చేసుకునేలా దుబాయ్ 2071నాటికి భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవడం అద్భుతమని ప్రశంసించారు. భవిష్యత్ అంతా ఇన్నోవేషన్లు.. వినూత్న ఆలోచనలదేనంటూనే.. ఏపీలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. పెట్టుబడులకు సరైన ప్రతిపాదనలతో వస్తే పరిశ్రమల ఏర్పాటుకు వెంటనే ఆమోదం తెలుపుతామని, ఆసక్తివున్న సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు. వ్యవసాయాధారిత రాష్ట్రమైనా... అన్ని రంగాల్లో ఏపీని అభివృద్ధి చేస్తున్నామని చెబుతూనే.. రాయలసీమలో హార్టీకల్చర్, తీరప్రాంతాల్లో ఆక్వా కల్చర్ రంగాలకు అద్భుత అవకాశాలు ఉన్నాయని వివరించారు. గివ్‌బ్యాక్ పాలసీని అమలు చేస్తున్నామని చెబుతూ.. అందరూ ఆ పాలసీని అమలు చేయాలని సీఎం చంద్రబాబు కోరారు. అమరావతిలో రూ.100కోట్లతో గ్రంథాలయ నిర్మాణానికి విరాళమిచ్చేందుకు ముందుకొచ్చిన శోభా గ్రూప్‌కు ధన్యవాదాలు తెలిపారు. "నేను శోభా గ్రూప్ ప్రతినిధులను ఎప్పుడూ కలవలేదు. కానీ ఏపీకున్న క్రెడిబులిటీవల్ల విరాళం ఇచ్చేందుకు శోభా గ్రూప్ ముందుకురావడం సంతోషంగా ఉంది" అని సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖలో పార్టనర్ షిప్ సదస్సు నిర్వహిస్తున్నామని, పారిశ్రామికవేత్తలంతా సదస్సుకు హాజరై ఏపీ భవిష్యత్ ప్రణాళికలు, ఆలోచనలను అధ్యయనం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజధాని అమరావతిని ఫ్యూచరిస్టిక్ సిటీగా తీర్చిదిద్దుతున్నామని చెబుతూ.. అన్ని వసతులు ఉండడమే కాదు, ప్రకృతితో మమేకమయ్యేలా రాజధాని నగరాన్ని నిర్మిస్తున్నట్టు ప్రకటించారు. వినూత్న పద్ధతుల్లో రాజధాని కోసం భూసమీకరణ చేపట్టామని, ఒక్క పిలుపుతో 33 వేల ఎకరాలు రాజధానికి ఇవ్వడానికి ముందుకొచ్చిన రైతుల త్యాగాలను ప్రస్తావించారు. స్వయం సమృద్ధిగల రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దుతున్నట్టు చెబుతూ.. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ, ప్రతి రంగానికీ నీటి భద్రత ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భారతదేశ భవిష్యత్ అద్భుతంగా ఉండేలా ప్రధాని మోదీ అద్భుతమైన మార్పులు చేస్తున్నారని ప్రస్తావిస్తూ.. ఫ్యూచర్ వర్క్ ఫోర్స్ సిద్ధం చేసేందుకు ఇప్పటి నుంచే మేం ప్రణాళికలు రచిస్తున్నామని చంద్రబాబు ఉద్ఘాటించారు. "పరిశ్రమలకు అనుకూలంగా ఉండేందుకు పాలసీలు తెచ్చాం, తెస్తున్నాం. ఇప్పటికే 24 పాలసీలు తెచ్చాం. అవసరమైతే మరిన్ని పాలసీలు తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. పరిశ్రమల స్థాపనకు వచ్చే ప్రతిపాదనలతో రాష్ట్రానికి మేలు జరుగుతుందని భావిస్తే.. వెంటనే పరిశ్రమ ఏర్పాటుకు ఆమోదం తెలుపుతున్నామని పారిశ్రామికవేత్తలకు చంద్రబాబు స్పష్టం చేశారు.

"రాష్ట్రంలో పోర్టులున్నాయి. ఎయిర్ పోర్టులున్నాయి. ప్రతి 50 కిలోమీటర్లకు ఓ పోర్టు లేదా హార్బర్ ఉండేలా ప్రణాళికలు అమలు చేస్తున్నాం. లాజిస్టిక్స్ హబ్ చేసేందుకు అవసరమైన విధాన నిర్ణయాలు తీసుకున్నాం. ప్రస్తుతం ఏడు ఎయిర్ పోర్టులు ఉన్నాయి. మరో 9 ఎయిర్ పోర్టులు వస్తున్నాయి. ఎయిర్ కనెక్టివిటీ ద్వారా కార్గో రవాణా చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అభివృద్ధి చేస్తున్నాం. జల, రైలు, రోడ్, వాయుమార్గాల ద్వారా కనెక్టివిటీ ఉండేలా చూస్తున్నాం. వన్ ఫ్యామిలీ -వన్ ఎంటర్‌ప్రెన్యూర్ విధానం ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి కృషి చేస్తున్నాం. ఇందుకోసం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేశాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

"దుబాయ్ దేశంలో టూరిజం బాగా అభివృద్ధి చెందింది. దుబాయ్ దేశ జనాభా 3 మిలియన్లు. కానీ ఈ దేశాన్ని ఏడాదిలో సందర్శించే పర్యాటకుల సంఖ్య 18 మిలియన్లు. అదీ పర్యాటక రంగానికున్న బలం. ఇప్పుడు ఏపీలోనూ పర్యాటకాన్ని బాగా అభివృద్ధి చేస్తున్నాం. టూరిజం ప్రాంతాలే కాకుండా... ఆధ్యాత్మిక, చారిత్రాక ప్రాంతాలూ మాకు ఉన్నాయి. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుపతి దివ్యక్షేత్రం ఏపీలోనే ఉంది. 7 యాంకర్ హబ్స్... 25 థిమెటిక్ సర్క్యూట్స్, 3 నేషనల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఆతిథ్య రంగాన్ని అభివృద్ధి చేసే ప్రక్రియలో భాగంగా స్టార్ హొటళ్లకు అనుమతులిచ్చాం. టూరిజం రంగానికి పారిశ్రామిక హొదా కల్పించాం. ఆర్సెల్లార్ మిట్టల్ రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నారు. గూగుల్ కూడా 15 మిలియన్ డాలర్ల పెట్టుబడులను విశాఖలో పెట్టేందుకు ముందుకొచ్చింది. అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తున్నాం. ఏపీలో 48 యూనివర్శిటీలున్నాయి. 9 జాతీయ విశ్వవిద్యాలయాలున్నాయి. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా యువతకు శిక్షణ ఇస్తున్నాం. మైక్రో సాఫ్ట్ ద్వారా హైదరాబాద్ అభివృద్ధి జరిగింది. ఇప్పుడు గూగుల్ ద్వారా విశాఖ అభివృద్ధి జరగబోతోంది. సంస్కరణలు అమల్లోకి వచ్చాక... అతిపెద్ద పెట్టుబడి గూగుల్ పెడుతోంది. విశాఖనుంచే చాలా దేశాలకు కనెక్టివిటీ ఇస్తారు. విశాఖ ఫ్యూచర్ టెక్నాలజీలకు కేంద్రంగా ఉండబోతోంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి చాలా అవకాశాలున్నాయి. ఏపీకి రండి. రాష్ట్రంలోవున్న అవకాశాలను అధ్యయనం చేయండి. ఆ తరువాతే పెట్టుబడులు పెట్టండి" అని పారిశ్రామికవేత్తలకు సీఎం చంద్రబాబు రెడ్‌కార్పెట్ పరిచారు.

దుబాయ్ వేదికగా పెట్టుబడుల సాధనలో భాగంగా చేపట్టిన రోడ్ షోలో సీఎం చంద్రబాబు రాష్ట్ర ముఖచిత్రాన్ని ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషనుకు యూఏఈ పారిశ్రామికవేత్తలు అద్భుతంగా ప్రతిస్పందించారు. సీఎం ప్రజెంటేషనుకు పారిశ్రామికవేత్తలు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు.

రాష్ట్రంలోని అవకాశాలను వివరిస్తూ... పెట్టుబడిదారులకు భరోసా ఇచ్చేలా ముఖ్యమంత్రి ప్రసంగం సాగింది. వ్యవసాయం మొదలుకుని టెక్నాలజీ వరకు... గనులు మొదులుకుని స్పేస్ టెక్నాలజీ వరకు... చిప్ మొదలుకుని షిప్ బిల్డింగ్ వరకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సమగ్రంగా వివరించటంలో విజయం సాధించారు. పెట్టుబడుల గురించే కాకండా... ప్రజా సంక్షేమం కోణంలో చేస్తున్న పాలనాంశాలను గురించీ సీఎం చంద్రబాబు బలంగా ప్రస్తావించారు. రాష్ట్రానికి వస్తోన్న భారీ పెట్టుబడుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, విశాఖలో నవంబర్‌లో నిర్వహించనున్న పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు తప్పక హాజరుకావాలని పారిశ్రామికవేత్తలను, దుబాయ్ అధికార యంత్రాంగాన్ని సాదరంగా ఆహ్వానించారు.



# పారిశ్రామిక మైత్రి బలోపేతం

- ఏపీ- యూఏఈ మధ్య పారిశ్రామిక బంధం బలపడేందుకు సహకరించండి
- షిప్ బిల్డింగ్‌నుంచి డేటా సెంటర్ల వరకూ ఏపీలో అపారమైన అవకాశాలు
- యూఏఈలోని తెలుగువారి అభివృద్ధికి తోడ్పాటు అందించండి
- మోదీ చొరవతోనే భారత్‌లో విప్లవాత్మక మార్పులు
- దుబాయ్‌లోని భారత ఎంబసీ ప్రతినిధులతో భేటీలో సీఎం చంద్రబాబు



దుబాయ్ (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్–యూఏఈ మధ్య పారిశ్రామిక బంధం మరింత బలపడేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దుబాయిలోని భారత రాయబార కార్యాలయం ప్రతినిధులను కోరారు. పెట్టుబడుల సాధనకు, నవంబర్‌లో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానాలు పలికేందుకు యూఏఈలో మూడు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం సీఎం చంద్రబాబు దుబాయ్ చేరుకున్నారు. దిగిన వెంటనే దుబాయ్, అబుదాబి దేశాల్లో భారత రాయబార కార్యాలయం ప్రతినిధులతో సీఎం భేటీ అయ్యారు. దుబాయ్ ఇండియన్ కాన్సుల్ జనరల్ సతీష్‌కుమార్ శివన్, అబుదాబిలోని ఇండియన్ ఎంబసీ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ అమర్నాథ్‌తో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. దుబాయ్ సహా యూఏఈ దేశాల్లోని వివిధ కంపెనీల వివరాలు, ఏపీలో పెట్టుబడులకున్న అవకాశాలు, ఏయే రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అనువుగా ఉంటుందనే అంశాలపై వారితో చర్చించారు. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, క్వాంటం కంప్యూటింగ్, పెట్రో కెమికల్స్, పోర్టులు, లాజిస్టిక్స్, ఏవియేషన్, ఇండస్ట్రియల్ పార్కులు, రియల్ ఎస్టేట్, డేటా సెంటర్లు, ఆతిధ్యరంగం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేలా ఏపీలో వనరులు, అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. గూగుల్ సంస్థ విశాఖలో అతిపెద్ద డేటా ఏఐ హబ్ 15 బిలియన్ డాలర్లతో పెట్టుబడులు పెడుతోందని సీఎం వారికి వివరించారు. ఏపీకి 1054 కిలోమీటర్ల పొడవైన సుదీర్ఘ తీరప్రాంతంలో పోర్టులు, ఎయిర్ పోర్టులు, హార్బర్లను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ఏపీలో లాజిస్టిక్స్ రంగాన్ని అభివృద్ధి చేసేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్టు సీఎం వివరించారు. యూఏఈ దేశాల సావరీన్ ఫండ్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలపైనా వారితో ముఖ్యమంత్రి చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రంగాల్లో అపారమైన అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా దుబాయ్ సహా వివిధ దేశాల కంపెనీలకు వివరించాలని ఎంబసీ ప్రతినిధులకు సీఎం సూచించారు. యూఏఈ –ఏపీ పారిశ్రామిక బంధం ధృఢంగా ఉండేలా చూడాలని సూచించారు. ఇప్పటికే భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి యూఏఈ దేశాలకు చెందిన వివిధ సంస్థలు ముందుకొచ్చిన నేపథ్యంలో ఏపీలో ఉన్న అవకాశాలను ఆయా దేశాల్లోని కంపెనీలకు వివరించాలని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అనుమతులు ఇస్తోందన్నారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో సీఐఐతో కలిసి భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నామని... యూఏఈలోని వివిధ సంస్థలను సదస్సుకు ఆహ్వానిస్తున్నామని దుబాయిలోని భారత ఎంబసీ ప్రతినిధులకు సీఎం వివరించారు. ప్రధాని మోదీ చొరవవల్లే దేశంలో చాలా మార్పులు వచ్చాయని.. భారత్‌ను పెద్దఎత్తున ఆయన ప్రమోట్ చేస్తున్నారన్నారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు పెరగడానికి ప్రధాని చేస్తోన్న కృషే కారణమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## విద్య వైద్యరంగాల్లో యూఏఈ ఆసక్తి

ట్రేడ్ అండ్ టెక్నాలజీ రంగంలో భారత్ దేశానికి యూఏఈ భాగస్వామిగా ఉందని దుబాయ్‌లోని కాన్సులేట్ జనరల్ సతీష్ కుమార్ శివన్ వివరించారు. ఇరుదేశాల పరస్పర పెట్టుబడులతో బంధం మరింత బలపడిందని సీఎంకు వివరించారు. మూడేళ్లలో 50శాతంమేర ఇరుదేశాల మధ్య వాణిజ్యం పెరిగిందన్నారు. ప్రస్తుతం యూఏఈ టెక్నాలజీ రంగంపై ఎక్కువగా వ్యయం చేస్తోందని భారత్‌నుంచి వచ్చే నిపుణులకు భారీఎత్తున అవకాశాలున్నాయని సీఎంకు వివరించారు. ప్రస్తుతం యూఏఈ నాన్ ఆయిల్ ఎకానమీ వైపుగా దృష్టి పెట్టిందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై యూఏఈ 2017లోనే ఓ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసిందని సీఎంకు సతీష్ కుమార్ శివన్ తెలిపారు. మరోవైపు యూఏఈలో 23 బిలియన్ డాలర్ల పెట్టుబడులు భారత్‌లో పెట్టిందని ఇందులో 50 శాతం గత మూడేళ్లలో వచ్చినవేనని యూఏఈలోని డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ ఎ అమర్నాథ్ తెలిపారు. భారత్‌లోని విద్య వైద్య రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈ ఆసక్తి చూపుతోందని వివరించారు. గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ పార్క్‌లోనూ యూఏఈ నుంచి పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అమర్నాథ్ తెలిపారు. సమావేశంలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీఎంకు సాదర స్వాగతం

దుబాయ్‌లోని అంతర్జాతీయస్థాయి సంస్థలకు అవసరమైన టెక్నాలజీ నిపుణులను అందించేందుకు ఏపీ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. యూఏఈలో తెలుగువాళ్లు ఉన్నారని... వారికి అవసరమైన సహకారాన్ని అందించాలని ఎంబసీ ప్రతినిధులను సీఎం చంద్రబాబు కోరారు. దుబాయ్‌లో తన పర్యటన చివరి రోజున తెలుగు డయాస్పోరా కార్యక్రమం నిర్వహించనున్నట్టు సీఎం చంద్రబాబు చెప్పారు. అంతకుముందు హైదరాబాద్‌నుంచి దుబాయ్‌కు చేరుకున్న సీఎం చంద్రబాబు నాయుడుకు స్థానిక తెలుగు ప్రజలు విమానాశ్రయానికి వచ్చి ఘనంగా స్వాగతం పలికారు. దుబాయిలో ఉన్న తెలుగువారు.. ప్రత్యేకించి మహిళలు తెలుగు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. తనకు స్వాగతం పలకడానికి వచ్చిన వారిని సీఎం అప్యాయంగా పలకరించారు.











## అమరావతిలో రూ.100 కోట్లతో

# ప్రపంచస్థాయి గ్రంథాలయం

- విరాళం ప్రకటించిన దుబాయ్ సంస్థ శోభా గ్రూప్ చైర్మన్ పీఎన్సీ మీనన్
- ఏపీలో రియాల్టి రంగంలో పెట్టుబడులకు ఎన్నో అవకాశాలు
- టౌన్‌షిప్‌లు, లగ్జరీ హోటళ్ల నిర్మాణరంగంలో పెట్టుబడులు పెట్టండి
- ప్రముఖ రియాల్టీ సంస్థ శోభా గ్రూప్ చైర్మన్‌కు సీఎం చంద్రబాబు ప్రతిపాదన





దుబాయ్ (చైతన్య రథం): దుబాయ్‌లోని ప్రముఖ సంస్థ శోభా రియాల్టి అమరావతిలో ప్రపంచస్థాయి గ్రంథాలయం ఏర్పాటుకు ముందుకు వచ్చింది. రూ.100 కోట్ల విరాళంతో వరల్డ్ క్లాస్ లైబ్రరీని నిర్మించనుంది. ఏపీలో పెట్టుబడి అవకాశాలు వివరించేందుకు దుబాయ్ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబుతో ఆ దేశంలోని శోభా రియాల్టి ఫౌండర్ చైర్మన్ పీఎన్సీ మీనన్ భేటీ అయ్యారు. సమావేశంలో లైబ్రరీ ఏర్పాటుకు సంబంధించి ముఖ్యమంత్రితో చర్చించారు. శోభా రియాల్టి సంస్థ అమరావతిలో ప్రపంచస్థాయి స్టేట్ లైబ్రరీ నిర్మించేందుకు ముందుకు రావటంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. గ్రంథాలయం నిర్మాణానికి ఇంత పెద్ద మొత్తంలో విరాళం ప్రకటించటంపై ధన్యవాదాలు తెలియచేశారు. అమరావతిని ప్రపంచంలో అత్యుత్తమ నగరంగా నిర్మిస్తున్నామని సీఎం ఆయనకు వివరించారు. రాజధాని నిర్మాణంలో శోభా రియాల్టి సంస్థ కూడా భాగస్వామి కావాలని ఆహ్వానించారు. ఏపీకి వచ్చి రాజధాని నిర్మాణాన్ని పరిశీలించాలని కోరారు. దేశవ్యాప్తంగా ప్రపంచస్థాయిలో నగరాలు నిర్మితం అవుతున్నాయని.. వాటితో సమానంగా మౌలిక సదుపాయాలతో అమరావతిని నిర్మిస్తున్నట్టు సీఎం వివరించారు. గ్రీన్ ఎనర్జీకి రాష్ట్రాన్ని చిరునామాగా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు శోభా గ్రూప్ ప్రతినిధులకు చంద్రబాబు వివరించారు. అమరావతిలో క్వాంటం వ్యాలీ, విశాఖలో గూగుల్ డాటా సెంటర్ ఏర్పాటవుతోందని చంద్రబాబు చెప్పారు. ఇక తిరుపతి, విశాఖవంటి నగరాల్లో రానున్న రోజుల్లో అనేక మార్పులు రానున్నాయని... మౌలిక సదుపాయాలపై భారీగా ఖర్చు చేస్తున్నట్టు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో రియల్ ఎస్టేట్ రంగంలో అపారమైన అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు.

### పోర్టులున్నాయి... కారిడార్లు వస్తున్నాయి

రాష్ట్రంలో రియాల్టిరంగంలో విస్తృతమైన అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఈక్రమంలో అమరావతి, విశాఖ, తిరుపతివంటి ప్రాంతాల్లో కూడా బిజినెస్ ఐటీ పార్కులు, మాల్స్, హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లతోపాటు ఉన్నతశ్రేణి వర్గాలకు హౌసింగ్ ప్రాజెక్టులు చేపట్టేందుకు అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి వివరించారు. ప్రస్తుతం ఏపీలో నిర్మితమవుతున్న పారిశ్రామిక కారిడార్లు, పోర్టులకు అనుసంధానంగా ఇండస్ట్రియల్ టౌన్ షిప్, హౌసింగ్ ప్రాజెక్టులకు అవకాశం ఉందని ముఖ్యమంత్రి శోభా రియాల్టీ చైర్మన్ పీఎన్సీ మీనన్‌కు వివరించారు. ఈ సందర్భంగా శోభా గ్రూప్ సంస్థ చేస్తున్న ఛారిటీని సీఎం అభినందించారు. తమ ఆదాయంలో 50 శాతాన్ని ఛారిటీగా ఖర్చు పెట్టడాన్ని ప్రస్తావిస్తూ తాము ఏపీలో పీ-4 విధానాన్ని అవలంభిస్తూ అమలు చేస్తున్న జీరో పావర్టీ మిషన్ అంశాలను వివరించారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి అంశాలపై ఇరువురూ చర్చించుకున్నారు. ప్రస్తుతం తమ సంస్థ దుబాయ్‌తో పాటు ఓమన్, బహ్రెయిన్, ఖతార్, బ్రూనై దేశాల్లో ప్రాజెక్టులు నిర్వహిస్తోందని శోభా గ్రూప్ చైర్మన్ మీనన్ ముఖ్యమంత్రికి వివరించారు. భారత్‌లోని 14 రాష్ట్రాల్లోని 27 నగరాల్లో శోభా రియాల్టీ ప్రాజెక్టులు చేస్తోందని.. ప్రత్యేకించి బెంగుళూరు, గుర్గావ్, చెన్నై, కేరళలోని హౌసింగ్ ప్రాజెక్టులు చేపట్టామని సీఎంకు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం దుబాయ్ ప్రభుత్వంలో సీనియర్ సలహాదారు హోదాలో పనిచేస్తున్న మీనన్.. ఆ దేశంనుంచి కూడా పెట్టుబడులు వచ్చేలా సహకరించాలని కోరారు. వచ్చే నెల నవంబర్14, 15వ తేదీల్లో విశాఖలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తున్నామని... సదస్సుకు హాజరుకావాలని సీఎం చంద్రబాబు ఆహ్వానించారు.

# యూఏఈలో సీఎం చంద్రబాబు



- పెట్టుబడుల సాధనకు సీఎం మూడు రోజుల పర్యటన
- పారిశ్రామిక వేత్తలతో రోడ్ షో, తెలుగు డయాస్పొరాకు హాజరు
- విశాఖ సమ్మిట్‌కు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించనున్న సీఎం
- యూఏఈలో పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ప్రతినిధులతో భేటీలు

అమరావతి/దుబాయ్ (చైతన్య రథం): విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు దేశ విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ప్రతినిధుల్ని ఆహ్వానించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం యూఏఈకి చేరుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు విమానాశ్రయంలో స్థానిక తెలుగు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. అబుదాబి ఇండియన్ ఎంబసీ డెప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ అమర్‌నాథ్, దుబాయ్ ఇండియన్ కౌన్సిల్ జనరల్ సతీష్‌కుమార్ శివన్‌లతో ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిరోజు భేటీ కానున్నారు. నేటినుంచి యూఏఈలో చంద్రబాబు బృందం మూడు రోజులపాటు పర్యటించనుంది. తొలుత యూఏఈ పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం అమరావతి నుంచి హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న సీఎం చంద్రబాబు బృందం.. అక్కడినుంచి 10 గంటలకు యూఏఈకు బయలుదేరారు. విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు దేశ విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ప్రతినిధుల్ని ఆహ్వానించడానికి స్వయంగా ముఖ్యమంత్రే వెళ్లడం గమనార్హం. యూఏఈలో మూడురోజులు పర్యటించనున్న సీఎం చంద్రబాబు.. వివిధ పారిశ్రామికవేత్తలతో భేటీ అవుతారు. అలాగే ఓ సైట్‌ను విజిట్ చేస్తారు. సైట్ విజిట్లో భాగంగా దుబాయ్ ఫ్యూచర్ మ్యూజియాన్ని ముఖ్యమంత్రి బృందం సందర్శించనుంది. తొలిరోజు బుధవారం ఐదు సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు భేటీ అవుతారు. అలాగే రాత్రి సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ రోడ్ షోలో పాల్గొంటారు. నవంబరు 14, 15 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని పారిశ్రామికవేత్తలను సీఎం ఆహ్వానిస్తారు. అలాగే పర్యటన చివరి రోజున దుబాయ్‌లో ఏపీ ఎన్నార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలుగు డయాస్పోరా సమావేశంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. తొలిరోజు పర్యటనలో భాగంగా శోభా గ్రూప్, షరాఫ్ డీజీ, ట్రాన్స్ వరల్డ్ గ్రూప్, లూధా గ్రూప్, దుబాయ్ ఫ్యూచర్ ఫౌండేషన్ సంస్థలకు చెందిన ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమావేశమవుతారు. వీరితో వన్ టు వన్ సమావేశాలు నిర్వహిస్తారు.

# ఏపీకి విస్తరించండి!




షరాఫ్ గ్రూప్ వైస్ చైర్మన్, షరాఫ్ డీజీ సంస్థ వ్యవస్థాపకుడు షరాఫుద్దీన్ షరాఫ్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.

- లాజిస్టిక్స్, గిడ్డంగుల ఏర్పాటుపై దృష్టి పెట్టాలి
- అవసరమైతే పాలసీల్లో మార్పులు చేయడానికి సిద్ధం
- షరాఫ్ గ్రూప్ సంస్థకు సీఎం చంద్రబాబు ఆహ్వానం

దుబాయ్ (చైతన్య రథం): షరాఫ్ గ్రూప్ వైస్ చైర్మన్, షరాఫ్ డీజీ సంస్థ వ్యవస్థాపకుడు షరాఫుద్దీన్ షరాఫ్‌తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం భేటీ అయ్యారు. రాష్ట్రంలోపెట్టుబడులకున్న అవకాశాలపై షరాఫ్‌తో చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మౌలిక వసతులు, మావన వనరుల లభ్యత, ఇతర అనుకూలతల గురించి వివరించారు. బుధవారం యూఏఈలో తొలిరోజు పర్యటనలో భాగంగా షరాఫ్ గ్రూప్ వైస్ చైర్మన్‌తో సమావేశమైన సీఎం... ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్ ప్రాజెక్టుల ఏర్పాటు గురించి ప్రధానంగా చర్చించారు. షరాఫ్ గ్రూప్ ఇప్పటికే భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో లాజిస్టిక్స్ పార్కులను అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో ఏపీ చేపట్టిన పారిశ్రామిక కారిడార్లలో ఆధునిక లాజిస్టిక్స్ పార్కులు, గిడ్డంగులు స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. చంద్రబాబు ప్రతిపాదనతో షరాఫ్ గ్రూప్ తమ అనుబంధ సంస్థ అయిన హింద్ టెర్మినల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్, గిడ్డంగి సదుపాయాలను ఏర్పాటుకు ఆసక్తి కనబరిచింది. ఇందుకోసం రైల్వే, పోర్ట్ అనుసంధానం కలిగిన ప్రాంతాన్ని గుర్తించాలని షరాఫ్ గ్రూప్ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

### అవసరమైతే పాలసీల్లో మార్పులు చేస్తాం

'మా రాష్ట్రంలో పోర్టులు, నేషనల్ హైవేలు విస్తారంగా ఉన్నాయి. కార్గో రవాణాకు రాష్ట్రం అనుకూలం. మేం ఇప్పుడు కొత్త పాలసీలు తెచ్చాం. రాష్ట్రానికి మేలు జరుగుతుందనుకుంటే పాలసీల్లో మార్పులు తేవడానికీ సిద్ధం. లాజిస్టిక్స్‌పై 14 శాతం ఖర్చు పెడుతున్నాం. దీన్ని 8నుంచి 9శాతానికి తగ్గించాలని చూస్తున్నాం. ఇందుకోసం పోర్టులు, జాతీయ రహదారులు, రైల్వే, రహదారి ప్రాజెక్టులకు ఎక్కువప్రాధాన్యత ఇస్తున్నాం. లాజిస్టిక్ వ్యయం తగ్గించడానికి సహకరించండి. రాయలసీమలో ఆటోమొబైల్ పరిశ్రమలు వస్తున్నాయి. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే పెట్టుబడి దారుల సదస్సుకు హాజరుకండి' అని షరాఫ్ గ్రూప్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి అన్నారు. దీనికి స్పందించిన ఆ సంస్థ ప్రతినిధులు భారత్‌లో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నామని, ఆంధ్రప్రదేశ్‌కు తప్పనిసరిగా వస్తామని హామీ ఇచ్చారు.

# దేశసేవలో తరించాలి

### అమిత్‌షాకు చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు

అమరావతి (చైతన్య రథం): కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంపూర్ణ ఆరోగ్యంతో దేశ సేవలో తరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. అమిత్ షా జన్మదినం సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతో ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "కేంద్ర హోంమంత్రి అమిత్ షాకి పుట్టినరోజు శుభాకాంక్షలు. మంచి ఆరోగ్యంతో దేశ సేవలో దీర్ఘాయుష్షుతో తరించాలని ఆకాంక్షిస్తూ భగవంతుని ప్రార్థిస్తున్నాను" అని సీఎం చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.



# షిప్ బిల్డింగ్ యూనిట్‌కి ట్రాన్స్ వరల్డ్ గ్రూప్‌కు ఆహ్వానం




ట్రాన్స్ వరల్డ్ గ్రూప్ చైర్మన్ రమేష్ ఎస్ రామకృష్ణన్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



బుర్జిల్ హెల్త్ కేర్ హెూల్డింగ్స్ చైర్మన్ షంషీర్ వయాలిల్‌తో భేటీ అయిన సీఎం చంద్రబాబు

- వైద్యారోగ్య రంగంలో పెట్టుబడి పెట్టాలని బుర్జిల్ సంస్థను కోరిన సీఎం
- సీఎంతో భేటీల్లో పెట్టుబడులకు ఆసక్తి కనపర్చిన దుబాయ్ పారిశ్రామికవేత్తలు

దుబాయ్ (చైతన్య రథం): ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానాలకు యూఏఈ పారిశ్రామికవేత్తలు సానుకూలంగా స్పందిస్తున్నారు. యూఏఈలో మూడు రోజుల పర్యటనలో భాగంగా తొలిరోజు దుబాయ్‌లో బుధవారం పర్యటించిన చంద్రబాబు.. అక్కడి పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు నిర్వహించారు. దీంట్లో భాగంగా ట్రాన్స్ వరల్డ్ గ్రూప్ చైర్మన్ రమేష్ ఎస్ రామకృష్ణన్, బుర్జిల్ హెల్త్ కేర్ హెూల్డింగ్స్ చైర్మన్ షంషీర్ వయాలిల్‌తో ముఖ్యమంత్రి వరుస సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను వివరించారు. ఈక్రమంలో షిప్ బిల్డింగ్, లాజిస్టిక్స్ రంగంలో పేరొందిన ట్రాన్స్ వరల్డ్ గ్రూప్ చైర్మన్‌కు రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధిపై సీఎం వివరించారు. సుదీర్ఘ తీర ప్రాంతముందని.. పోర్టులు, ఎయిర్‌పోర్టుల నిర్మాణంతోపాటు... షిప్ బిల్డింగ్ ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నట్టు సీఎం.. ఆ సంస్థ చైర్మన్ రామకృష్ణన్‌కు వివరించారు. దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ యూనిట్ నిర్మించే దిశగా ప్రణాళికలు చేస్తున్నట్టు వివరించారు. దీనిపై ట్రాన్స్ వరల్డ్ గ్రూప్ సానుకూలంగా స్పందించింది. ఏపీలో షిప్ బిల్డింగ్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. రాష్ట్రంలో లాజిస్టిక్స్ వ్యయం తగ్గించే ఆలోచనలతో తాము పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. మూలపేట, రామాయపట్నం, మచిలీపట్నం పోర్టులు త్వరలోనే అందుబాటులోకి రానున్నట్టు సీఎం చెప్పారు. రైలు, పోర్టులు, ఎయిర్ పోర్టుల కనెక్టివిటీ ఉండేలా ప్రణాళికలు రూపొందించినట్టు ట్రాన్స్ వరల్డ్ గ్రూప్ ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించారు.

### వైద్యారోగ్య రంగంలో పెట్టుబడులకు ఆహ్వానం

అబుదాబిలోని వైద్యారోగ్య రంగంలో ప్రతిష్టాత్మక సంస్థ బుర్జిల్ హెల్త్ కేర్ హెూల్డింగ్స్ చైర్మన్ షంషీర్ వయాలిల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అయ్యారు. ఆ రంగంలో ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు బుర్జిల్ హెల్త్ కేర్ హెూల్డింగ్స్ సంస్థ ఆసక్తి కనబరిచింది. తిరుపతిలో స్పెషల్ క్యాన్సర్ సెంటర్ నిర్మాణానికి ముందుకు వచ్చింది. రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్‌పై తమ సంస్థకు విశేషమైన అనుభవం ఉందని సంస్థ ప్రతినిధులు సీఎంకు వివరించారు. అబుదాబిలో అతి పెద్ద క్యాన్సర్ ఆస్పత్రిని నిర్వహిస్తున్నట్టు తెలిపింది. బుర్జిల్ సంస్థ చైర్మన్‌తో భేటీలో భాగంగా వైద్యారోగ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పులను సీఎం వివరించారు. వైద్యారోగ్య రంగంలో ప్రివెంటివ్-క్యూరేటివ్ అనే విధానాన్ని అవలంభిస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో హెల్త్ కార్డుల డిజిటలీకరణ ప్రాజెక్టును పైలెట్‌గా చేపట్టినట్టు చంద్రబాబు వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్‌తోపాటు పరిశ్రమలశాఖ, ఈడీబీకి చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేడు అబుదాబీలో చంద్రబాబు పర్యటన

- అబుదాబీ నేషనల్ ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో భేటీ
- పెట్టుబడులపై స్థానిక పారిశ్రామికవేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశం



దుబాయ్ (చైతన్య రథం): పెట్టుబడులు ఆకర్షించేందుకు దుబాయ్ యూఏఈలో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు రెండోరోజు అబుదాబీలో పారిశ్రామికవేత్తలతో సమావేశంకానున్నారు. గురువారం ఉదయం 10.15 నిముషాలకు దుబాయ్ నుంచి అబుదాబీ వెళ్లనున్న సీఎం అక్కడ అబుదాబీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ అహ్మద్ జైసిమ్ అల్ జాబీతో భేటీ అవుతారు. అబుదాబీలోని అల్ మైరాహ్ ఐలాండ్‌లో ఉన్న ఏడీజీఏ స్క్వేర్‌లో సమావేశం జరుగనుంది. జీ42 సీఈఓ మన్సూర్ అల్ మన్సూరీతోనూ సీఎం సమావేశమవుతారు. అనంతరం అబుదాబీ నేషనల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులు అహ్మద్ బిన్ తలిత్, లాజిస్టిక్స్ విభాగం ప్రతినిధి అబ్దుల్ కరీమ్ అల్ మసాబీ, అదే సంస్థకు చెందిన రషీద్ అల్ మజ్రోయి, జాయేద్ అల్ షాయేయా, సయీద్ అల్ అమేరి తదితరులతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. అనంతరం అబుదాబీలో స్థానిక టెక్నాలజీ కంపెనీల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనున్నారు. మధ్యాహ్నం అబుదాబీ పెట్టుబడుల విభాగం చైర్మన్ ఖలీఫా ఖౌరీతో సీఎం భేటీ అవుతారు. లులూ గ్రూప్ సీఎండీ యూసఫ్ అలీతోనూ ముఖ్యమంత్రి సమావేశమై విశాఖ, విజయవాడలో లులూ మాల్స్ నిర్మాణం, మల్లవల్లిలో లాజిస్టిక్స్ కేంద్రంపై చర్చించనున్నారు. ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ పార్కును ఏర్పాటు చేసేందుకు ఆసక్తి కనపరుస్తున్న అగితా గ్రూప్ సీఈఓ సల్మీన్ అల్మెరీతోనూ సీఎం భేటీ కానున్నారు. అబుదాబీలోని మస్దార్ సిటీ సీఈఓ మహ్మద్ జమీల్ అల్ రమాహితో భేటీ అవుతారు. అనంతరం యాస్ ఐల్యాండ్‌లోని పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై ఆ సంస్థ సీఈఓ మహ్మద్ అబ్దుల్లా అల్ జాబీతో భేటీ కానున్నారు. ఈ భేటీ అనంతరం భారత కాన్సుల్ జనరల్ నివాసంలో ముఖ్యమంత్రి గౌరవార్థం ఇచ్చే విందుకు చంద్రబాబు హాజరవుతారు. నేడు మొత్తం 9 సమావేశాలకు ముఖ్యమంత్రి హాజరుకానున్నారు.

## మత్స్యకారుల రక్షణకు తక్షణ చర్యలు తీసుకోండి

- బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పండి
- ఏపీ అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి (చైతన్య రథం): వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో దారితప్పి బంగ్లాదేశ్ పరిధిలోని సముద్ర జలాల్లోకి వెళ్లిపోయిన మత్స్యకారుల రక్షణకు తక్షణం చర్యలు తీసుకోవాలని యుఏఈ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. దుబాయ్ పర్యటనలో భాగంగా తొలిరోజు కార్యక్రమాలతో బిజీగా ఉన్నప్పటికీ.. దారితప్పిన మత్స్యకారుల సమాచారం తెలియడంతో సీఎం చంద్రబాబు తక్షణం స్పందించారు. బంగ్లాదేశ్ నావికాదళం అదుపులోవున్న ఏపీకి చెందిన మత్స్యకారులను తిరిగి రాష్ట్రానికి తీసుకొచ్చే చర్యల్లో అధికారుల నిమగ్నమయ్యారు. సముద్రంలో వేటకు వెళ్లిన విజయనగరం జిల్లాకు చెందిన కొందరు మత్స్యకారులు, సముద్రంలో వాతావరణం అనుకూలించ పోవడంతో దారితప్పి పొరపాటున బంగ్లాదేశ్ జలాల్లోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం బంగ్లాదేశ్ నౌకాదళం అదుపులో ఏపీ మత్స్యకారులు ఉన్నట్టు సమాచారం. సమాచారం తెలుసుకున్న సీఎం చంద్రబాబు.. దుబాయ్‌నుంచే మత్స్యకారుల గురించి ఆరా తీశారు. బంగ్లాదేశ్ చెరనుంచి వారిని ఏపీకి తీసుకొచ్చేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముందుగా.. భయాందోళనకు గురవుతున్న మత్స్యకారుల కుటుంబాలను కలిసి ధైర్యం చెప్పాలని, ప్రభుత్వం వారికి తోడుగా ఉందన్న భరోసా కల్పించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు.

# ఆత్మగౌరవ ప్రతీక.. భీం!

**కొమురం భీం జయంతి సందర్భంగా చంద్రబాబు నివాళి**



అమరావతి (చైతన్య రథం): అడవి బిడ్డల హక్కుల కోసం జల్, జంగల్,జమీన్ నినాదంతో కొదమసింహంలా పోరాడిన కొమురం భీంను ఆత్మగౌరవ ప్రతీకగా చూడాలని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భీం జయంతి సందర్భంగా ఎక్స్ పోస్టులో నివాళి అర్పిస్తూ.. "వీరోచిత మరణం పొందిన అమరవీరుడు కొమురం భీం. ఆదివాసీ ఆత్మగౌరవ ప్రతీక ఆయన. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి అయిన కొమురం భీం జయంతి సందర్భంగా ఆ మహానుభావుని స్మృతికి నివాళి" అని సీఎం చంద్రబాబు పోస్టులో పేర్కొన్నారు.

## విద్యార్థినిపై అత్యాచారయత్నం..

### షాక్‌కు గురైన మంత్రి లోకేష్

**నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామన్న పోలీసులు**

**విద్యార్థినులకు పటిష్ట భద్రత కల్పించాలని మంత్రి ఆదేశం**

అమరావతి (చైతన్య రథం): తుని రూరల్ గురుకుల పాఠశాల విద్యార్థినిపై కామాంధుడు తాటిక నారాయణ రావు అత్యాచార యత్నానికి పాల్పడినట్లు తెలుసుకొని షాక్‌కు గురైనట్లు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మంత్రి లోకేష్.. ఘటనా వివరాలు తెలిసిన వెంటనే పోలీసు అధికారులతో మాట్లాడారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఇటువంటి ఘటనలకు పాల్పడే వారెవరైనా ఉక్కుపాదంతో అణచివేస్తామని ఈసందర్భంగా లోకేష్ వ్యాఖ్యానించారు.బాధితురాలు ధైర్యంగా ఉండేలా కౌన్సిలింగ్ ఇచ్చి,అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థినుల కు పటిష్టమైన భద్రత కల్పించాల్సిందిగా అధికార యంత్రాంగాన్ని మంత్రి లోకేష్ ఆదేశించారు.

# ఏపీలో అడుగుపెట్టండి!



- **గ్రిఫిత్ వర్సిటీ ఇండియా సెంటర్ ఏర్పాటు చేయండి**
- **రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో కలిసి పనిచేయండి**
- **ఐటీ మంత్రి నారా లోకేష్ ప్రతిపాదన**
- **గ్రిఫిత్ వర్శిటీ వైస్ ప్రెసిడెంట్ మార్నీ వాట్సన్‌తో భేటీ**

ఆస్ట్రేలియా (గోల్డ్ కోస్ట్): గ్రిఫిత్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్) మార్నీ వాట్సన్‌తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ గోల్డ్ కోస్ట్ క్యాంపస్‌లో భేటీ అయ్యారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ కళాశాలలో అధునాతన క్రీడా సౌకర్యాలను మంత్రి పరిశీలించారు. గ్రిఫిత్ వర్సిటీ ప్రత్యేకతలను మార్నీ వాట్సన్ తెలియజేస్తూ... 1975లో స్థాపితమైన తమ విశ్వవిద్యాలయం ప్రపంచంలోని అగ్రశ్రేణి పబ్లిక్ యూనివర్సిటీల్లో ఒకటిగా ఉందన్నారు. క్వీన్స్ ల్యాండ్‌లో యూనివర్సిటీకి ఉన్న ఐదు క్యాంపస్‌లలో 50వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని వివరించారు. సామాజిక న్యాయం, స్థిరత్వం, ఆవిష్కరణ రంగాల్లో పేరుగాంచిన తమ వర్సిటీ.. 2027లో బ్రిస్బేన్ సీబీడీలో కొత్త క్యాంపస్ ప్రారంభించబోతోందని వెల్లడించారు. భారత్‌లో ఐఐటీ రూర్కీతో కలిసి సంయుక్త పరిశోధన, స్టూడెంట్ ఎక్స్చేంజి కార్యక్రమాలు, ఆరోగ్యం, నీటివనరులు, టెక్నాలజీ రంగాల్లో అకడమిక్ భాగస్వామ్యం వహిస్తున్నట్లు మంత్రి లోకేష్‌కు మార్నీ వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... పబ్లిక్ పాలసీ, సస్టైనబిలిటీ, ఇన్నోవేషన్ రంగాల్లో సంయుక్త కార్యక్రమాల కోసం ఏపీ-గ్రిఫిత్ భాగస్వామ్య ఏర్పాటుకు చొరవ చూపాలని ప్రతిపాదించారు. "పరిశోధన, విద్యార్థుల మార్పిడి, అవగాహన కార్యక్రమాలను సమన్వయం చేసేలా గ్రిఫిత్ యూనివర్సిటీ ఇండియా సెంటర్ లేదా హబ్‌ను ఏపీలో ఏర్పాటు చేయండి. సిలబస్ రూపకల్పన, నైపుణ్య ధృవీకరణ, గ్లోబల్ అకడమిక్ ప్రమాణాల కోసం ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాలు, ఏపీఎస్ఎస్‌డీసీ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్)తో భాగస్వామ్యం వహించండి. పునరుత్పాదక శక్తి, వాతావరణ స్థితిస్థాపకత, ప్రజారోగ్యం, నీటి నిర్వహణ రంగాల్లో సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు ప్రారంభించండి. గ్రిఫిత్ యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ విద్యాసంస్థల మధ్య డ్యూయల్-డిగ్రీ లేదా ట్విన్నింగ్ ప్రోగ్రామ్‌లను (ఉదా: ఎస్ఆర్ఎం-ఏపీ, ఆంధ్రా యూనివర్సిటీ, విఐటి-ఏపీ.. స్కాలర్‌షిప్‌లు, అధ్యాపకులు, విద్యార్థుల అభివృద్ధికి ఎక్స్చేంజి కార్యక్రమాలను ప్రోత్సహించడం) అభివృద్ధి చేయండి.

ఈ ఏడాది నవంబర్ 14, 15 తేదీల్లో ఏపీలో నిర్వహించే పార్టనర్‌షిప్ సమ్మిట్ -2025, ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫోరమ్ సమావేశాలకు హాజరుకండి. గ్రిఫిత్ విశ్వవిద్యాలయ ఆవిష్కరణ, స్టార్టప్ మద్దతునిచ్చేలా ఆంధ్రప్రదేశ్ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో కలిసి పనిచేయొచ్చు" అని మంత్రి లోకేష్ ప్రతిపాదించారు.

# ఆక్వా వృద్ధికి సహకారం

**జేమ్స్ కుక్ వర్సిటీ ప్రొఫెసర్ క్యాల్ జెంజర్‌తో లోకేష్ భేటీ**



ఆస్ట్రేలియా (బ్రిస్బేన్): జేమ్స్ కుక్ యూనివర్సిటీలో సెంటర్ ఫర్ సస్టయినబుల్ ట్రోఫికల్ ఫిషరీస్ అండ్ అక్వా కల్చర్ విభాగం ప్రొఫెసర్ క్యాల్ జెంజర్‌తో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఉష్ణమండల ఆక్వాసాగులో కీలకమైన బ్లాక్ టైగర్, బారాముండి రకాల రొయ్యల జన్యుపరమైన మెరుగుదల పరిశోధనలకు ప్రొఫెసర్ జెంజర్ నాయకత్వం వహించారు. ఆక్వాసాగు సామర్థ్యాన్ని పెంచే జన్యుసంబంధ సాధనాల అభివృద్ధికి కృషిచేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో రొయ్యలు, చేపల పెంపకం సామర్థ్యాన్ని పెంచేందుకు సీఎస్‌టీఎఫ్ఏ ద్వారా ఆక్వాకల్చర్ జెనెటిక్స్ నైపుణ్యాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. బ్లాక్ టైగర్ రొయ్యలతో భారత్‌లో ప్రధానంగా ఉత్పత్తి చేసే ఆక్వా రకాల్లో వ్యాధి నిరోధకత, వృద్ధిరేటు కోసం జన్యుపరమైన మెరుగుదలకు కృషి చేయాలని కోరారు. "పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడానికి వాటర్ రీసైక్లింగ్, ఫీడ్ ఆప్టిమైజేషన్‌ను ప్రోత్సహించండి. ఆధునిక ఆక్వా సాగు పద్ధతులు, జన్యుపరమైన ఎంపిక, స్థిరమైన నిర్వహణ పద్ధతులపై ఆంధ్రప్రదేశ్ ఆక్వా రైతుల కోసం శిక్షణ కార్యక్రమాలు రూపొందించండి. ఎంపిక చేసిన బ్రీడ్ల ద్వారా ఉత్పాదకత పెంపుదలకు మీరు అభివృద్ధి చేసిన జెనెటిక్ టూల్స్‌ను మా ఆక్వా రైతులకు అందించండి. ఆక్వాసాగులో నష్టాలను తగ్గించి ఉత్పత్తిని స్థిరీకరించడానికి ఏఐ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి సహకరించండి" అని మంత్రి లోకేష్ కోరారు.

# భారత్ - ఆస్ట్రేలియా వాణిజ్యంలో ఏపీ కీలకపాత్ర

- **భారత్‌లో పెట్టుబడులకు గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్**
- **బ్రిస్బేన్ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్**



ఆస్ట్రేలియా (బ్రిస్బేన్): బ్రిస్బేన్‌లోని భారత రాయబార కార్యాలయంలో నిర్వహించిన బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశానికి రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. సమావేశంలో భారత కాన్సులేట్ జనరల్ (బ్రిస్బేన్) నీతూ ఎం భాగోటియా, ఆస్ట్రేలియా-ఇండియా బిజినెస్ కౌన్సిల్ (ఏఐబీసీ) ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... భారత్-ఆస్ట్రేలియాల నడుమ స్నేహపూర్వక ద్వైపాక్షిక వాణిజ్యం కొనసాగుతోందన్నారు. భారత్‌నుంచి ఆస్ట్రేలియాకు కీలకమైన ఎగుమతుల్లో శుద్ధిచేసిన పెట్రోలియం, ఔషధాలు, ఇంజనీరింగ్ వస్తువులు, విద్యుత్ యంత్రాలు, వస్త్రాలు, ఆభరణాలు, వ్యవసాయ ఉత్పత్తులు ఉండగా, ఇందులో ఏపీ ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. 2022 డిసెంబర్‌లో అమలులోకి వచ్చిన ఆస్ట్రేలియా-భారత్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ ట్రేడ్ అగ్రిమెంట్ (ఈసీటీఏ) ఇరుదేశాల నడుమ వాణిజ్య సంబంధాలకు గేమ్ ఛేంజర్‌గా మారింది. 2020-21 ఇరుదేశాల నడుమ వస్తు వాణిజ్య కార్యకలాపాలు 12.2 బిలియన్ డాలర్లు ఉండగా, 2024-25 నాటికి దాదాపు రెట్టింపై 24.10 బిలియన్ డాలర్లకు చేరాయన్నారు.

"ఆంధ్రప్రదేశ్‌లో విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అమలు చేస్తోంది. ఫలితంగా గత 16నెలల కాలంలో ఏపీకి రూ.10లక్షల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు వచ్చాయి. ఇటీవల గూగుల్ సంస్థ విశాఖలో రూ.1.33 లక్షల కోట్లతో ఏఐ హబ్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇది భారతదేశ చరిత్రలో అతి పెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిగా ఉంది. ఆర్సెలర్ మిట్టల్ సంస్థ రూ.1.35 లక్షల కోట్లతో అనకాపల్లి సమీపంలో దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ నిర్మించబోతోంది. ప్రస్తుతం భారత్‌లో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గేట్‌వేగా మారింది. ఏపీలో పరిశ్రమదారుల కోసం సులభతరమైన పాలసీలను రూపొందించి అమలు చేస్తున్నాం. వచ్చేనెల 14,15 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ -2025కి హాజరై ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న పారిశ్రామిక పాలసీలు, ప్రోత్సాహకాలు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను తెలుసుకోవచ్చు. అందుకు పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు హాజరవ్వండి" అని ఆస్ట్రేలియా పారిశ్రామికవేత్తలకు లోకేష్ విజ్ఞప్తి చేశారు.



# ‘ఫ్యూచర్ జర్నీ’ని ఎక్స్‌పీరియన్స్ చేసిన చంద్రబాబు

యుఏఈ పర్యటనలో భాగంగా దుబాయ్ ఫ్యూచర్ మ్యూజియంను మంత్రులు, అధికారులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సందర్శించారు. దుబాయ్ దీన్ని లివింగ్ మ్యూజింగ్‌గా రూపొందిస్తోంది. అంతరిక్షం, వాతావరణం, ఆరోగ్యం, విద్య, వైద్యం, ఏఐవంటి రంగాల్లో భవిష్యత్ ఆవిష్కరణలు ఏవిధంగా ఉండబోతున్నాయనేది టెక్నాలజీని ఉపయోగించి మ్యూజియంలో ప్రదర్శనలు చేస్తున్నట్టు అక్కడి అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు బృందానికి వివరించారు. ఫ్యూచర్ జర్నీ పేరిట ఏర్పాటు చేసిన ఎక్సీపీరియన్స్ జోన్‌ను సీఎం చంద్రబాబు సందర్శించారు.



# ఏపీలో హైస్కూల్‌నుంచే ఏఐ



- పాఠ్యాంశాలు, ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నాం..
- ఏఐ విప్లవం ద్వారా వచ్చే అవకాశాలను అందుకోవడమే లక్ష్యం
- విద్యారంగ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేష్

ఆస్ట్రేలియా (బ్రిస్బేన్): విద్యారంగ సంస్కరణల్లో ఆంధ్రప్రదేశ్ భారత్‌లో ముందువరుసలో ఉందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. విద్యారంగంపై క్వీన్స్ ల్యాండ్ ట్రేడ్ మరియు ఇన్వెస్టిమెంట్ సెంటర్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ... అంతర్జాతీయంగా అధునాతన సాంకేతికతలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఏపీలో హైస్కూలు స్థాయినుంచే ఏఐ పాఠ్యాంశాలను ప్రవేశపెడుతున్నామని, ఉన్నత పాఠశాలల్లో ఏఐ ల్యాబ్‌లు, స్టెమ్, రోబోటిక్స్ ల్యాబ్‌లను ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. ఏఐ విప్లవం ద్వారా వచ్చే అవకాశాలను ఏపీలోని యువత అందుకు నేందుకు ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్నట్టు తెలిపారు. ఏపీలో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. గవర్నెన్స్‌లో ఏఐ వినియోగం ద్వారా అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. ఏఐ ద్వారా విద్య, వైద్యం, ఆరోగ్య రంగాల్లో మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో భారత కాన్సులేట్ జనరల్ (బ్రిస్బేన్) నీతూ భాగోటియా, క్వీన్స్‌ల్యాండ్ యూనివర్సిటీ డిప్యూటీ వైస్ ఛాన్సలర్ మార్క్ హార్వే, క్వీన్స్ ల్యాండ్ గ్లోబల్ ఇన్వెస్టిమెంట్ కమిషనర్ మిచైల్ మాథ్యూస్, డైరెక్టర్ ఇంటర్నేషనల్ మార్కెట్ గార్బియేల్ ట్రూన్, స్టడీ క్వీన్‌ల్యాండ్ అడిషనల్ డైరెక్టర్ స్టెఫానీ హంటర్, జేమ్స్ కుక్ యూనివర్సిటీ మెరైన్ బయోలజీ, ఆక్వాకల్చర్ ప్రొఫెసర్ క్యాల్ జెంజర్, యూనివర్సిటీ ఆఫ్ సదరన్ క్వీన్ ల్యాండ్ ప్రొ. వైస్ ఛాన్సలర్ రెన్ యూ, సిక్యూ యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ (ఇంటర్నేషనల్ ఆపరేషన్స్) మీనూ ఇస్సార్, యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్ ల్యాండ్ సెంటర్ డైరెక్టర్ (క్వాంటమ్ సిస్టమ్స్) ఆండ్రూ రైట్, స్ట్రాటజీ మేనేజర్ శరవణన్, ఎడ్యుకేషన్ క్వీన్స్‌ల్యాండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డంకెన్ మెక్ కెల్లర్ తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ హబ్‌కు డిజైన్లు ఇవ్వండి

- ఏపీని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం
- పాపులస్ సంస్థ’తో భేటీలో లోకేష్ ప్రతిపాదన



ఆస్ట్రేలియా (బ్రిస్బేన్): పాపులస్ సంస్థ సీనియర్ ప్రిన్సిపల్ ఆర్కిటెక్ట్ షాన్ గల్లఘర్, పాపులస్ ఆసియా పసిఫిక్ బిజినెస్ డెవలప్ మెంట్, బిడ్స్ అండ్ కమ్యూనికేషన్ హెడ్ ఎలిజిబెట్ డిసిల్వాలతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ బ్రిస్బేన్‌లో భేటీ అయ్యారు. ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన స్టేడియాలకు వినూత్నమైన డిజైన్ రూపకల్పన, నిర్మాణంలో పాపులస్ ఆర్కిటెక్ట్స్ సంస్థ పేరొందింది. క్రీడా సౌకర్యాలు, మైదానాలు, ఈవెంట్ స్థలాల డిజైనింగ్, నిర్మాణంలో 40సంవత్సరాలకు పైగా అనుభవం కలిగిన పాపులస్ 60 బిలియన్ డాలర్ల విలువైన 3,500కు పైగా ప్రాజెక్టులను చేపట్టింది. అహ్మదాబాద్‌లోని సర్దార్ పటేల్ స్టేడియం, యూకేలోని లండన్ ఒలింపిక్ స్టేడియం, కాలిఫోర్నియాలోని సోఫీ స్టేడియం, అట్లాంటా జార్జియాలోని మెర్సిడస్ బెంజ్ స్టేడియం, న్యూయార్క్‌లోని యాంకీ స్టేడియంల డిజైన్లు పాపులస్ సంస్థ రూపొందించినవే. భారత్‌లో ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై ఎల్ అండ్ టీతో కలసి పనిచేస్తోంది. దేశవ్యాప్తంగా ప్రాంతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలకు మద్దతు ఇచ్చే క్రీడా సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది.

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌ను స్పోర్ట్స్ హబ్‌గా మార్చాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్‌కు అనుగుణంగా అత్యాధునిక స్పోర్ట్స్ స్టేడియంలు, శిక్షణా సౌకర్యాలకు డిజైన్లు అందించి క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రపంచ పర్యావరణ ప్రమాణాలతో స్థిరమైన, ఎనర్జీ ఎఫీషియంట్ స్పోర్ట్స్, ఎంటర్‌టైన్‌మెంట్ వేదికల నిర్మాణానికి ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేయాలని ఆహ్వానించారు. క్షేత్రస్థాయిలో క్రీడలు, ప్రజారోగ్య కార్యక్రమాలను ప్రోత్సహించడానికి కమ్యూనిటీ క్రీడా సముదాయాలు, వినోద స్థలాల అభివృద్ధికి కమ్యూనిటీ సెంట్రిక్ డిజైన్లు అందించాలని విజ్ఞప్తి చేశారు. టూరిజం, స్థానిక ఆర్థిక వ్యవస్థలకు ఊతమిచ్చేలా సాంస్కృతిక, క్రీడలు, వినోద కార్యక్రమాల నిర్వహణకు ఇంటిగ్రేటెడ్ ఈవెంట్ స్పేస్ అభివృద్ధికి పట్టణ ప్రణాళిక ప్రాజెక్టులపై డిజైనింగ్ సహకారాన్ని అందించాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

# ‘కల్తీ’ పాపాత్ముడు జగనే!

- జగన్ హయాంలో ఏరులైన పారిన కల్తీ మద్యం
- తాడేపల్లి ప్యాలెస్‌లో కల్తీ తయారీకి ప్రణాళికలు
- తిరిగి.. కూటమి ప్రతిష్టకు భంగం కలిగేలా కుట్రలు
- రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి సవిత ఫైర్
- త్వరలోనే కల్తీ మద్యం వాస్తవాలు బయటపెడతామని హెచ్చరిక



అమరావతి (చైతన్య రథం): కల్తీ మద్యం పాపాత్ముడు జగనే అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. అయిదేళ్ల జగన్ పాలనలో కల్తీ మద్యం ఏరులై పారిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ట మంటగలిపేలా తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా కల్తీ మద్యం తయారీ కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అయిదేళ్ల జగన్ పాలనలో జే బ్రాండ్ పేరుతో కల్తీ మద్యానికి అధికారిక ముద్ర విచ్చలవిడిగా అమ్మకాలు చేశారన్నారు. ఆ 5 ఏళ్లలో కల్తీ మద్యం తాగి 30 వేల మంది ప్రాణాలు కోల్పోగా, 30 లక్షల మంది అమాయకులు అనారోగ్యం పాలయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. జంగారెడ్డి గూడెంలో కల్తీ నాటుసారా తాగి 27 మంది ప్రాణాలు కోల్పోతే కనీసం పోస్టు మార్టమైనా చేయకుండా, విచారణ జరపకుండా కేసు తప్పుదారి పట్టించారన్నారు. గతంలో విజయవాడలోని వైసీపీ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బార్ లో కల్తీ మద్యం తాగి ఆరుగురు మృతిచెందడం వాస్తవం కాదా..? అని నిలదీశారు. 2014 ఎన్నికల సమయంలో సర్వేపల్లి, కావలి నియోజక వర్గాల వైసీపీ అభ్యర్థులు కాకాణి గోవర్దన్ రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పంపిణీ చేసిన కల్తీ మద్యంతాగి ఎందరో అమాయకులు మరణించడం నిజం కాదా..? అని ప్రశ్నించారు. జగన్ అయిదేళ్ల పాలనలో బ్రాండెడ్ మద్యం అమ్మకాలను నిలిపేసి, జే బ్రాండ్ పేరుతో కల్తీ మద్యాన్ని అధిక ధరలకు విక్రయించి, పేదల రక్తమాంసాలు పీల్చిపిప్పి చేసి రూ.3,500 కోట్లు దోచుకున్నారన్నారు. దోచుకున్న డబ్బుతో ఆఫ్రికా దేశాల్లో కల్తీ మద్యం తయారు చేసి విక్రయిస్తున్నార న్నారు. ఇదే విషయం కామెరూన్ లో అక్కడి మంత్రి చెప్పడం వాస్తవం కాదా... రెడ్డీస్ గ్లోబల్ ఇండస్ట్రీస్‌ను సీజ్ చేయడం నిజం కాదా..? అని ప్రశ్నించారు.

### తాడేపల్లి ప్యాలెస్‌లో కుట్రలు

కూటమి ప్రభుత్వం ప్రతిష్టకు భంగం కలిగేలా తాడేపల్లి ప్యాలెస్ లో కల్తీ మద్యం తయారీ ప్రణాళికలు రచిస్తున్నారని మంత్రి సవిత విమర్శించారు. నకిలీ మద్యం తయారీకి జోగి రమేష్, ఏ–1 జనార్దన రావు జగన్ ఇంటిలోనే ప్రణాళికలు రచించారన్నారు. రాష్ట్రంలో అలజడి, అశాంతిని సృష్టించడానికి కుట్రలు పన్నుతున్నారని వైసీపీ నాయకులపై మంత్రి సవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. అయిదేళ్ల జగన్ పాలనలో కల్తీ మద్యం అక్రమాలు బయటకొస్తుండడంతో, డైవర్షన్ రాజకీయాలకు వైసీపీ నాయకులు తెరతీశారన్నారు.

### కల్తీ మద్యంపై ఉక్కుపాదం

రాష్ట్రంలో కల్తీ మద్యం తయారీ, అమ్మకాలపై సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని మంత్రి సవిత వెల్లడించారు. జగన్ హయాంలో మూడు లక్షలకు పైగా బెల్ట్ షాపులుంటే, ప్రస్తుతం వాటిని పూర్తిగా మూయించామని తెలిపారు. బెల్ట్ షాపు తెరిస్తే రూ.5 లక్షల ఫైన్ వేస్తున్నామన్నారు. మొలకల చెరువు మద్యం తయారీ ఘటనపై ఇప్పటికే అయిదుగురు ఐపీఎస్ లతో సిట్ ఏర్పాటు చేశామని, త్వరలోనే వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతామని మంత్రి సవిత వెల్లడించారు. కల్తీ మద్యం ఆరోపణలు రాగానే, వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన జయచంద్రారెడ్డిని, కట్టా సురేంద్రనాయుడిని సీఎం చంద్రబాబు పార్టీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. ఇదీ తమ పార్టీకి, ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని అన్నారు. కల్తీ మద్యంలో నిందితులుగా ఉన్న ఎంపీ మిథున్ రెడ్డిని, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని, ఇతర వైసీపీ నాయకులను పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదని మంత్రి ప్రశ్నించారు. జగన్ కు, తాడేపల్లి ప్యాలెస్‌కు కల్తీ మద్యం పాత్ర ఉండబట్టే, వారిని వెనుకేసుకొస్తున్నారన్నారు. రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని అడ్డుకట్టవేయడానికి సురక్షా యాప్ రూపొందిస్తున్నామన్నారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, చిత్తూరులో నూతన మద్యం పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మద్యం నాణ్యతను పరీక్షించడానికి 13 రకాల ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఈఎన్ఏ) పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. దేశ, విదేశాలకు బ్రాండ్ మద్యాన్ని అందుబాటులో ఉంచామన్నారు. తమ ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు.

# సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్

- దేశానికే ఆయన మార్గదర్శిగా నిలిచారు
- పాయకరావుపేటలో విగ్రహావిష్కరణ
- పాల్గొన్న హెూంమంత్రి వంగలపూడి అనిత

పాయకరావుపేట (చైతన్యరథం): అనకాపల్లి జిల్లా పాయక రావుపేట నియోజకవర్గంలో హెూంమంత్రి వంగలపూడి అనిత, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించారు. టీడీపి శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. టీడీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, జనసేన పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చా ర్జ్ గెడ్డం బుజ్జి, ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బహి రంగ సభలో మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదా కుమారి, బొలిశెట్టి గోవింద్ టీడీపీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ తెలుగువారు కాలర్ ఎగరేసి నేను తెలుగువాడిని అని చెప్పుకునేలా చేసిన ఘనత అన్న ఎన్టీఆర్‌దే. అటువంటి మహనీయుని విగ్రహావిష్కరణలో పాల్గొనడం గర్వంగా ఉంది. ఎన్టీఆర్ రాకతోనే తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచవ్యాప్త మైంది. ఇప్పుడు దేశంలో ప్రభుత్వాలు చెప్పుకుంటున్న సంక్షేమ పథకాలకు ఆద్యుడు అన్న ఎన్టీఆర్. రూ.2కే కిలో బియ్యం, జనతా వస్త్రాలు, పక్కా ఇళ్ల పథకాలతో ప్రజల కోసం ఆలోచించిన వ్యక్తి. మహిళలకు రిజర్వేషన్లు, మహిళా యూనివర్సిటీ, ఆస్తి హక్కు తీసుకొచ్చి మహిళలను గౌరవించుకు న్నారు. టీడీపీ స్థాపించి 43 ఏళ్లు పూర్తయినా చెక్కుచెదరలేదన్నారు.



### అభివృద్ధిని ఓర్వలేక విమర్శలు

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూడలేక జగన్‌రెడ్డి కుట్రలకు తెరలేపాడు. అధికారంలో ఉన్న ఐదేళ్లు అక్రమ కేసులు, వేధింపులతో అవస్థలకు గురి చేసిన జగన్‌రెడ్డి.. ఇప్పుడు నీతులు చెబుతున్నాడు. కూటమి ప్రభుత్వం పై ప్రజల్లో అపోహలు కల్పించేలా వైసీపీ నేతలతో కల్తీ మద్యం తయారు చేయించి.. నిందను ప్రభుత్వంపై వేస్తున్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో రాష్ట్రంలో ప్రజల మధ్య విభేదా లు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాడు. కూటమి పాలనలో పెన్షన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత బస్సు, ఆటో డ్రైవర్ల కు రూ.15 వేల ఆర్థిక సాయం అందించాం. అప్పుడు మైక్రో సాఫ్ట్.. ఇప్పుడు గూగుల్ తీసుకొచ్చాం. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ తీసుకొచ్చాం. రాయలసీమలో పరిశ్రమలు, సీడ్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూడలేక విమర్శలు చేస్తున్నారు. నాడు ఐటీ గురించి మాట్లాడితే.. కంప్యూటర్లు కూడు పెడతా యా అన్నారు.. నేడు ఐటీ అంటే ఏంటో చూస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా ఇంత మంది తెలుగువారు ఐటీ రంగంలో రాణించ డానికి చంద్రబాబు విజన్ కారణం. గూగుల్ కోసం దేశంలోని అన్ని రాష్ట్రాలు పోటీ పడుతుంటే వైసీపీ నేతలు మాత్రం వద్దు అంటున్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కేంద్రం కూడా అండగా నిలుస్తోంది. ప్రభుత్వం మరో 15 ఏళ్లు కూటమి ప్రభుత్వం కొనసాగితే దేశంలోనే ఏపీ అగ్రస్థానంలో నిలుస్తుంది. జగన్ పాలనలో విశాఖలో భూములు దోచుకున్నా రు.. నేడు పరిశ్రమలు ఏర్పాటు చేసి విలువ పెంచుతున్నాం. రాయలసీమలో ఫ్యాక్షన్ విస్తరణకు జగన్ కుట్రలు చేస్తే.. కూటమి ప్రభుత్వం నీరు పాటించి ఉపాధి కేంద్రం గా మార్చింది. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించే వారికి అండగా నిలవండి. గత ఐదేళ్లు కల్తీ మద్యంతో దోచుకుని.. ఇప్పుడు కూటమిపై నెట్టేందుకు కుట్రలు చేస్తే మొత్తం భగ్నం చేశాం. కులాలు, మతాల మధ్య, ప్రాంతాల మధ్య కుట్రలు చేయడాన్ని ప్రజలంతా ఏకమై తిప్పి కొట్టాలని సూచించారు. అభివృద్ధి కోసం కష్టపడే పాలకులను, ప్రభుత్వాని కి అండగా నిలవాలని విన్నవించారు. అప్పుడు అభివృద్ధి చూడటానికి 20 సంవత్సరాలు పట్టింది.. నేడు పరిస్థితి మారింది..10 సంవత్సరాల్లోనే అభివృద్ధి చూడ బోతున్నాం. మంచి చేయాలనుకునే ప్రభుత్వానికి కుట్రల తో ఇబ్బంది పెట్టాలని చూస్తే ప్రజలు సహించబోరని హెచ్చరించారు.

# కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి

- 75 శాతం కన్నా ఎక్కువ మంది సానుకూలం
- ఆర్టీజీఎస్ సర్వేలో మెరుగైన ఫలితాలు
- సమాచార మంత్రి కొలుసు పార్థసారథి

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలపై 75 శాతం మందికి పైగా సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆర్టీజీఎస్ సర్వేలో వెల్లడైనట్లు గృహ నిర్మాణ, సమాచార మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆర్టీజీఎస్ ద్వారా ప్రజల నాడి, ప్రభుత్వ సేవలు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఎప్పటికప్పుడు సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలి పారు. మిగిలిన 25 శాతం అసంతృప్తికి కారణాలు తెలుసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టనున్నామని, నూటికి నూరు శాతం కూట మి పాలనపై ప్రజల్లో సంతృప్తి స్థాయిని సాధించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. సచివాలయం ప్రచార విభాగంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీజీఎస్ పని తీరుపై సీఎం చంద్రబాబు నిర్వహించిన సమీక్షలో ప్రజల సంతృప్త స్థాయి 75 శాతంకు పైగా ఉండటం తెలుసుకుని హర్షం వ్యక్తం చేశారన్నారు. అయితే నూటికి నూరు శాతం సంతృప్త స్థాయి చేరే వరకు కృషి చేయాలని ఆయా శాఖాధిపతులను ఆదేశించారని మంత్రి తెలిపారు.




పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించడం జరిగిందన్నారు. విద్యుత్ వినియోగంలో లో ఓల్టేజీ, విద్యుత్ కోత లు లేకుండా చూసుకోవాలని సీఎం ఆదేశించారు. సబ్ స్టేషన్ ఒక యూనిట్‌గా తీసుకుని సర్వే నిర్వహించడం జరిగిందని వివరించా రు. రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తున్నదని, ప్రభుత్వం ఏర్పడి కేవలం ఏడాదిన్నర కాలంలోనే 34 క్యాబినెట్ సమావేశాలు, 26 ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించి రాష్ట్రంలో భారీస్థాయిలో పెట్టుబడులు పెట్టే అంశాలపై నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. దాదాపు రూ.7.65 లక్షల కోట్లకు పైనే పెట్టుబడులు రాష్ట్రానికి రావడం జరిగిందని, తద్వారా 182 ప్రాజెక్టుల్లో 7.21 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిం దన్నారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న ధ్యేయంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.


### హౌసింగ్ బిల్లులు త్వరలో చెల్లింపు

ఉచిత ఇసుక పాలసీ వల్ల ప్రభుత్వానికి వేల కోట్ల ఆదాయం రాకపోయినా త్యాగం చేసి మరీ ఉచిత ఇసుక అందిస్తున్నామ న్నారు. అలాగే హౌసింగ్‌లో ఏ విషయంలో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారో తెలుసుకుని ఆయా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించిందని, హౌసింగ్ బిల్లులు త్వరలోనే చెల్లించనున్నామ న్నారు. వాట్సప్ గవర్నెన్స్‌లో భాగంగా 741 సేవలు అందుబా టులోకి తీసుకువచ్చామని, కానీ ప్రజలు ఆశించినంత స్థాయిలో సద్వినియోగం చేసుకోవడం లేదని సీఎం చంద్రబాబు సమీక్షలో గుర్తించారన్నారు. ఈ సేవలను యూజర్ ఫ్రెండ్లీగా రూపొందించ డానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అవేర్ సాఫ్ట్‌వేర్ ద్వారా 42 సర్వీసులు ప్రజలకు అందించడం జరుగుతుందని వివరించారు. ఇప్పటికే 27 సర్వీసులు అందుబాటు లోకి తీసుకురావడం జరిగిందన్నారు. ముఖ్యంగా వేసవిలో వేడి గాలులు, వర్షాకాలంలో పిడుగులు పడే ప్రాంతాలు, భారీ వర్షాలపై ప్రజలను అప్రమత్తం చేసే మెసేజ్‌లు ప్రజలకు చేరవేయడంలో ముందున్నామ న్నారు. తుఫాన్ ప్రభావంకు గురయ్యే ప్రాంతాలను సైతం ఖచ్చితత్వంతో కూడిన సమాచారం అందిస్తున్నామన్నారు. సాంకేతికతను సద్వి నియోగం చేసుకోవడంతో పాటు ప్రజలకు ఆ సేవలు ఉపయో గపడేలా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు.

### డ్రోన్ పాలసీతో సేవలు

డ్రోన్ పాలసీ రూపొందించిన తర్వాత రాష్ట్రంలో 2,10,047 గంటలకు పైగా డ్రోన్లను వినియోగించడం జరిగిందన్నారు. ప్రభుత్వ సేవలకు 64,759 గంటలు, ప్రైవేట్‌గా 1,45,288 గంటలు వినియోగించడం జరిగిందన్నారు. అలాగే పంట పోలాల కు పురుగు మందులు పిచికారి చేయడానికి లక్షన్నరకు పైగా గంటలు వినియోగించినట్లు వివరించారు. డ్రోన్ల ద్వారా పురుగు మందులు పిచికారి చేయడం వల్ల ఎంత మేర ప్రయోజనం చేకూరిందన్న అంశంపై గణన జరుగుతుందన్నారు. డ్రోన్ల విని యోగం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కర్నూల్‌లో తయారైన డ్రోన్లు ఆపరేషన్ సిందూర్‌లో వినియోగిం చామని, వాటి పనితీరు భేష్ అని సాక్షాత్తు ప్రధాని మోదీ మెచ్చుకు న్న విషయం ఈ సందర్భంగా గుర్తుచేశారు. పక్కా ఇళ్లు మంజూరు చేయాలని ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో ముఖ్యమం త్రి చంద్రబాబు అర్బన్ ప్రాంతాల్లో 50 వేల ఇళ్లను ఇప్పటికే మంజూరు చేయడం జరిగిందని, మరిన్ని దరఖాస్తులు వస్తే ఇంకా మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గృహాలు లేనివారు నవంబర్ 5 లోపు అర్బన్ హౌసింగ్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# ఏపీలో 14 జిల్లాలకు ఫ్లాష్‌ఫ్లడ్ అలెర్ట్



- పలు జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం
- అధికారులతో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమీక్ష
- ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశం

అమరావతి (చైతన్యరథం): ఏపీలో 14 జిల్లాలకు ఫ్లాష్‌ఫ్లడ్ హెచ్చరికలు జారీ అయ్యాయి. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, అనంతపురం, సత్యసాయి, కర్నూలు జిల్లాలకు అప్రమత్తంగా ఉండాలని అలెర్ట్ జారీ చేశారు. గుంటూ రు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు ఫ్లాష్‌ఫ్లడ్ అలెర్ట్ జారీ అయింది. ఈ జిల్లాలో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అల్పపీడన ప్రభావంతో రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలపై ఆర్‌అండ్‌బీ శాఖ ఈఎన్సీతో రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమీక్షించారు. దుబాయ్ పర్యటనలో ఉన్నప్ప టికీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలో పరిస్థితులను అధికా రులు అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో బల హీనంగా ఉన్న రోడ్లకు గండ్లు పడి, కోతకు గురయ్యే అవకా శం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రాయలసీమ, దక్షిణ కోస్తా ప్రాంతాలు ఫ్లాష్ ఫ్లడ్‌కు గురయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేప థ్యంలో.. ఏదైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఫ్లాష్ ఫ్లడ్‌ల కారణంగా నదులు, కాలు వలు, వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం పొంచి ఉన్న నేప థ్యంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా సాధ్యమైనంత వేగంగా పునరుద్ధరణ పనులు చేపట్టాలని, ఎక్కడైనా కల్వర్టులు కూలితే ప్రజా రవాణాకు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఫ్లాష్ ఫ్లడ్ లకు అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యం లో అత్యవసరమైతే తప్ప ప్రజలు రోడ్లపైకి రావద్దని సూచించారు.

# ప్రసూతి వైద్యసేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- జిల్లాల్లో మరణాలపై మెటర్నల్ డెత్ ఆడిట్
- పిఠాపురం ఘటనపై తక్షణ నివేదిక పంపాలి
- ఆసుపత్రి వైద్యురాలి పనితీరుపై విచారణ
- ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశం
- కాకినాడ కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్
- శ్రీదుర్గ కుటుంబానికి సానుభూతి



అమరావతి (చైతన్యరథం): ఆధునిక వైద్య విధానాలు అందుబా టులో ఉన్న తరుణంలో ప్రసూతి సమయంలో అందించే సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి ఎప్పటిక ప్పుడు ఇందుకు సంబంధించిన సేవలపై అనుభవజ్ఞులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. బుధవారం మధ్యాహ్నం క్యాంపు కార్యాలయం నుంచి కాకినాడ జిల్లా కలెక్టర్, పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథా రిటీ (పడా) ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇటీవల పిఠాపురం నియోజకవర్గం చేబ్రోలుకు చెందిన దొండ పాటి శ్రీదుర్గ పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో బిడ్డను ప్రసవించిన అనంతరం అపస్మారక స్థితికి చేరుకోవడం, కాకినాడ ఆసుపత్రికి తర లించగా మృతిచెందిన ఘటనపై సమీక్ష నిర్వహించారు. ప్రసూతి సమ యంలో వైద్య సేవల విషయంలో ఏ దశలోనూ నిర్లక్ష్యంగా ఉండకూడదని, అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. గర్భిణులకు వైద్యం నుంచి ప్రసవం వరకూ, అనంతర వైద్యం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సక్రమంగా అందాలని చెప్పారు. పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యురాలి పనితీరు, ఇతర సిబ్బంది వ్యవహా రంపై విచారణ చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. పిఠాపు రం ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, నియో జకవర్గంలో వైద్యం అందించే విధానం అందరికీ ఒక మోడల్‌గా నిలవాలని.. ఆ దిశగా చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.

**ప్రసూతి మరణాలను సీరియస్‌గా తీసుకోవాలి**

కాకినాడ జిల్లాలో మెటర్నల్ డెత్ ఆడిట్ నిర్వహణ గురించి ఆరా తీశారు. ప్రసూతి మరణాలు సీరియస్‌గా తీసుకోవలసిన అంశమనీ, ఇలాంటి మరణాలు సంభవించినప్పుడు తక్షణమే నిపు ణులైన వైద్యుల బృందంతో సమగ్రంగా విచారణ చేసి కారణాలను నమోదు చేయాలని శ్రీ పవన్ కల్యాణ్ గారు స్పష్టం చేశారు. శ్రీమతి శ్రీదుర్గ ప్రసూతి మరణంపై, పుట్టిన బిడ్డ ఆరోగ్య స్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలోని కొన్ని ఆసుపత్రులపై వైద్యులు, ఇతర సిబ్బంది తమ విశ్వాసాల ప్రచారానికి ప్రాధాన్యం ఇస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని ప్రస్తావించి ప్రభుత్వ ఆసుపత్రులను వ్యక్తిగత విశ్వాసాల ప్రచారా నికి వేదికలుగా చేయకూడదన్నారు. పిఠాపురం నియోజకవర్గం చేబ్రోలుకి చెందిన శ్రీదుర్గ మరణంపై విచారం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో శాసనమండలి విప్ పిడుగు హరిప్రసాద్, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, పడా ప్రాజెక్ట్ డైరెక్టర్ చైత్ర పాల్గొన్నారు.

# ఆక్వా రంగ అభివృద్ధికి లోకేష్ కృషి అభినందనీయం

- ఆస్ట్రేలియాకు ఎగుమతులతో ఆక్వా బంధం
- ఏపీ రైతులకు కొత్త అవకాశాలకు నాంది
- ఏపీ ఆక్వా ఉత్పత్తుల నాణ్యత పెంపు
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర ఆక్వా రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి అభినందనీయమని వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశంసించారు. ఆస్ట్రేలియాతో ఆక్వా బంధం కొత్త అవకాశాలకు నాంది కానుందని పేర్కొన్నారు. అమెరికా విధించిన అధిక సుంకాల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఏపీ ఆక్వా ఉత్పత్తులకు కొత్త మార్కెట్లు కల్పించాలనే లోకేష్ దూరదృష్టి ప్రశంసనీయమన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఏపీ ఆక్వా రైతుల అభివృద్ధి దిశగా ఆలోచించిన మంత్రి లోకేష్ నిబద్ధతను అభినందించారు. ఆక్వా ఉత్పత్తుల నాణ్యత పెంపు, నిల్వ సామర్థ్యం, ప్రాసెసింగ్, కోల్డ్ చైన్, ప్యాకేజింగ్ రంగాల్లో ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల రైతులకు లాభం చేకూరుతుందని తెలిపారు. ఏపీ సీ ఫుడ్ బ్రాండ్‌కు అంతర్జాతీయ గుర్తింపు తేవాలన్న మంత్రి లోకేష్ సంకల్పం రాష్ట్రానికి గౌరవం తెస్తుందని అన్నారు. రాష్ట్రానికి 1,000 కిలోమీటర్ల విస్తీర్ణం గల సముద్రతీరం ఆక్వా పరిశ్రమకు బలమైన ఆధారమని, ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించ డంలో ప్రభుత్వం చురుకుగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, సాంకేతిక రంగాల్లో మంత్రి లోకేష్ చూపుతున్న ప్రగతిశీల ఆలోచనలను ప్రశంసిస్తూ.. వెస్టర్న్ సిడ్నీ వర్సిటీతో సంయుక్త పరిశోధన కార్యక్రమాలకు తీసుకుంటున్న చర్యలు ఆహ్వానించదగినవని అన్నారు. రైతులకు స్మార్ట్ ఫార్మింగ్ టెక్నాలజీ అందించే చర్యలు ప్రశంసనీయమని తెలిపారు. చంద్ర బాబు నాయకత్వంలో రాష్ట్రం పెట్టుబడుల వర్షం కురుస్తోందని, ఆక్వా రంగం అభివృద్ధి ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని పేర్కొన్నారు.



# నెట్వర్క్ ఆసుపత్రులకు రూ.250 కోట్లు

- త్వరలో మరో రూ.250 కోట్ల చెల్లింపు
- ఇబ్బంది రాకుండా వైద్యసేవలు అందించాలి
- వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్

అమరావతి(చైతన్యరథం): డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ అనుబంధ (నెట్వర్క్) ఆసుపత్రుల బకాయిల్లో రూ.250 కోట్లను ప్రభుత్వం బుధవారం రాత్రి విడుదల చేసింది. నిధుల చెల్లింపులపై రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆర్థిక మంత్రి పయ్యా వుల కేశవ్‌తో చర్చించారు. అనంతరం చర్యల్లో భాగంగా నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. అలాగే త్వరలో మరో రూ. 250 కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ తెలిపారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా వైద్య సేవలు కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్, ఇతర సంఘాల ప్రతినిధులను సౌరభ్ గౌర్ కోరారు. ఈ మేరకు బుధవారం తనను కలిసిన వారికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు.

# కీచకుడి భరతం పట్టండి..

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ
- తుని అత్యాచారయత్నం ఘటనపై సీరియస్
- ఘటనపై 48 గంటల్లో నివేదిక సమర్పించాలి
- కాకినాడ ఎస్పీకి ఫోన్‌లో ఆదేశాలు



అమరావతి (చైతన్యరథం): కాకినాడ జిల్లా తునిలో మైనర్ గురు కుల విద్యార్థినిపై జరిగిన అత్యాచారయత్న ఘటనపై మహిళా కమి షన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బంధువునంటూ విద్యార్థినిని పాఠశాల నుంచి తోటల్లోకి తీసుకెళ్లి వేధించిన కీచకుడి ఉదంతం బుధవారం వెలుగుచూసింది.

దీనిపై తక్షణమే స్పందించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. ఆ కీచకుడి భరతం పట్టాలని కోరారు. ఈ ఉదంతంపై కమిషన్ సుమోటోగా కేసును స్వీకరిస్తు న్నట్లు శైలజ చెప్పారు. కేసు దర్యాప్తును వేగవంతంగా నిర్వహిం చాలని, నిందితుడిపై పోక్సో చట్టం కింద కఠినమైన చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. మైనర్ బాలికలపై ఇలాంటి హేయమైన చర్యలకు పాల్పడిన ఏ స్థాయి వారైనా వదలకుండా కఠినంగా శిక్షించాల్సిందే నని చెప్పారు. బాధిత బాలికకు తక్షణ రక్షణ, వైద్య సహాయం, చట్టపరమైన మద్దతు అందించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఆదేశాలు జారీ చేశారు.

ఘటనపై పూర్తి నివేదికను 48 గంటల్లోగా కమిషన్‌కు సమర్పిం చాలంటూ జిల్లా పోలీసు శాఖకు నోటీసు జారీ చేశారు. భవి ష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా గురుకుల పాఠశాలల్లో భద్రతా చర్యలను కఠినతరం చేయాలని రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీకి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాయపాటి శైలజ మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతకు విరుద్ధమైన ఏ చర్యలైనా కమిషన్ సహించదని, నిందితులకు కఠినమైన శిక్ష విధించేలా న్యాయ ప్రక్రియను పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు.



# బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

**- వాయుగుండంగా మారే అవకాశం**
**- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
**- విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు**

అమరావతి (చైతన్యరథం): నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరి కలు జారీ చేసింది. గురువారం మధ్యాహ్నానికి నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని తెలిపింది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తా తీరాల వైపు కదులుతూ రానున్న 24 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని, దీని ప్రభావంతో నేడు ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. మిగతా జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. దక్షిణకోస్తా తీరం వెంబడి గంటకు 35-55 కిమీ వేగంతో ఈదురుగాలులు వీస్తా యని, చెట్ల కింద, భారీ హోర్డింగ్స్ వద్ద ఉండరాదని సూచించా రు. లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, పొంగిపొర్లే వాగులు, రోడ్లు దాటే ప్రయత్నం చేయరాదని హెచ్చరించారు.

# వాయుగుండం హెచ్చరికలతో హై అలెర్ట్

**- అధికారులతో హోంమంత్రి అనిత సమీక్ష**
**- జిల్లాల్లో 24/7 కంట్రోల్ రూమ్స్ సిద్ధం**
**- సహాయక చర్యలకు టోల్ ఫ్రీ నెంబర్లు**
**- యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశాలు**

అమరావతి (చైతన్యరథం): బంగాళాఖాతంలోని తీవ్ర అల్పపీడ నం రాబోయే 12 గంటల్లోపు వాయుగుండంగా బలపడనున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం హై అలెర్ట్ జారీ చేసింది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాల వైపు కదులుతూ ఆ తదుపరి 12 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని హెచ్చ రించింది. దక్షిణకోస్తా, రాయలసీమలో అతిభారీ వర్షాల నేపథ్యం లో విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులతో హోంమంత్రి వంగల పూడి అనిత సమీక్షించారు. బలమైన ఈదురుగాలులతో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప ప్రయా ణాలు చేయరాదని సూచించారు. సహాయక చర్యలకు ఎన్డీ ఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది సిద్ధంగా ఉండా లని ఆదేశించారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ 24/7 అలెర్ట్‌గా ఉండాలని సూచించారు. ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసు కోవాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని కోరారు. వాతావరణ పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక సందేశాలు పంపాలని ఆదేశించారు. సహాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలని సూచించారు. ప్రజలు సురక్షితమైన భవనాల్లో ఉండాలని హెచ్చరించారు.

# రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తం

**- సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలి**
**- మంత్రి అనగాని సత్యప్రసాద్**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రానికి వాయుగండం ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో రెవె న్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులను అప్రమత్తం చేశారు. దక్షిణ కోస్తా జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు సహాయక చర్యలకు సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, మత్స్యకారులు ఎవ్వరూ చేపల వేటకు వెళ్లకుం డా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల కార ణంగా ఎక్కడెక్కడ వాగులు పొంగుతాయో అక్కడి ప్రజలను ముందుగానే హెచ్చరించాలని సూచించారు. చెట్లు విరిగిపడే చోట ప్రజా రవాణాకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసు కోవాలని కోరారు. నెల్లూరు జిల్లాలో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా అధికారులంతా సహాయక చర్యల్లో పాల్గొ నాలని ఆదేశించారు.

# ఉపాధిహామీకి రూ.665 కోట్లు విడుదల

**❑ రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.166 కోట్లు**
**❑ పెండింగ్ బిల్లులు క్లియర్‌కు వెసులుబాటు**
**❑ కేంద్రానికి పవన్‌కళ్యాణ్ కృతజ్ఞతలు**



అమరావతి (చైతన్యరథం): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన మెటీరియల్ కాంపోనెంట్ కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతగా రూ.665 కోట్లను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ విడుదల చేసింది. ఈ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.166 కోట్లు జత చేసింది. మొత్తంగా రూ.831 కోట్ల నిధులతో ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి ఉన్న పెండింగ్ బిల్లులు క్లియర్ చేసే వెసులుబాటు కలు గుతుంది. రాష్ట్రంలో పంచాయతీ భవనాల నిర్మాణం, రికార్డులు కంప్యూటరీకరణ, సిబ్బంది, ప్రజా ప్రతినిధులకి శిక్షణ, ఇన్నోవేటివ్ ప్రాక్టీసెస్ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ (ఆర్‌జీఎస్ఏ) ద్వారా రూ.50 కోట్లు నిధులు విడుదల చేసింది. ఈ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.33 కోట్లు జత చేస్తుంది. ఏపీలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి, గ్రామాల్లో ఉపాధి హామీ పనుల ద్వారా అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు ప్రధాని మోదీ నేతృత్వంలోకి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహ కారానికి ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి లలన్ సింగ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. కేంద్రం ఇచ్చే నిధులకు రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ అందించేందుకు తగిన ఆదేశాలు ఇస్తున్న ముఖ్యమంత్రి చంద్రబా బుకు ధన్యవాదాలు తెలిపారు.

# వర్షాలపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

**● ప్రభావిత ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలి**
**● నెల్లూరు అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి రూ.165 కోట్లు**
**● దగదర్తిలో ఎయిర్‌పోర్టుకు త్వరలో శంకుస్థాపన**
**● కోవూరులో పరిశ్రమతో వేలమందికి ఉద్యోగాలు**
**● పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ**



నెల్లూరు (చైతన్యరథం): ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో అధికారు లు ఎలాంటి వాతావరణ పరిస్థితులునైనా ఎదుర్కునేందుకు సిద్ధం గా ఉండాలని, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర పుర పాలక పట్టణాభివృద్ధి మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు. బుధవారం నెల్లూరు గోమతి నగర్ మంత్రి క్యాంప్ కార్యాలయంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై అధికారులతో సమావేశం నిర్వ హించారు. వర్షాలు విపరీతంగా కురుస్తున్న కారణంగా చేపట్టాల్సి న చర్యల గురించి దిశ నిర్దేశం చేశారు. వర్షపు నీరు సులువుగా ప్రవహించేలా తగిన ఏర్పాట్లు చేపట్టాలని, ఈ క్రమంలో కాలు వలపై ఆక్రమణలు ఏమన్నా ఉంటే వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించారు. పలు అంశాలపై మంత్రికి అధికా రులు విన్నవించారు. చేపడుతున్న చర్యలను వివరించారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తు న్నాయ న్నారు. ఈ నేపథ్యంలో ఆత్మకూరులో అత్యధికంగా 146.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు. వర్షాల క్రమం లో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాం గం సిద్ధంగా ఉండాలన్నారు. వర్ష ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. అయితే కాలువల్లో పూడికతీత పనులు చేయడం వల్ల నెల్లూరు కార్పొరేషన్‌లో ఎక్కడా నీరు నిలవడం లేదన్నారు. అదేవిధంగా 123 మున్సిపాలిటీల్లో రూ.50 కోట్లతో పూడికతీత పనులు చేపట్టామని తెలిపారు. నెల్లూరు సిటీలో 47 పార్కులను అభివృ ద్ధి చేశామన్నారు. చంద్రబాబు నెల్లూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రూ.165 కోట్లు విడుదల చేశారని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని స్పష్టం చేశారు. దగదర్తిలో ఎయిర్‌పోర్టుకు త్వరలో సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేస్తారన్నారు. అలాగే కోవూరు షుగర్ ఫ్యాక్టరీ దగ్గర పరిశ్రమ ఏర్పాటు చేసి వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. నెల్లూరును మంచి మోడల్ సిటీగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. కొద్ది రోజులు ఓపిక పడితే ప్రతి ఇంటికి కొళా యి కనెక్షన్ ఇస్తామన్నారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వం సాన్ని సరి చేస్తున్నామని, గత ప్రభుత్వం ప్రజలకు అవసరమైన కనీస మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ తీసుకొచ్చామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. కావలికి టౌన్ ప్లానింగ్ వాళ్లు వెళ్లి పరిశీలి స్తే రాజకీయ రంగు పులుముతున్నారని తెలిపారు. నెల్లూరులో 3 అంతస్తులకు అనుమతులు తీసుకుని 7 అంతస్తులు కడితే వాటిని కూల్చేశామని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కడితే కూల్చడం ఖాయమన్నారు. పంట కాలువలను చాలా మంది ఆక్రమించారని, అలాంటి ఆక్రమాలలో వెంటనే తొలగిం చాలంటూ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శు క్లా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

**- ఇందుకు సంబంధించి భారత ప్రభుత్వానికి లేఖ రాశాం**
**- రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



అమరావతి (చైతన్య రథం): విశాఖ చేపలరేవు నుంచి ఈనెల 18న వేటకు బయలుదేరిన మత్స్యకారులు పొరపాటున బంగ్లాదేశ్ సముద్రజలాల్లోకి వెళ్లి బంగ్లాదేశ్ నౌకాదళానికి చిక్కిన 8మంది విజయనగరం మత్స్యకారులను స్వదేశానికి తీసుకు వచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఇప్పటికే భారత ప్రభుత్వం నుంచి విదేశీ మంత్రిత్వశాఖ ద్వారా బంగ్లాదేశ్ ప్రభుత్వానికి సంప్రదింపులు జరిపి మత్స్యకారులను వెనక్కి తీసుకొచ్చేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే భారత ప్రభుత్వానికి లేఖ రాయడం జరిగిందని తెలిపారు. మత్స్యకార కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాల అండగా ఉంటుందని.. అధైర్యపడాల్సిన అవసరం లేదని వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు.

## నేటి నుంచి శ్రీశైలంలో కార్తీక మాసోత్సవాలు

**- ఆలయంలో అభిషేకాలు రద్దు**
**- విడతల వారీగా మల్లన్న స్పర్శ దర్శనం**



శ్రీశైలం (చైతన్యరథం): శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం నుంచి కార్తీక మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 21 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసంలో రూ.5 వేల గర్భాలయ అభిషేకం టికెట్లు, రూ.1500 సామూహిక అభి షేకం టికెట్లు రద్దు చేసినట్లు తెలిపారు. రోజూ విడతల వారీగా మల్లికార్జునస్వామి స్పర్శ దర్శనం కల్పిస్తున్నట్లు చెప్పారు. శని, ఆది, సోమవారాల్లో అమ్మవారి అంతరాలయంలో కుంకు మార్చనలు నిలిపేసి.. ఆశీర్వచన మండపంలో నిర్వహిస్తామ న్నారు. ప్రతి సోమవారం ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం, నవంబర్ 14న కోటి దీపోత్సవం, 18న తెప్పోత్సవం నిర్వహించ నున్నట్లు వెల్లడించారు. హోమాలు, కల్యాణాలు యథావిధిగా జరుగుతాయన్నారు.

# జగన్ పుట్టుకతోనే నేరస్థుడు

- కులాల చిచ్చుకు వైసీపీ నేతల యత్నం
- రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు



మంగళగిరి (చైతన్యరథం): రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు మండిపడ్డారు. బుధవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాల యంలో మీడియా సమావేశంలో ఆయన మాటాడారు. జగన్ నేరాలు చేస్తాడు.. నేరస్థులను ప్రోత్సహిస్తాడని విమర్శించారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపాడు గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని నిప్పు పెట్టి తాము సుద్ధపూసలమని నాటకా లాడారు. వైసీపీ సర్పంచ్ గోవిందప్ప రాత్రికి రాత్రి అంబేద్కర్ విగ్రహానికి పెట్రోల్ పోసి తగలబెట్టాడు. తర్వాత పోలీసులకు ఫోన్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి తగలబెట్టారని అబద్ధం చెప్పి నమ్మించే ప్రయత్నం చేశాడు. మరుసటి రోజు మాజీ మంత్రి నారాయణస్వామి, వైసీపీ నేత కరుణాకర్‌రెడ్డితో కలిసి పెద్దఎత్తున ధర్నా పేరుతో డ్రామాలాడారు. సీసీ కెమెరాలు, డాగ్ స్క్వాడ్ పరిశీ లనలో గోవిందయ్య దొరికిపోవడంతో వారి నాటకం బట్టబయ లైంది. ఏమీ ఎరగనట్టు ధర్నా చేయడం, నటించడంలో వైసీపీ నాయకులకు సాటి లేరు. బాబాయ్‌ను చంపించి చంద్రబాబు చేతిలో కత్తి పెట్టి నారాసురరక్త చరిత్ర అని కమల్‌హాసన్‌ను మించి జగన్ యాక్టింగ్ చేశాడు. జగన్ కమల్ హాసన్ మించి యాక్టింగ్ చేస్తే.. జగన్ మించిన యాక్టింగ్ చేసిన వ్యక్తి గోవిందప్ప.. అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వైసీపీ సర్పంచ్ గోవిందప్ప ను జగన్ ఎందుకు సస్పెండ్ చేయలేదు? రాష్ట్రంలో వైసీపీ పోకడలు అతి జుగుప్సాకరంగా ఉన్నాయని మండిపడ్డాడు. దళితు లు నా మేనమామలు అంటూనే గత ఐదేళ్ల దళితుల గొంతులు కోశారు.

జగన్ తన కారుతో రోడ్లపై దళితుల తలలు తొక్కించు కుంటూ వెళ్లాడు. జగన్ పుట్టుకతోనే నేరస్థుడు. తన సొంత బాబాయిని చంపి చంద్రబాబుపై నెట్టాలని చూశాడు. అదేవిధంగా అంబేద్కర్ విగ్రహాన్ని కాల్చి, ఈ పని కూటమి ప్రభుత్వానిదని నమ్మబలుకు ప్రయత్నం చేశారు. జగన్‌రెడ్డి నేరస్థుల ముఠా గురించి చాంతాడంత చెప్పవచ్చు. వైసీపీ నాయకులది టెర్రరిస్టుల స్వభావం. రాజకీయ ముసుగు వేసుకుని చేయరాని పనులన్నీ చేస్తు న్నారు. వైసీపీ హయాంలో పనిచేసిన అధికారులు అవినీతి పరులుగా మిగిలిపోతున్నారు. ఈ టెర్రరిస్టు పార్టీకి దూరంగా ఉండాలని సూచించారు. జగన్ వింత రాజకీయాలను రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకుని 11 సీట్లకు పరిమితం చేశారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పాలనను వైసీపీ నాయకులు ఓర్వలేకపోతు న్నారు. జగన్ హయాంలో రాష్ట్రానికి ఒక్క పెట్టుబడి కూడా రాలేదు. టీడీపీ ప్రభుత్వం తెచ్చిన పరిశ్రమలను తరిమేశారు. కూటమి ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చింది. దేశ, విదేశాల్లో రాష్ట్ర గౌరవం పెరిగింది. చంద్రబాబు, లోకేష్, మంత్రివర్గం పరిశ్రమలు, పెట్టుబడులు తెస్తున్నారు. వైసీపీ నాయ కులు అది చూసి కడుపు మంటతో కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కందుకూరులో ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణను కులచిచ్చుగా పెట్టాలని వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు.

హత్య చేసిన హరిశ్చంద్రప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేసి రిమాండ్ కు పంపారు. చనిపోయిన కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలు గా అండగా నిలిచింది. ప్రతిపక్ష హోదా కూడా లేని వైసీపీ రాష్ట్రంలో అలజడులు సృష్టించాలని చూస్తోంది. అసాంఘిక కార్య కలాపాలను ప్రోత్సహిస్తోంది. గంజాయి ముఠాలతో సంబంధాలు పెట్టుకుంటోంది, వారికి సంఘీభావం తెలుపుతోంది. గోవిందప్ప, జగన్ లాంటి వ్యక్తులు చేసే ఆకృత్యాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## రాయచోటి ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేస్తాం

**- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**



రాయచోటి (చైతన్యరథం): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి లో బుధవారం అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. సూపరిం టెండెంట్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజులలో ప్రభుత్వ ఆసు పత్రిని మరింత అభివృద్ధి చేసి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం కమిటీ చైర్మన్, సభ్యులు మంత్రిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపరిం టెండెంట్, ప్రధాన వైద్యులు, అభివృద్ధి కమిటీ చైర్మన్, సభ్యులు, ఏపీఐఐసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు రవీం ద్రారెడ్డి, బోనమల ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్ కృషితో ఆక్వా రైతులకు ఊరట

- ఆస్ట్రేలియా ఎగుమతులకు తొలగిన అడ్డంకులు
- రాష్ట్ర ఆక్వా రంగంలో ఇదో మైలురాయి
- మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు



అమరావతి (చైతన్యరథం): రొయ్య రైతు మీసం తిప్పేలా చేసిన యువనేత, మంత్రి నారా లోకేష్ యువత, మరోవైపు రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఆస్ట్రేలియా పర్యటనతో ఆక్వా రైతులకు ఊరట కలిగింది. ఆక్వా రైతులు ఎగుమతులు లేక నష్టపోతున్న సమస్యను అధిగమించేందుకు ఆయన చేసిన కృషి అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు ప్రశంసించారు. ఆక్వా రైతులపై నిబద్ధత, దూరదృష్టి వల్లే ఏపీ ఆక్వా రైతులకు అంతర్జాతీయ మార్కెట్‌లో కొత్త అధ్యాయం ప్రారం భమైందన్నారు. ఆస్ట్రేలియా మార్కెట్‌లో ప్రవేశం సాధించడం రాష్ట్ర ఆక్వా రంగంలో ఇదో మైలురాయి అని తెలిపారు. అమెరికా భారీ సుంకాలు, అనేక అడ్డంకుల మధ్య కూడా రెండు దేశాల ప్రభుత్వాల మధ్య సఖ్యత సాధించి ఆక్వా రైతులకు కొత్త జీవం పోయడం ప్రశంసనీయం. ఇది భారతదేశానికే గర్వకారణం. ప్రభు త్వ చర్యలతో ఏపీ ఆక్వా రంగం ప్రపంచ చిత్రపటంలో మరింత బలంగా నిలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఆక్వా రైతు క్షేమం కోసం కట్టుబడి ఉంది. నేడు యువనేత చొరవతో అమెరికా సుంకాల కారణంగా ఆర్థికంగా కుదేలైన ఆక్వా రంగం, ఆక్వా రైతులకు ఆస్ట్రేలియా తీసుకున్న ఈ నిర్ణయం ఊరటనిచ్చింది.

# రీ సర్వేలో భూమి మాయం

- న్యాయం చేయాలంటూ బాధితుడి విజ్ఞప్తి
- పనులు చేయకుండానే వైసీపీ నేతలకు బిల్లులు
- ప్రజావినతుల కార్యక్రమానికి అర్జీలు



మంగళగిరి (చైతన్యరథం): కృష్ణా జిల్లా పెనమలూరుకు గ్రామానికి చెందిన పద్మావతి టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో తన సమస్యను వివరిస్తూ వినతిపత్రం అందజేసింది. తన భర్త తరచూ మద్యం సేవించి తనను వేధించడంతో పిల్లలను తీసుకుని పుట్టింటి వద్దే 20 ఏళ్లుగా ఉంటున్నట్లు తెలిపింది. ఆ సమయంలో తన తండ్రి సహాయం చేస్తూ తమ స్థలంలో నుంచి 2 సెంట్లు స్థలం తన పేరుమీద రాయించి ఇచ్చారు. విజయ వాడ-మచిలీపట్నం రోడ్డులో విస్తరణ పనుల కారణంగా తమ స్థలంలోని ఒక సెంటు రోడ్డు పరిధిలోకి వచ్చింది. దానికి సంబంధించిన పరిహారం కూడా ప్రభుత్వం నుంచి అందింది. మిగతా సెంటు స్థలంలో ఇల్లు నిర్మించుకుందామని అనుకుం టుండగా తమ అమ్మ, పెద్ద అక్క లక్ష్మి, రెండవ అక్క.. ఆమె భర్త మునెయ్య కలిసి తమ స్థలాన్ని కేబుల్ శ్రీను అనే వ్యక్తికి విక్రయించారని ఫిర్యాదు చేసింది. దీనిపై అతని దగ్గరకు వెళ్లి ప్రశ్నించగా తమ వాళ్లందరూ సంతకాలు పెట్టిన డాక్యుమెంట్ చూపించి తాను కొనుగోలు చేశానని చెబుతున్నారని వివరిం చింది. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్క రించాలని కోరింది. ఏపీ యాదవ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జి.నరసింహ యాదవ్, ఏపీ అగ్రికల్చరల్ మిషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అర్జీలు స్వీకరించారు.

– గుంటూరు జిల్లా తెనాలికి చెందిన హరిశంకరరావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమకు మల్లెపాడు గ్రామం లో సర్వే నంబర్ 154/ఏలో 48 సెంట్లు సాగు భూమి రిజిస్టర్ అయి ఉంది. అయితే పొలాల రీ సర్వేలో 46 సెంట్లు మాత్రమే చూపించారు. దీనిపై పలుమార్లు సర్వేయర్, డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్, ఆర్‌డీవోకు అర్జీలు ఇవ్వగా..తమ భూమి పక్కవారి పక్క పొలం సర్వే నంబర్లు 154/3ఏ, 155/3ఏలో కలిసిపో యిందని చెప్పారు. సమస్య పరిష్కారం కాలేదు. సమస్యను పరిష్కరించాలని కోరాడు.

– అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం బడికాయలపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గత ప్రభుత్వంలో గొర్రెల రుణాలు, చెరువు పనులు, పారం పౌండ్స్ పనుల్లో వైసీపీ నాయకులు అవినీతికి పాల్పడ్డా రు. పనులు చేయకుండానే చేసినట్లు సుమారు రూ.83 లక్షలు బిల్లులు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

– కడప జిల్లా చదవారిపల్లెకు చెందిన సుబ్బారెడ్డి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా తన 5 ఎకరాల పంట పూర్తిగా నీట మునిగిపోయిం దని తెలిపారు. ఇంకో 10 రోజులలో కోతకు సిద్ధమైన పంట వర్షంతో నాశనమైందన్నారు. తన భూమిపై సాగు కోసం ఎకరా నికి రూ.50,000 చొప్పున మొత్తం రూ.2,50,000 ఖర్చు అయింది. వ్యవసాయం తప్ప వేరే ఆదాయం లేని పరిస్థితిలో కుటుంబాన్ని పోషించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ను. నష్టపరిహారం అందించాలని కోరాడు.

– బాపట్ల జిల్లా వేమూరు మండలం చావలి గ్రామానికి చెందిన వెంకటరావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలోని ఎంపీపీ పాఠశాల చుట్టూ ఉన్న ప్రహరీ గోడకు సమీపంలో రాజకీయ నాయకుల విగ్రహాల కోసం కొందరు వ్యక్తులు రెండు వైపులా దిమ్మలు కట్టి నిర్మాణం చేపట్టారు. దీనిపై ప్రశ్నించగా పాఠశాలలో కాదు, పంచాయతీ స్థలంలో కడుతున్నామని చెప్పారు. పాఠశాల గోడ పక్కన బడ్డీ కొట్టు ఏర్పాటు చేయడంతో అక్కడ ప్రతిరోజూ మద్యం సేవించడం, చెత్త చెదారం, ఖాళీ బాటిళ్లు పడేయడం వల్ల విద్యార్థులు, మహిళలు, తల్లిదండ్రులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గతంలో 30 మంది విద్యార్థులు మాత్రమే ఉండగా ఉపాధ్యా యులు, విద్యా కమిటీ కృషితో ఈ ఏడాది 62 మంది విద్యా ర్థులు చేరారు. పాఠశాల మండలంలో రెండవ స్థానంలో ఉంది. అయితే దిమ్మలు కట్టిన వారు కానీ, వారి పిల్లలు కానీ ఆ పాఠశాలలో చదివిన వారు కాదు. కావున ఈ ఘటనపై దృష్టి సారించి పాఠశాల పరిసరాలను రక్షించి, విద్యార్థుల భద్రతను కాపాడాలని కోరారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు కైవసం చేసుకోవాలి : ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్



ఆనందపురం (చైతన్యరథం): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమిని గెలిపించుకుని సత్తా చాటాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. కొత్తగా ఎంపికైన తెదేపా ఆనందపురం మండల కమిటీతో బుధవారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా తరువాడలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో 26 పంచాయతీల్లో ప్రతి పంచాయతీలోనూ తనకు మెజారిటీ ఇచ్చిన విధంగానే ఏకపక్ష ఫలితాలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. తెదేపా ఆవిర్భావం నుంచి ఆనందపురం మండలం పార్టీకి ఎప్పుడూ కంచుకోటేనని.. పదవిని బాధ్యతగా భావించి బలోపేతం చేయాలని కమిటీకి సూచించారు. తెదేపా, జనసేన, భాజపా ఒకే కుటుంబమని.. వర్గ, విభేదాలు పక్కన పెట్టి సమష్టిగా పని చేయాలని సూచించారు. 2014- 19 మధ్యలో మంత్రిగా ఉంటూ నియోజకవర్గాన్ని రూ.4,700 కోట్లతో అభివృద్ధి చేశానని తెలిపారు. 93 వేల ఓట్ల మెజారిటీ ఇచ్చిన ప్రజలకు అభివృద్ధిని కానుకగా ఇచ్చి రుణం తీర్చుకుంటానని పేర్కొన్నారు.

# అనకాపల్లిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



అనకాపల్లి (చైతన్యరథం): అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులో ఏర్పాటు చేసిన దివంగత నేత, టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహాన్ని హోంమంత్రి అనిత, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ఆవిష్కరించారు. తొలుత పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మద్యం దుకాణాల ఆకస్మాత్తు తనిఖీలు

**●క్యూ ఆర్ కోడ్ తప్పనిసరి : దొన్నుదొర**



అరకువేలి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు మద్యం దుకాణ వ్యాపారస్తులు క్యూఆర్ కోడ్‌తో మద్యం అమ్ముతున్నారో లేదో అని తెలుసుకోవడానికి బుధవారం అరకువేలి పట్టణంలో మద్యం దుకాణాలను నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ ఆర్టీసీ విజయనగరం రీజినల్ ఛైర్మన్ సియ్యారి దొన్నుదొర పరిశీలించారు. మద్యం సేవించే వారికి క్యూ ఆర్ కోడ్‌తో స్కానింగ్ చేసిన తరువాతే మద్యం బాటిల్ అమ్మాలని, ఒకరికి మూడు బాటిల్ మాత్రమే అమ్మాలని మద్యం సేవించేవారు మీ ఆరోగ్య దృష్టిని ఉంచుకొని తాగాలని గత ప్రభుత్వ హయంలో కల్తీ మందు తాగి చాలా మంది మరణించారని, కొంత మంది. అనారోగ్యం బారిన పడ్డారని కానీ కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలకు దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన మందు విక్రయించాలని మద్యం దుకాణాలను ఆదేశించారు. మద్యం దుకాణదారులు నాసిరకం మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు శెట్టి బాబురావు, సర్పంచ్ పెట్టేలి దాసుబాబు మాదల, సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలి

**● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబును కోరిన కత్తెర హెనీ క్రిస్టినా**

గుంటూరు (చైతన్యరథం): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలని జడ్పీ ఛైర్పర్సన్ కత్తెర హెని క్రిస్టినా ఎమ్మెల్యే నక్కా ఆనంద్బాబు కోరారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని ఎమ్మెల్యే ఆనంద్ బాబు బుధవారం జడ్పీ కార్యాలయంలో క్రిస్టినాను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పథకాల పారదర్శకంగా అమలు చేయటంతో పాటు, అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుంటామని క్రిస్టినా హామీ ఇచ్చారు.

# ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కారం : మంత్రి అచ్చెన్న

**●నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ**



నిమ్మాడ (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలను ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ మేరకు మంగళవారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో 'ప్రజాదర్బార్'లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన వినతులు పరిశీలించి సంబంధిత అధికారులకు ఫోన్‌లో మాట్లాడి పలు సూచనలు జారీ చేశారు. అధికారులు సమస్యను పరిష్కరిస్తారనే నమ్మకంతో ప్రజలు వినతులు సమర్పిస్తారని, అందుకు తగ్గట్టుగానే అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.ప్రజలు పదే పదే అర్జీలు సమర్పించే అవసరం లేకుండా ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో పలుప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లపాటు అనేక సమస్యలు పేరుకుపోయి ఇప్పుడు వాటి పరిష్కారం కోసం ప్రజలు పోటెత్తుతున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. ఐదేళ్లుగా ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో వస్తున్న విజ్ఞాపనలు చూస్తే అర్థమవుతోందని, తమ బాధలు చెప్పుకోవడానికి పెద్ద సంఖ్యలో వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పీఏసీఎస్ ఛైర్మన్ వెలమల విజయలక్ష్మి, నాలుగు మండలాల తెలుగుదేశంపార్టీ నాయకులుమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

# జాతి సమైక్యత కోసం వన సమారాధనలు : మంత్రి సుభాష్



అమలాపురం (చైతన్యరథం): వచ్చే నవంబర్ 16న అమలాపురంలో జరిగే ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ కార్తీక వనసమారాధనను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. అమలాపురంలోని కొంకాపల్లి ఎత్తురోడ్డు వద్దగల శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయం వద్ద జరిగిన సన్నాహక సమావేశంలో మంత్రి సుభాష్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, శెట్టిబలిజ సంఘం పెద్దలు వాసంశెట్టి సత్యం తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా,జాతి ఐక్యత కోసం ప్రతి ఏడాది భారీ స్థాయిలో కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నామన్నారు. ఐక్యతతోనే రాజ్యాధికారం సాధించుకోవడం సాధ్యమన్నారు. శెట్టిబలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయ సాధనకు పునః రంకితమవుదామన్నారు. వచ్చే నెలలో తాను ప్రకటించిన కోటి రూపాయల విరాళాన్ని ఎస్ ఏ ఎఫ్ నిధికి జమ చేస్తానని అన్నారు. కొంతమంది రాజకీయ స్వార్థపరులు తమ స్వలాభం కోసం తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, వాటిని తిప్పి కొడుతున్నానన్నారు. అలాంటి వారికి ప్రజలే బుద్ధి, గుణపాఠం చెబుతారన్నారు. జాతిని తాకట్టుపెట్టే నేతలను దూరంగా పెట్టాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ... ఇటీవల రాజమండ్రిలో పదవతరగతి పరీక్షల్లో 500 పైబడిన మార్కులు సాధించిన ప్రతీ శెట్టిబలిజ విద్యార్థినీ, విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని ప్రతీ ఒక్కరూ కుటుంబ సమేతంగా విచ్చేసి ఈ వనసమారాధనను విజయవంతం చేయాలని కోరారు.

# నాడు దస్తగిరి బ్యారక్‌లోకి చైతన్యరెడ్డిని ఎలా పంపించారు? : బీటెక్ రవి



కడప (చైతన్యరథం): మాజీ మంత్రి వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి బ్యారక్‌లోకి నిందితుడు శివశంకర్రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి వెళ్లడం తాను చూశానని పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి తెలిపారు. దస్తగిరిని చైతన్యరెడ్డి బెదిరించిన కేసుపై కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ కడప జైలులో బుధవారం విచారణ చేపట్టారు. దస్తగిరిని బెదిరించిన సమయంలో వేరే కేసులో అదే జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నందున బీటెక్ రవిని కూడా అధికారులు విచారించారు. విచారణకు హాజరైన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "దస్తగిరిని బెదిరించిన కేసులో విచారణకు పిలిస్తే వచ్చాను. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కి నా వాంగ్మూలం ఇచ్చాను. 2023 నవంబర్ 28న దస్తగిరి బ్యారక్‌లోకి డాక్టర్ చైతన్యరెడ్డి వెళ్లడం కళ్లారా చూశాను. ఆ బ్యారక్ ఎదురుగానే రిమాండ్ ఖైదీగా ఉన్నాను. వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా ఉన్న దస్తగిరి బ్యారక్‌లోకి నిందితుడి కుమారుడిని ఎలా పంపిస్తారు? ఈ విషయంపై ఆరోజే జైలు అధికారి ప్రకాశ్‌ను ప్రశ్నించా? కానీ.. నేను చెప్పిన విషయాన్ని అధికారులు పట్టించుకోలేదు. ఆరోజు ఏం జరిగిందనేది ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు కూలంకషంగా వివరించాను. దస్తగిరిని జైలుకెళ్లి బెదిరించడంలో కుట్ర దాగి ఉంటుందని భావిస్తున్నాను అని బీటెక్ రవి అన్నారు.

# హంద్రీ - నీవా నీరు రాకతో గ్రామాల్లో సంతోషం కనిపిస్తోంది

**●ప్రతి చెరువును నింపాలన్నదే తమ లక్ష్యం.. పరిటాల సునీత**

**●ఆలమూరు చెరువుకు జలహారతి, సారె సమర్పణ**



రాప్తాడు (చైతన్యరథం): హంద్రీ – నీవా కాలువ నీళ్లు రాకతో రాప్తాడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సంతోషం కనిపిస్తోందని ఎమ్మెల్యే పట్టాల సునీత అన్నారు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఆలమూరు చెరువుకు హంద్రీ – నీవా నీరు చేరి మరువపారడంతో ఆమె గ్రామానికి వెళ్లారు. గ్రామంలోని టిడిపి నాయకులు, రైతులు, గ్రామస్తులు ఆమెకి ఘన స్వాగతం పలికారు. చెరువుకు నీరు చేరి మరువ పారడంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు. అక్కడ గంగపూజ నిర్వహించి.. జల హారతి ఇచ్చారు. గంగమ్మ తల్లికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గానికి హంద్రీనీవా నీరు రాదని వైసిపి నాయకులు దుష్ప్రచారం చేశారన్నారు. ఇప్పుడు గతం కంటే ఎక్కువగా అన్ని చెరువులకు నీరు అందుతోందన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు దుష్ప్రచారం మానాలన్నారు.. వారి హయాంలో ఎన్ని చెరువులకు నీళ్లు ఇచ్చారో సమాధానం చెప్పే ధైర్యం కూడా వారికి లేదన్నారు. అవకాశం ఉన్న ప్రతి చెరువుకు మీరు అందించాలన్నదే తమ లక్ష్యం అన్నారు.

# ఎవరినీ కొమ్ముకాసే పరిస్థితులు కూటమి ప్రభుత్వంలో ఉండవ్

●బిసి హాస్టల్ బాలిక ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే వాసు



రాజమహేంద్రవరం (చైతన్యరథం): నగరంలో ఒక బిసి హాస్టల్‌కి చెందిన బాలికపై జరిగిన అఘాయిత్య ఘటనకు సంబంధించి చర్యలు తీవ్రంగానే ఉంటాయని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హెచ్చరించారు. తప్పుచేసినవారికి కొమ్ముకాయడం ఉండదని ఆయన స్పష్టంచేసారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందినవెంటనే పోలీసులు ఎఫ్ఐఆర్ కట్టారని ఆయన గుర్తుచేసారు. స్థానిక బిసి హాస్టల్ లో 10వ తరగతి విద్యార్థినిని అజయ్ అనే యువకుడు తీసుకెళ్లి, మరో యువకుడితో కల్సి అత్యాచారం చేసినట్లు వచ్చిన వార్తపై ఎమ్మెల్యే వాసు స్పందించారు. వివరాలు ఆరా తీశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వాసు తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సోదరుడు సాకుతో వచ్చిన ఆ యువకుడితో బయటకు వెళ్ళడానికి వార్డెన్ పై వత్తిడి తెచ్చి సదరు బాలిక వెళ్లడం, అక్కడ మరో యువకుడితో కల్సి లాడ్జికి వెళ్లి రెండు గంటల తరవాత తీసుకొచ్చి దేవీచౌక్ లో వదిలేసి వెళ్లినట్లు, వంటిపై గాయాలు చూసి వార్డెన్ ఆరా తీయడంతో విషయం మొత్తం చెప్పడం, దీనిపై కాకినాడలో ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు, దీంతో వారు వచ్చి టు టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెల్పిందని ఆయన పేర్కొన్నారు. దీపావళి రోజు అర్ధరాత్రి 12గంటలు దాటాక వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు వెంటనే స్పందించి ఎఫ్ఐఆర్ కట్టారని ఆయన అన్నారు. ఈ ఘటన చాలా దురదృష్టకరమని ఎమ్మెల్యే వాసు పేర్కొన్నారు. ఒక గుణపాఠంగా నేర్చుకుని, తల్లిదండ్రులకు తప్ప ఇతరులెవరు వచ్చినా వాళ్ళతో మాట్లాడ్డానికి గానీ, బయటకు వెళ్ళడానికి అనుమతించకూడదని ఆయన అన్నారు. తల్లిదండ్రులు ఆధార్ కార్డుల ఆధారంగా వారిని అనుమతించాల్సి ఉందన్నారు. ఎక్కడో జొన్నాడ నుంచి వచ్చిన యువకుడు ఈవిధంగా అబద్దాలు చెప్పి బాలికను తీసుకెళ్ళడం దారుణమన్నారు. లోకంలో మంచితో పాటు చెడు కూడా ఉంటుందని, ఇలాంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. తప్పు జరిగాక చర్యలు తీసుకోవడం కంటే తప్పు జరగకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు ఎంతోనమ్మకంతో చదువుకోడానికి పంపించినపుడుఎలాంటి వత్తిడులకు లోనుకాకుండా, తల్లిదండ్రులకు మచ్చరాకుండా చూడాలని ఎమ్మెల్యే వాసు సూచించారు. ఏఐ టెక్నాలజీ కూడా రావడంతో మరిన్ని ఇబ్బందులు వస్తాయని అన్నారు. ఇక మగపిల్లలకు తల్లిదండ్రులు కూడా సంస్కారం నేర్పాలని, ఆడపిల్లల విషయంలో చెడు ఆలోచనలు చేయకుండా చూడాలని, లేనిపక్షంలో ఇలాంటి కేసుల్లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎమ్మెల్యే వాసు అన్నారు.

# మద్ది క్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు

●జంగారెడ్డిగూడెంలో ఎమ్మెల్యే సొంగ రోషన్ ప్రత్యేక పూజలు



జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం గ్రామంలో కొలువైన శ్రీమద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం కార్తీక మాస మహోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ ఉత్సవానికి చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారి చెంత ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖ మండపంలో ఎమ్మెల్యేకు వేద ఆశీర్వచనాలు ఇచ్చి, స్వామి వారి చిత్రపటాన్ని ఈవో చందన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అక్టోబర్ 22 నుంచి నవంబర్ 20వ తేదీ వరకు జరిగే కార్తీక మహోత్సవాలు శ్రీమద్ది ఆంజనేయ స్వామి ఆశీస్సులతో విజయవంతంగా జరగాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షణ చేస్తూ ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# దాతల సహకారంతో ఉచిత అన్నదాన కార్యక్రమం

● భక్తులు, యాత్రికులకు స్వయంగా వడ్డించిన మంత్రి నిమ్మల రామానాయుడు



పాలకొల్లు (చైతన్యరథం): పంచారామ క్షేత్రమైన పాలకొల్లులోని క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా నెల రోజులపాటు దాతల సహకారంతో నిర్వహించే ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. ఆయన స్వయంగా ఆలయానికి వచ్చిన భక్తులు యాత్రికులకు వడ్డించారు. ముందుగా అమ్మవారికి పూజా కార్యక్రమం జరిపారు. ఆలయ పాలకవర్గం ఆధ్వర్యంలో రేపాక వారి సత్రంలో జరిగే ఈ కార్యక్రమంలో కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ... భారతదేశంలోనే పంచారామ క్షేత్రాల్లో ఒకటైన పాలకొల్లులోని క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయానికి కార్తీకమాసం రోజుల్లో స్వామివారిని దర్శించుకునేందుకు లక్షలాదిమంది భక్తులు, జిల్లా రాష్ట్రాల నుంచి యాత్రికులు వస్తారని తెలిపారు. వీరికి ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు నెలరోజుల పాటు దాతల సహకారంతో రుచికరమైన వేడిగా ఉండే వంటలతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు ప్రభుత్వం తరఫున అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ చైర్మన్ మీసాల రాము, ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, ట్రస్టీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో యార్లగడ్డ పరామర్శ యాత్ర



గన్నవరం (చైతన్యరథం): గన్నవరం నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు టిడిపి నాయకులను ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బుధవారం పరామర్శించారు. గన్నవరం మండలం వీరపనేనిగూడెం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు ఉయ్యూరి శ్రీరామిరెడ్డి అనారోగ్యానికి గురై వైద్యశాల చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న యార్లగడ్డ బుధవారం మధ్యాహ్నం వీరపనేనిగూడెం గ్రామంలోని శ్రీరామరెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని దైనందిన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. అనంతరం బాపులపాడు మండలం మలవల్లి గ్రామానికి చేరుకున్న యార్లగడ్డ అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి సీనియర్ నాయకులు యనమదల వెంకయ్య రావును పరామర్శించారు. అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఇదే మండలం కొత్తపల్లి గ్రామానికి చేరుకున్న యార్లగడ్డ ఇటీవల మరణించిన షేక్ బషీర్ కుటుంబాన్ని పరామర్శించారు. అల్లుడు మరణంతో దుఃఖసాగరంలో మునిగిపోయిన బషీర్ మామ మస్తాన్ వలీ ని ఓదార్చి, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. బాపులపాడు మండలం అంపాపురం గ్రామంలో ఇటీవల మరణించిన టిడిపి సీనియర్ నాయకులు గోగినేని శివరామకృష్ణ కుటుంబాన్ని బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే యార్లగడ్డ పరామర్శించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన శివరామకృష్ణ లేని లోటు తీర్చలేనిదన్నారు. శివరామకృష్ణ కుటుంబానికి పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు పలు సమస్యలను యార్లగడ్డ దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం పెద్దావుటపల్లి గ్రామంలో పలువురు టిడిపి నాయకుల్ని యార్లగడ్డ పరామర్శించారు.

# భూముల రీ- సర్వే పారదర్శంగా జరగాలి : చింతమనేని



దెందులూరు (చైతన్యరథం): "పెదవేగి మండలంలో జరుగుతున్న భూముల రీసర్వేలను ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్‌తో కలిసి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బుధవారం ఉదయం దుగ్గిరాలలోని పంచాయతీ కార్యాలయం వద్ద సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా భూముల రీ సర్వే అంశంపై పలువురు గ్రామస్థులు తమ సందేహాలను వ్యక్తపరచగా అధికారులు వాటిపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ... "గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అస్తవ్యస్త విధానాలు, పాలన వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన భూముల రీ సర్వే కార్యక్రమం ద్వారా ఎంతో పారదర్శకంగా అమలు చేస్తూ వివాదరహితంగా ప్రజలు జీవించేలా పాలన అందిస్తుందని, ఈ కార్యక్రమం పట్ల ప్రజలు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా అధికారులు కూడా ఎక్కడ ఎలాంటి విమర్శలకు తావులేకుండా భూముల రీ సర్వే పూర్తి చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పెదవేగి మండల తాసిల్దార్ భ్రమరాంబ సహా పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తప్పు చేస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదు : జ్యోతుల నవీన్



కాకినాడ (చైతన్యరథం): కాకినాడ జిల్లా, తుని జగన్నాథగిరి గురుకుల పాఠశాల విద్యార్థినిపై జరిగిన అత్యాచార యత్నం ఘటనను తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, ఈ అమానుష అఘాయిత్యానికి పాల్పడిన తాటిక నారాయణరావుపై చర్యలు తీసుకోవాలని కాకినాడ టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ కోరారు. "తప్పు చేస్తే కూటమి ప్రభుత్వం ఉపేక్షించదు. సభ్య సమాజం తలదించుకునేలా, 'తాత'నని చెప్పి బాలికను లోబరుచుకోవడానికి ప్రయత్నించిన ఈ నీచమైన చర్యను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం. ఈ ఘటన జరిగిన వెంటనే, కూటమి ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించింది. పోలీసులు నిందితుడిని తక్షణమే అరెస్టు చేసి, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ వేగవంతమైన చర్యలు మహిళలు, బాలికల రక్షణ పట్ల మా ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తున్నాం." అని నవీన్ కుమార్ తెలిపారు.

**బాధితులకు అండగా నిలుస్తాం :**

"చిన్నారి సురక్షితంగా ఉందని, ఆమెకు కౌన్సెలింగ్ మరియు అన్ని రకాల సహాయ సహకారాలు అధికారులు అందిస్తున్నారు. బాధిత బాలికకు అండగా మా బాధ్యతగల ప్రభుత్వం పూర్తి భరోసాన్ని అందిస్తుంది. బాధితురాలైన ఆ చిన్నారికి మరియు ఆమె కుటుంబానికి అవసరమైన వైద్య, మానసిక, న్యాయ సహాయాన్ని ప్రభుత్వం సమకూరుస్తుంది. ఈ కేసు విచారణ వేగవంతంగా జరిగి, నిందితుడికి అత్యంత కఠిన శిక్ష పడేలా చూసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది." అని అన్నారు.

## శ్రీశైలం దేవస్థానం అభివృద్ధికి బోడేపూడి ప్రత్యేక కృషి చేయాలి : చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): శ్రీశైలం దేవస్థానం పాలకమండలి సభ్యులుగా నియమితులైన మహానాడు మీడియా ఎండీ బోడేపూడి వెంకట సుబ్బారావు, ఇప్పటం మాజీ సర్పంచ్ శంకరశెట్టి పిచ్చయ్య ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోడేపూడి, పిచ్చయ్యను జీవీ, జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ మక్కెన ప్రత్యేక అభినందనలు తెలిపి సత్కారం చేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ... మన వినుకొండ ప్రాంత వాసి అయిన బోడేపూడి శ్రీశైలం బోర్డు సభ్యులుగా ఎన్నిక కావడం మనందరికీ గర్వ కారణమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు లగడపాటి వెంకట్రావు, ముంద్రు సుబ్బారావు, రావర్ల జగ్గారావు వినుకొండ యార్డ్ ఛైర్మన్ మురళి కృష్ణ యాదవ్, నర్రా కిషోర్, బుల్లేశ్వర రెడ్డి, బొంకూరి రోశయ్య, బాలయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

## దాల్వా పంటకు సాగునీరు అందిస్తాం

**• రైతు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చిన ఎమ్మెల్యే కాగిత**



మచిలీపట్నం (చైతన్యరథం): పెడన నియోజవర్గంలోని బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల రైతుల విజ్ఞప్తి మేరకు దాల్వా పంటకు సాగునీరు అందించే విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని త్వరలో తగిన నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ వెల్లడించారు. బుధవారం పెడన శాసనసభ్యులు నియోజకవర్గంలోని రైతులు, సాగునీటి సంఘాల అధ్యక్షులతో కలుసుకొని జిల్లా కేంద్రానికి విచ్చేసి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని నగరంలోని వారి ఛాంబర్లో కలిసి పెడన నియోజకవర్గంలోని రైతులందరూ దాల్వా రెండో పంటకు సాగునీరు అందించాలని కోరుతున్నారని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చారు. తదనంతరం శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ ఇరువురు జిల్లా కలెక్టర్ చాంబర్ కింద ఉన్న పోర్టికోలో వేచి ఉన్న పెడన నియోజకవర్గ రైతుల వద్దకు వచ్చి మాట్లాడారు. దాల్వా రెండో పంటకు సాగునీరు అందించే విషయమై శాసనసభ్యులు రైతులందరి సమక్షంలో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. తదుపరి శాసనసభ్యులు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతులు రెండో పంట దాల్వా పంటకు సాగునీరు అందించాలని కోరుతున్నారన్నారు. నియోజకవర్గం జిల్లాలో శివారు ప్రాంతమని, సముద్రానికి ఆనుకుని ఉన్న ప్రాంతం అన్నారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల రైతులు రెండో పంట లేకపోతే అక్కడ మినుములు కూడా పండించే పరిస్థితి లేదన్నారు. సముద్రం దగ్గర ఉండటం వలన అక్కడి భూముల్లో ఉప్పునీరు ఎక్కువగా ఉంటుందన్నారు. రెండో పంట వేయకపోతే భూములన్నీ పాడైపోయే పరిస్థితి ఉందన్నారు. అందువలన రైతాంగం రెండో పంట కావాలని కోరుతున్నారన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ని కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. జిల్లా కలెక్టర్ దాల్వా పంటకు సాగునీరు అందించే అంశాన్ని పరిశీలించి మంత్రుల దృష్టికి తీసుకుని వెళ్లి త్వరలో తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారన్నారు. తాను కూడా ఈ సమస్యను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతోపాటు రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకుని వెళ్లి తప్పకుండా దాల్వా పంటకు సాగునీరు అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

## ఎన్ఐఆర్డీ సహకారంతో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తాం : ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ భాగస్వామ్యంతో, జిల్లా యంత్రాంగం సహకారంతో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని విజయవాడ పార్లమెంట్ సభ్యులు, కేశినేని ఫౌండేషన్ ఛైర్మన్ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఎన్ఐ ఆర్ డి, కేశినేని ఫౌండేషన్ అవగాహన ఒప్పందం (ఎం ఓ యు) అమలుపై జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ... వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనకు ఉపాధి కల్పన అత్యంత కీలకమన్నారు. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్ఐఆర్డీ)తో కలిసి స్వయం సహాయక సంఘాలకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇస్తామని తెలిపారు. సీడ్ బ్యాంకు, గిరిజన దుస్తులు, ఆభరణాల రూపకల్పన, విస్తరాకులు, వర్మీ కంపోస్ట్ తయారీ మొదలైన వాటికి అవసరమైన యంత్రాలను అందిస్తామని చెప్పారు.

## పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం ప్రపంచానికే మార్గదర్శి నిలుస్తోంది

**•ముఖ్యమంత్రి చంద్రబాబు విశ్వసనీయత, నిబద్ధతే ఏపీకి బలం : ప్రత్తిపాటి పుల్లారావు**



చిలకలూరిపేట (చైతన్యరథం): విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరి కోసం ఉద్యోగాలు ఎదురుచూసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే దిశగా విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. యడ్లపాడు మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు గ్రామస్తులతో కలిసి పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన కల్వర్టు, పాఠశాల ప్రహరీ, సీసీ రోడ్లను ప్రారంభించిన అనంతరం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పల్నాడు డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించిన నేతలు... ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తుల్ని ఉద్దేశించి మాట్లాడారు.

**కూటమిప్రభుత్వ సుస్థిర పాలన.. చంద్రబాబు విశ్వసనీయత.. సమర్థత వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు..**

దేశంలో పెట్టుబడులు, పరిశ్రమలు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలు, కంపెనీల యజమానులకు ముందుగా నేడు రాష్ట్రమే గుర్తొస్తోందని, అందుకు కారణం కూటమిప్రభుత్వ సుస్థిర పాలన, పారదర్శక విధానాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్సే కారణమని ప్రత్తిపాటి చెప్పారు.

**ఉత్తమ విద్యాబోధనతో రాష్ట్ర విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలన్నదే లోకేశ్ తాపత్రయం..**

గత పాలకుల నిర్లక్ష్యంతో పూర్తిగా నిర్వీర్యమైన రాష్ట్ర విద్యారంగాన్ని తన సమర్థత.. ఆలోచనా విధానంతో లోకేశ్ సరిదిద్దుతున్నాడన్నారు. సకాలంలో పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్నభోజనం, మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల నియామకంతో విద్యార్థులు ఉత్తమ విద్యాబోధనతో మెరుగైన ఫలితాలు పొంది ఉన్నత స్థానాలకు లోకేశ్ తాపత్రయమన్నారు.

**ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాల్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఎదగాలి : ఎంపీ లావు**

విద్యార్థులు, యువత గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, ఓటమిని గెలుపుగా మలుచుకోవడంలోనే అసలైన లక్ష్యసాధన ఉంటుందని ఎంపీ లావు కృష్ణదేవరాయలు తెలిపారు. జీవితంలో రాణించాలంటే విద్యార్థులు పరిణితితో ఆలోచించాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని తమ లక్ష్యాల సాధన దిశగా విద్యార్థినీ, విద్యార్థులు ఎదగాలన్నారు.

## యాదవుల అభ్యున్నతికి చంద్రబాబు ప్రభుత్వం గట్టి చర్యలు

**•విజయవాడలో యాదవ కార్పొరేషన్ రెండవ బోర్డు సమావేశం**

**•గ్రామీణ యాదవుల పశుమేత భూముల రక్షణపై కమిటీ తీర్మానం : చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్**

విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ యాదవ సంక్షేమ మరియు అభివృద్ధి సంస్థ రెండవ బోర్డు సమావేశం విజయవాడ బీసీ భవన్లో ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి ఛైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అధ్యక్షత వహించగా, సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జి. ఉమాదేవి, డైరెక్టర్లు మరియు ఇతర అధికారులు హాజరయ్యారు. సభలో ముఖ్యంగా, గ్రామీణ యాదవుల కులవృత్తుల అభివృద్ధి, యువతకు ఉద్యోగ అవకాశాలు, పశువుల మేత భూముల రక్షణ, అమరావతిలో యాదవ భవన్ నిర్మాణం వంటి అంశాలపై చర్చ జరిగింది. పశువుల ఆధారిత జీవనాన్ని కొనసాగిస్తున్న యాదవులకు కాటమరాజు భూములు అనే మేత భూములను ప్రభుత్వ పరంగా రక్షించాలని తీర్మానించారు. చదువులు పూర్తి చేసిన యాదవ యువతకు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాములు, సబ్సిడీ రుణాలు, చిన్న పరిశ్రమల స్థాపనకు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు చేయబడినట్లు కమిటీ తెలిపింది. అదనంగా, తెలంగాణలో నిర్వహించే సదర్ ఉత్సవాన్ని తిరుపతిలో ప్రారంభించేందుకు అధికారికంగా ప్రకటన రావాలని, టీటీడీ ఆలయాల్లో యాదవులకు ప్రథమ దర్శనం హక్కు కల్పించేందుకు చట్టసభలో చర్చించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమావేశం ముగింపులో ఛైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ, "యాదవుల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటోంది. కమిటీగా మనం ప్రభుత్వానికి మద్దతుగా, ప్రజల ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలి" అని అన్నారు. గత బోర్డు మీటింగ్లో తీసుకున్న నిర్ణయాలపై ప్రభుత్వ స్పందనలపై సమీక్ష జరిపారు. ప్రతి జిల్లాలో యాదవుల సమస్యలపై కలెక్టర్, బీసీ అధికారుల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు నక్క నారాయణమూర్తి, బాలకృష్ణ యాదవ్, దూళి రంగనాయకులు, నాగరాజు జంగిర్ల, మహేష్ బాబు, జగదీశ్వర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## కల్తీ మద్యం పేరు వినిపిస్తే కఠిన చర్యలు : జీవీ ఆంజనేయులు



వినుకొండ (చైతన్యరథం): రాష్ట్రంలో కల్తీ మద్యం అన్నమాటే వినిపించకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతుందని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. ఇకపై కల్తీ మద్యం ఘటనలు ఎక్కడ వినిపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కల్తీ మద్యం ఘటనలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయడానికి కూటమి ప్రభుత్వం సురక్ష మొబైల్ యాప్ను తీసుకొచ్చిందని, దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత స్థానిక ఎక్సైజ్ అధికారులు, అధికార యంత్రాంగం, మద్యం దుకాణదారులు, నాయకులందరిపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు. అక్రమ మద్యపాన నివారణ కోసం బుధవారం నుంచి ఈ నెల 29 వరకు వారం రోజులపాటు ప్రజా భద్రతా అవగాహన ప్రచారాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ప్రజలందరూ సురక్ష యాప్ను ఉపయోగించడం తెలుసుకోవాలని, మద్యం కొనుగోలు చేసే ముందు క్యూఆర్ కోడ్ను స్కాన్ చేసి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. అక్రమ, కల్తీ మద్యం వినియోగాన్ని అరికట్టడంలో ప్రజా భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదే సమయంలో మండల స్థాయి నాయకులు కూడా స్థానిక మద్యం దుకాణాలను సందర్శించి ఎక్సైజ్ సురక్ష యాప్ వినియోగం జరుగుతుందా? లేదా? అనే విషయాన్ని పరిశీలించాలన్నారు. ప్రతి మద్యం సీసాపై ఉన్న క్యూఆర్ కోడ్ను ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్లో తప్పనిసరిగా స్కాన్ చేసి తనిఖీ చేసుకోవాలన్నారు. మద్యం సీసాలపై ఉండే క్యూఆర్ కోడ్ను స్కాన్ చేసి వివరాలు తెలుసుకోవడంపై కరపత్రాలు ముద్రించి పంపిణీ చేయాలని తెలిపారు. మద్యం దుకాణాలు, బార్లు, ప్రీమియం స్టోర్లు సహా అన్ని లైసెన్స్ ప్రాంగణాల్లో ఏపీఎస్బీసీఎల్ ధ్రువీకృత నాణ్యమైన మద్యం విక్రయాలు మాత్రమే జరిగేలా, నకిలీ మద్యం వస్తే వెంటనే గుర్తించేలా కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థను రూపొందించిందన్నారు. కల్తీ మద్యం విక్రయించినట్లు తేలితే.. స్టాక్ స్వాధీనం చేసుకుని మద్యం దుకాణం లేదా బార్ను వెంటనే సీజ్ చేసి లైసెన్స్ కూడా రద్దు చేస్తామన్నారు.

# కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన కూటమి ప్రభుత్వం

●దారకానిపాడులో హత్యకు గురైన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు కుటుంబానికి భరోసా ఇచ్చిన రాష్ట్ర మంత్రి నారాయణ

●మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు

●హత్యకు గురైన కార్యకర్త కుటుంబానికి చెక్కులు అందజేసిన మంత్రి నారాయణ



నెల్లూరు (చైతన్యరథం): అక్టోబర్ 2 న గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు హత్య చాలా దారుణమైనదని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. బుధవారం నెల్లూరులోని రోడ్లు భవనాలు అతిథి గృహములో తిరుమలశెట్టి లక్ష్మీ నాయుడు కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేసే కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుమల శెట్టి లక్ష్మీనాయుడు భార్య సుజాతకు ఐదు లక్షల రూపాయల చెక్కును, కుమార్తెలు లహన్వి శ్రీ, తన్వి శ్రీలకు 5 లక్షల రూపాయలు వంతున, తిరుమలశెట్టి భార్గవ నాయుడుకి మూడు లక్షలు, తిరుమలశెట్టి పవన్ కుమార్‌కు 5 లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విషయం తెలిసిన వెంటనే లక్ష్మీనాయుడు హత్య ఉదంతంపై తక్షణమే స్పందించి హోం శాఖ మంత్రి అనిత, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, శాసనసభ్యులు శ్రీనివాసరావులతో కమిటీ వేయడం జరిగిందన్నారు. కమిటీ తుది నివేదిక ప్రకారం లక్ష్మీ నాయుడు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునే చర్యలలో నిన్న ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగా నగదుతో పాటు వారి కుటుంబ సభ్యులకు రెండు ఎకరాలు వంతున మొత్తం ఆరు ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందన్నారు. అంతేకాక పిల్లల చదువులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని ఆయన తెలిపారు. హత్యాకాండలో వెన్నుపూసకు దెబ్బ తగిలి ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందుతున్న తిరుమల శెట్టి పవన్ కుమార్‌కు ఐదు లక్షల రూపాయలు, నాలుగు ఎకరాల భూమిని ఇవ్వడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా గాయలతో బాధపడుతున్న తిరుమలశెట్టి భార్గవనాయుడుకు మూడు లక్షల రూపాయలు చెల్లించడం జరిగిందన్నారు. హత్య కేసుపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటుచేసి వీలైనంత త్వరగా నేరస్తులకు శిక్షపడే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. వాస్తవానికి లక్ష్మీ నాయుడు, హరిశ్చంద్రప్రసాదులు స్నేహితులని కొన్ని లావాదేవీలలో వచ్చిన తేడాల వల్ల హత్య చేయడం జరిగిందని తెలిసిందన్నారు. పిల్లలకు చెల్లించిన నగదును బ్యాంకులో డిపాజిట్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ... అక్టోబర్ రెండో తారీఖున జరిగిన హత్యా ఘటన ఒక విషాద గాదాని, ఇద్దరు స్నేహితులు మధ్య వ్యక్తిగత సమస్యల నేపథ్యంలో హత్య జరిగిందన్నారు. జరిగిన ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి లక్ష్మీనాయుడు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునే విధంగా కమిటీ వేయడం జరిగిందని కమిటీ నివేదిక మేరకు నిన్న రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి వారి కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

బాధితురాలు సుజాత మాట్లాడుతూ... ఇది కేవలం వ్యక్తిగత కక్షలతో జరిగిందని రాజకీయ అంశాలు ఏమీ లేవని ఆమె తెలిపారు. హత్య జరిగిన తదుపరి రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించి తగు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నేరస్తులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

# లక్ష్యం దిశగా సాగిన మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన

● ఆస్ట్రేలియా పర్యటన విజయవంతంపై గొట్టిపాటి లక్ష్మీ హర్షం



దర్శి (చైతన్యరథం): రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ చేపట్టిన ఆస్ట్రేలియా పర్యటన విజయవంతంపై నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ హర్షం వ్యక్తం చేశారు. గత నాలుగు రోజులుగా ఆస్ట్రేలియా దేశంలో రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం వివిధ భాగస్వామ్య ఒప్పందాలను చేసుకొని విజయవంతంగా తన విదేశ పర్యటనను పూర్తి చేసుకొని ఏపీకి పారిశ్రామిక పెట్టుబడులు, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు, నగరాల అభివృద్ధికి భాగస్వామ్యం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిపారని అన్నారు. ఆస్ట్రేలియాలో నైపుణ్యాభివృద్ధి ఉద్యోగ, శిక్షణ పారిశ్రామిక అకాడమిక్ సహకార వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ విదేశాయన యాత్ర ఉపయోగపడిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను 2.4 రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దే లక్ష్యంగా ఏపీలో డబల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ నడుస్తుందన్నారు. సిడ్నీలో నిర్వహించిన సిఐఐ పార్ట్నర్‌షిప్ సమ్మిట్ రోడ్ షోలో లోకేష్ పెట్టుబడిదారులను కోరడం జరిగిందన్నారు. ఏపీలో ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు అమెరికా ఆంక్షలు నుండి తట్టుకొని ఆహ్వానం నిలబెట్టేందుకు ఏపీ సి ఫుడ్ పరిశ్రమకు ఆస్ట్రేలియా అండగా ఉండే విధంగా ఒప్పందాలు చేసుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా గ్రేటర్ సిడ్నీలో ప్రధాన నగరాల అభివృద్ధికి పలు ఒప్పందాలు జరిగాయని ఆమె వివరించారు. హక్కుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం ఆస్ట్రేలియా పర్యటనతోనే సాధ్యమన్నారు. ఇలా నాలుగు రోజులు పాటు లోకేష్ పర్యటన భారత్ – ఆస్ట్రేలియా వాణిజ్యంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్రగా మారనుందని లక్ష్మీ వివరించారు.

# సోమిరెడ్డి చొరవతో తప్పిన ముప్పు

● నక్కలకాలువలో పెరిగిన ప్రవాహాన్ని అదుపుచేసిన అధికారులు




సర్వేపల్లి (చైతన్యరథం): వెంకటాచలం మండలంలోని అట్లంవారికండ్రిగ వద్ద నక్కలకాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క రైతులకు తీవ్ర ఆందోళనను కలిగించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కాలువలో ప్రవాహం తీవ్రమవ్వగా, గుర్రపుడెక్క నీటి ప్రవాహానికి అడ్డుగా మారి పొలాలకు ముంపు ముప్పు ఏర్పడింది. ఈ పరిస్థితిని గమనించిన రైతులు తక్షణమే స్థానిక అధికారులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తక్షణమే స్పందించి సంబంధిత అధికారులను, నాయకులను అప్రమత్తం చేశారు. సోమిరెడ్డి ఆదేశాల మేరకు ప్రొక్లెయిన్ యంత్రంతో అధికారులు ఘటన స్థలానికి చేరుకున్నారు. చవటపాళెం పీఏసీఎస్ చైర్మన్ రావూరి రాధాకృష్ణమనాయుడు, సర్వేపల్లి రిజర్వాయర్ చైర్మన్ చల్లా నాగార్జునరెడ్డి తదితరుల సమన్వయంతో గుర్రపుడెక్కను తొలగించి ప్రవాహాన్ని నిరాటంకంగా కొనసాగించేలా చర్యలు చేపట్టారు. ఈ వేగవంతమైన చర్యలతో పొలాల ముంపు ముప్పు నివారించబడి, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. సమస్యను తెలియజేసిన వెంటనే స్పందించి పరిష్కారం కోసం చొరవచూపిన ఎమ్మెల్యే సోమిరెడ్డికి రైతులు ధన్యవాదాలు తెలిపారు. ఈ చర్యలను పర్యవేక్షించిన వారిలో సన్నారెడ్డి బాలకృష్ణ రెడ్డి, పేర్నాటి విజయసేనా రెడ్డి, పాపారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దువ్వూరు చంద్ర మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఆక్రమణకు గురైన 700 ఎకరాల వక్ఫ్ భూమిని స్వాధీనం చేసుకున్నాం

●వైజాగ్ ఎన్టిపిసిలో 319 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించాం

●వక్ఫ్ బోర్డ్ ఆదాయాన్ని రెండింతలు పెంచాం

●ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్. అబ్దుల్ అజీజ్



నెల్లూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టీడీపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ రాష్ట్రంలోని 32 వక్ఫ్ సంస్థల నూతన మేనేజింగ్ కమిటీలు, ముతవల్లిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వక్ఫ్ భూములు దేవుడి భూములని ముతవల్లీల భూములు కాదని ముతవల్లీలు కేవలం మేనేజర్లు మాత్రమేనని అన్నారు. వక్ఫ్ సంస్థలను రక్షించి, అభివృద్ధి చేసి ఆదాయాన్ని పెంచాల్సిన బాధ్యత తమపై ఉందని అన్నారు. వక్ఫ్ ఆస్తులను తక్కువ అద్దెలకి ఇచ్చి సమాజ సేవ చేస్తున్నాం అనుకోవద్దని ఆదాయాన్ని పెంచి దానిని పేద ప్రజల సంక్షేమానికి వినియోగించాలని అన్నారు. మార్కెట్ విలువ పదివేలు ఉంటే వక్ఫ్ ఆస్తులను వెయ్యి, రెండు వేలకు అద్దెలకు ఇచ్చి ఉన్నారని, ఇది ముస్లిం సమాజానికి ద్రోహం చేయడమేనని అన్నారు. ఈ ఏడాది కాలంలో ఆక్రమణలకు గురైన 700 ఎకరాల వక్ఫ్ భూమిని స్వాధీనం చేసుకున్నామని, వైజాగ్ లో 319 ఎకరాలు అన్యాక్రాంతం అయినట్లు గుర్తించామని తెలిపారు. కర్నూల్‌లో వక్ఫ్ ఆస్తి అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేశామని తెలిపారు. కబ్జాదారుల కబంధహస్తాల్లో ఉండి ఎన్నో ఏళ్లుగా లీజుకు ఇవ్వని భూములను లీజుకు ఇచ్చామని వక్ఫ్ బోర్డ్ ఆదాయాన్ని రెండింతలు పెంచామని తెలిపారు. ప్రభుత్వ అధికారి విధులకు ఆటంకం కలిగిస్తే ఏ చట్టం అయితే అమలవుతుందో, ముతవల్లీలకు ఆటంకం కలిగించినా అదే చట్టం అమలవుతుందని, అన్నారు ధైర్యంగా పనిచేయాలని అన్నారు. తాలిం ఏ హునర్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 28 స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలను ప్రారంభిస్తున్నామని, కేవలం టైలరింగ్‌తో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఆగవని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మేము ఉన్నా లేకున్నా ఈ కార్యక్రమం ఆగకుండా వ్యూహం రచిస్తున్నామని తెలిపారు. ప్రతి మేనేజింగ్ కమిటీ, ప్రతి ముతవల్లి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ మనందరి బాధ్యత అని అన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో 500 మంది ప్రతిభావంతులైన ముస్లిం విద్యార్థులను టాలెంట్ టెస్ట్ ద్వారా ఎంపిక చేసి ఉచిత ఇంటర్మీడియట్ విద్య అందించబోతున్నామని తెలిపారు.

# నెల్లూరు రోడ్లపై నిలిచిన నీరు తొలగింపు



నెల్లూరు (చైతన్యరథం): నగరంలో బుధవారం కురిసిన భారీ వర్షాలకు స్థానిక 47వ డివిజన్ గుప్తా పార్క్ సెంటర్ ప్రధాన రోడ్లపై నిలిచిపోయిన వర్షపు నీటిని డివిజన్ ఇన్‌ఛార్జ్ గణేష్ కుమార్ స్వయంగా తొలగించారు. మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు క్షేత్రస్థాయిలో పనిచేసి నీటిని గల్ఫర్ మిషన్ సహాయంతో వర్షపు నీటిని తొలగించే పనులు వేగంగా చేపట్టారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆదేశాల మేరకు వర్షపు నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని గణేష్ కుమార్ వ్యాఖ్యానించారు. యు.జి.డి. వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ పర్యవేక్షణలో నీటిని తొలగించారు. ప్రజలకు తక్షణ ఉపశమనం లభించగా, శాశ్వత పరిష్కారం కోసం అధికారులతో చర్చలు జరిపి త్వరలో చర్యలు తీసుకుంటానని గణేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచికి కృష్ణ, షేక్ మహబాషా పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి పెమ్మసాని చొరవతో ఏపీకి రూ.665 కోట్లు విడుదల

గుంటూరు (చైతన్యరథం): గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తీసుకున్న చొరవతో ఉపాధి హామీ పనుల కింద ఏపీకి రూ.665 కోట్ల విలువైన మెటీరియల్ కాంపోనెంట్ కేంద్ర ప్రభుత్వం ద్వారా బుధవారం మంజూరైంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్కు సంబంధించి కేంద్రం ఈ రూ. 665 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ నిధులు రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల మెటీరియల్ ఖర్చులకు ఉపయోగపడనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనుల్లో భాగంగా అవసరమైన మెటీరియల్ నిమిత్తం ఈ కాంపోనెంటును గ్రామీణాభివృద్ధి శాఖ కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ విడుదల చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణకు పెమ్మసాని ధన్యవాదాలు తెలిపారు.



## పొలిటికల్ ఇస్లామ్ యమ డేంజర్..

**యోగి ఆదిత్యనాథ్ హెచ్చరిక**

గోరఖ్‌పూర్: దేశానికి పొలిటికల్ ఇస్లామ్ పెను ప్రమాదమని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హెచ్చరించారు. ఈ ముప్పుతో మన పూర్వీకులు పోరాడారని అన్నారు. అయితే దాని గురించి అంతగా చర్చ జరగలేదని చెప్పుకొచ్చారు. చరిత్రలో బ్రిటిష్, ఫ్రెంచ్ వలసదారుల ప్రస్తావన ఉన్నప్పటికీ పొలిటికల్ ఇస్లామ్‌పై ప్రస్తావన చాలా తక్కువని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో జరుగుతున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతజయంతి ఉత్సవాల్లో సీఎం బుధవారం నాడు పాల్గొన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్, గురు గోవింద్ సింగ్, మహారాణా ప్రతాప్, మహారాణా సంగా వంటి వీరులు పొలిటికల్ ఇస్లామ్‌పై కీలక పోరాటం సాగించారని గుర్తు చేశారు. అయితే ఆ కోణాన్ని చరిత్ర పెద్దగా పట్టించుకోలేదన్నారు.

**దేశాన్ని విడగొట్టేందుకే..**

పొలిటికల్ ఇస్లామ్ ద్వారా దేశాన్ని విడగొట్టేందుకు చంగూర్ బాబా వంటి శక్తులను ఉపయోగించుకుంటారని, అలాంటి శక్తుల నుంచి రక్షించేందుకు సమాజాన్ని ఏకం చేసే కృషిని ఆర్ఎస్ఎస్ కొనసాగిస్తోందని అన్నారు. ఆర్ఎస్ఎస్ సాగిస్తున్న ప్రయత్నాలు ప్రశంసార్హమని యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. మతమార్పిడులకు సిద్ధపడే వారికి కులం ఆధారంగా చాంగూర్ బాబా డబ్బులు ఆఫర్ చేసే వారని తెలిపారు. 'ఈ డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఆ విషయం మీకు కూడా తెలియదు. ఎక్కడో విదేశాల నుంచి ఆ సొమ్ములు రావడం లేదు. మీ నుంచే వస్తున్నాయి. మీరు ఏదైనా వస్తువులు కొన్నప్పుడు దానిపై హలాల్ సర్టిఫికేషన్ ఉందా అనేది ముందుగా చూడండి. హలాల్ సర్టిఫికేషన్‌ను మేము ఉత్తరప్రదేశ్‌లో బ్యాన్ చేశాం. ఆశ్చర్యం ఏమిటంటే హలాల్ సర్టిఫికేషన్ ఉన్న వస్తువుల్లో సబ్బులు, దుస్తులు, అగ్గిపెట్టెలు కూడా ఉన్నాయి' అని తెలిపారు. ఎలాంటి అనుమతి తీసుకోకుండా హలాల్ సర్టిఫికేషన్ పేరుతో రూ.25,000 కోట్లు పోగు చేశారని, ఈ సొమ్మంతా ఉగ్రవాదం, లవ్ జిహాద్, మతమార్పిడులకు ఖర్చు చేస్తుంటారని యోగి వివరించారు. ఆ కారణంగా హలాల్ సర్టిఫికేషన్‌కు వ్యతిరేకంగా ఉత్తరప్రదేశ్ నుంచే పెద్దఎత్తున ప్రచారం మొదలుపెట్టామని చెప్పారు. ఏదైనా వస్తువు కొనేటప్పుడు ఎవరు తయారు చేశారో చూసుకోవాలని కోరారు. చాంగూర్ అలియాస్ జలాలుద్దీన్ ఒక ఉదాహరణ మాత్రమేనని సూచించారు.

**హలాల్ సర్టిఫైడ్ ప్రోడక్ట్ అంటే..**

హలాల్ సర్టిఫైడ్ ప్రోడక్ట్ అనేది ఇస్లామిక్ చట్టానికి లోబడి అందించే వస్తువు, సేవల కిందకు వస్తుంది. తద్వారా వచ్చే సొమ్ములను ముస్లింలకే ఉపయోగించాలి. ఇండియాలో హలాల్ సర్టిఫికేషన్ థర్డ్ పార్టీ సంస్థలు చేస్తున్నాయే కానీ, తప్పనిసరి కాదు.

# మా నాన్న కెరీర్ ముగిసింది..

- కాబోయే సీఎం ఆయనే..
- సిద్ధరామయ్య తనయుడి సంచలన వ్యాఖ్యలు

బెళగావి: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర బుధవారం నాడు సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తండ్రి రాజకీయ కెరీర్ చివరి దశలో ఉందని తెలిపారు. పార్టీ నేత, కేబినెట్ మంత్రి సతీష్ జార్కిహోళికి మార్గదర్శిగా తన తండ్రి ఉంటారని చెప్పారు. దీంతో కర్ణాటక కాంగ్రెస్‌ను నడిపేందుకు సీఎంగా జార్కిహోళి సమర్థుడంటూ పరోక్షంగా ఆయనే సంకేతాలిచ్చినట్టు అయింది. కాంగ్రెస్ పార్టీలో నాయకత్వ మార్పు లు జరుగనున్నాయని, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపడతారంటూ కొద్దికాలంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సిద్ధరామయ్య ప్రభుత్వం వచ్చే నవంబర్‌లో రెండున్నరేళ్ల పాలన పూర్తి చేసుకోనుంది. తక్కిన రెండున్నరేళ్ల పాలన డీకే శివకుమార్‌కు అప్పగిస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే సిద్ధరామయ్య మాత్రం తాను పూర్తి కాలం ముఖ్యమంత్రినంటూ ఈ ఊహాగానాలు కొట్టిపేస్తున్నారు.



**యతీంద్ర ఏమన్నారు?**

బెళగావి జిల్లా రాయ్‌బాగ్ తాలూకా కప్పలగుడ్డి గ్రామంలో సెయింట్ కనకదాస్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో యతీంద్ర పాల్గొన్నారు. తన తండ్రి రాజకీయ ప్రస్థానం చివరిదశలో ఉందని, ఆయన తర్వాత ప్రగతిశీల, ముందుచూపు కలిగిన నేతల అవసరం ఉందని అన్నారు. ఈ బాధ్యతలు చేపట్టగల సమర్థత సతీష్ జార్కిహోళికి ఉందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని నడిపేం చేందుకు ఆయన తగిన వ్యక్తి అని అన్నారు.

**కాంగ్రెస్‌లో అలజడి**

యతీంద్ర వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలకు దారితీసే అవకాశాలపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. పార్టీ అధిష్ఠానం వచ్చే నెలలో సిద్ధరామయ్యను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోవాలని కోరితే అంత తేలిగ్గా సీఎం పదవిని డీకే వదులుకోకపోవచ్చు. సిద్ధరామయ్య వర్గీయులు సతీష్ జార్కిహోళిని ఆయన వారసుడిగా తెరపైకి తెస్తే డీకే వైపు నుంచి ఉద్రిక్త పరిస్థితులు తలెత్త వచ్చు. కాగా, యతీంద్ర వ్యాఖ్యలపై ఇటు సిద్ధరామయ్య కానీ, అటు పార్టీ అధినాయకత్వం కానీ ఇంకా స్పందించలేదు.

# శబరిమలను దర్శించుకున్న తొలి రాష్ట్రపతి

కేరళ పర్యటనలో ఉన్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమలకు చేరుకున్నారు. ఇరుముడితో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆరు కాన్వాయ్‌లతో ద్రౌపది ముర్ము శబరిమలకు చేరుకున్నారు. రాష్ట్రపతి కోసం నిబంధనలు సడలించిన అధికారులు వాహనాల్లో శబరిమల చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. అంతకుముందు శబరిమలకు వెళ్తున్న క్రమంలో రాష్ట్రపతి పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు ఆమె హెలికాప్టర్‌లో ప్రయాణించారు. ప్రమదం ప్రాంతంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో హెలికాప్టర్ ల్యాండ్ అవుతున్న సమయంలో ఒక్కసారిగా హెలిప్యాడ్ కుంగిపోయింది. హెలికాప్టర్ చక్రం హెలిప్యాడ్ కాంక్రీట్‌లో కూరుకుపోయింది. అధికారులు వెంటనే స్పందించి సమస్యను సరిచేశారు.





# కుమారుడి భార్యతో మాజీ డీజీపీ ఎఫైర్..

పంజాబ్ మాజీ డీజీపీ మహ్మద్ ముస్తఫాపై పోలీస్ కేసు నమోదైంది. కోడలితో ఎఫైర్ పెట్టుకోవటంతో పాటు కుమారుడు మరణానికి కారణం అయ్యాడన్న ఆరోపణలతో ఆయనపై కేసు ఫైల్ అయింది. ముస్తఫాతో పాటు ఆయన భార్య మాజీ మినిస్టర్ రజియా సుల్తానా, కూతురు, కోడలిపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. అక్టోబర్ 16వ తేదీన ముస్తఫా కొడుకు ఆకిల్ అక్తర్ అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతిచెందాడు. ఆకిల్ మృతిపై మొదట పోలీసులకు ఎలాంటి అనుమానం రాలేదు. అక్టోబర్ 17వ తేదీన ఆకిల్ స్నేహితుడు శంషుద్దీన్ చౌదరి మలేర్‌కోట్ల పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుతో చీకటి కోణాలు వెలుగు చూశాయి. శంషుద్దీన్ తన ఫిర్యాదులో.. 'తన భార్యతో తండ్రికి అక్రమ సంబంధం ఉందని ఆకిల్ తెలుసుకున్నాడు. ఈ విషయం ఆకిల్ తల్లికి, సోదరికి కూడా తెలుసు. ఆ ఇద్దరూ కలిసి ఆకిల్‌ను చంపడానికి కుట్రలు చేశారు. చంపటం కుదరకపోతే తప్పుడు కేసులో ఇరికించాలని చూశారు. ఆకిల్‌కు ఏడేళ్ల కూతురు, ఐదేళ్ల కొడుకు ఉన్నారు' అని పేర్కొన్నాడు.



తనపై వస్తున్న ఆరోపణలపై డీజీపీ స్పందిస్తూ.. 'నా కుమారుడు మానసిక పరిస్థితి సరిగా లేదు. 2008లో ఓసారి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. యాసిడ్ తాగాడు. దీంతో అతడి ఆర్గాన్స్ దెబ్బతిన్నాయి. గత సంవత్సరం ఏప్రిల్ నెల నుంచి డ్రగ్స్ తీసుకుంటూ ఉన్నాడు' అని చెప్పాడు. ముస్తఫాపై పోలీసులకు ఫిర్యాదు చేసిన శంషుద్దీన్ చౌదరి ఉన్నతాధికారులకు ఓ రిక్వెస్ట్ చేశాడు. ఆకిల్ వీడియోలు, డిజిటల్ ఎవిడెన్స్, కాల్ రికార్డ్స్, పోస్టుమార్టమ్ రిపోర్టును పరీక్ష చేయాలని కోరాడు. ఇక, ఈ కేసుపై దర్యాప్తు చేయడానికి హర్యానా పోలీస్ శాఖ సిట్‌ను ఏర్పాటు చేసింది. శరవేగంగా దర్యాప్తు జరుగుతోంది.

# అత్యాచారం చేస్తామని మహిళా డాక్టర్‌కు బెదిరింపులు

- పశ్చిమబెంగాల్‌లో మరోసారి కలకలం..

కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ హత్యాచార ఘటన మరువక ముందే మరో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. హౌరా జిల్లాలో ఓ మహిళా డాక్టర్‌పై పేషెంట్ తరపు వారు వేధింపులకు దిగారు. ఉలుబేరియాలోని శరత్ చంద్ర ఛటోపాధ్యాయ్ గవర్నమెంట్ మెడికల్ అండ్ హాస్పిటల్‌లో సోమవారం ఈ దారుణం జరిగింది. డాక్టర్‌పై అత్యాచారం చేస్తామంటూ నిందితులు బెదిరింపులకు దిగారు. మీడియా కథనాల ప్రకారం, సోమవారం మధ్యాహ్నం పేషెంట్ తరపు వారికి, బాధిత మహిళా డాక్టర్‌కు మధ్య వివాదం తలెత్తింది. ఈ క్రమంలో వారు డాక్టర్‌పై అత్యాచారానికి ఒడిగడతామంటూ బెదిరించారు. డాక్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. నిందితులను షేక్ సామ్రాట్, షేక్ బాబులాల్, షేక్ హసీబుల్‌గా గుర్తించారు. షేక్ బాబులాల్ హోంగార్డు అని, అతడు ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్నాడని తెలిపారు.

ఈ ఘటన రాజకీయంగా కూడా ప్రకంపనలు సృష్టిస్తోంది. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందంటూ మమతా బెనర్జీ ప్రభుత్వంపై రాజ్యసభ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య విమర్శలు గుప్పించారు. ఆర్‌జీ కార్ ఘటన తరువాత కూడా ప్రభుత్వం గుణపాఠాలు నేర్చుకోలేదని మండిపడ్డారు. 'తృణమూల్ పాలనలో సమాజం కల్లోలంగా మారింది. జుగుప్సాకర మనస్తత్వమున్న హోంగార్డులు, సివిక్ వాలంటీర్లు అధికార పార్టీ భాగస్వాములుగా ఉన్నారు. తమ ప్రభుత్వ పాలన సాగుతోందని అనుకుంటున్నారు. పోలీసులు, పరిపాలన యంత్రాంగం అంటే వారికి లక్ష్యం లేదు. ఆసుపత్రిలో సీసీటీవీ కెమెరాలు కూడా లేవు. ఇది చాలా విచారకరమైన ఘటన' అని ఎంపీ అన్నారు.



మమతా బెనర్జీ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ కూడా మండిపడ్డారు. బెంగాల్‌లో మహిళలు ఎదుర్కొంటున్న అభద్రత భయానకంగా ఉందని అన్నారు. మమతా బెనర్జీ ప్రకటనలన్నీ డొల్ల అని తేలిపోయిందని కామెంట్ చేశారు. మమతా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగమే ఈ ఘటనకు బాధ్యులని అన్నారు. బాధితులు భయంలో కూరుకుపోయారని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న పాపాలు పరిమితికి మించిపోయాయని కామెంట్ చేశారు. ప్రతిపక్షాల విమర్శలను తృణమూల్ పార్టీ ప్రతినిధి తోసిపుచ్చారు. మహిళా డాక్టర్‌పై వేధింపులు విచార కరమని అన్నారు. నిందితులను అరెస్ట్ చేసినట్టు చెప్పారు. నందిగ్రామ్‌లో జరిగిన అత్యాచార ఉదంతం లో బీజేపీ పార్టీ వర్కర్ అరెస్ట్ అయినప్పుడు వారంతా ఎందుకు మౌనంగా ఉండిపోయారని ప్రశ్నించారు.

# ఛోక్సీ అప్పగింతకు అడ్డంకులు లేవు

**- స్పష్టం చేసిన బెల్జియం కోర్టు**



పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.వేల కోట్లు ఎగవేసి పారిపోయిన వ్యాపారవేత్త, ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీని భారత్‌కు అప్పగించే విషయంపై బెల్జియం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆయనను భారత్‌కు అప్పగించడంలో తమకు ఎలాంటి అడ్డంకులు లేవని స్పష్టం చేసింది. మెహుల్ ఛోక్సీని భారత్‌కు అప్పగించేందుకు ఇటీవల బెల్జియం న్యాయస్థానం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో తన అప్పగింత ఆమోదం రాజకీయంగా ప్రేరేపించిందని, ఇది తన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని ఆరోపించారు. ఈ ఆరోపణలపై తాజాగా బెల్జియం యాంట్వెర్ప్ న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఛోక్సీ బెల్జియం పౌరుడు కాదని గుర్తుచేసింది. అప్పగింతను సమర్థించే తీవ్రమైన అభియోగాలు అతడు ఎదుర్కొంటున్న విషయాన్ని కూడా ప్రస్తావించింది. ఛోక్సీపై భారత్ వేసిన అభియోగాలను బెల్జియం చట్టప్రకారం కూడా నేరాలుగానే పరిగణిస్తామని వ్యాఖ్యానించింది.

భారత్ ఆదేశాల మేరకు తనను ఆంటిగ్వానుంచి కిడ్నాప్ చేశారంటూ చాలాకాలంగా ఛోక్సీ చేస్తున్న వాదనలను కూడా కోర్టు తోసిపుచ్చింది. ఈ ఆరోపణలకు సంబంధించి తగిన ఆధారాలు లేవని పేర్కొంది. ఈ సందర్భంగా ఛోక్సీ అప్పగింత అనంతరం అతడిని ఉంచే జైలుకు సంబంధించి భారత ప్రభుత్వం అందించిన వివరాలను బెల్జియం కోర్టు ప్రస్తావించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌నుంచి తీసుకున్న దాదాపు రూ.13 వేల కోట్ల రుణాలను ఎగ్గొట్టిన ఛోక్సీ, అతడి మేనల్లుడు నీరవ్ మోదీ (కేసులో మరో ప్రధాన నిందితుడు) దేశం విడిచి పారిపోయారు. ఛోక్సీ ఆంటిగ్వా-బార్బుడాకు వెళ్లగా.. నీరవ్‌మోదీ లండన్‌లో ఆశ్రయం పొందాడు. ఇటీవల యాంట్వెర్ప్ న్యాయస్థానం ఛోక్సీ అప్పగింతకు ఆమోదం తెలిపింది.

# పారిస్ చోరీ..

## పింక్‌పాంథర్స్ పనేనా?




ఇటీవలి కాలంలో యావత్ ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసిన చోరీ -ఫ్రాన్స్‌లో ప్రఖ్యాత లౌవ్రే మ్యూజియం ఘటన. చీమ చిటుక్కుమన్నా కనిపెట్టగలిగే అత్యంత భద్రత కలిగిన మ్యూజియంలోకి చొరబడిన దుండగులు -నిమిషాల వ్యవధిలో విలువైన ఆభరణాలను మాయం చేయడం మామూలు విషయం కాదు. దుండగుల చేతివాటం విలువ దాదాపు రూ.895 కోట్లుగా అంచనా. విలువైన ఆభరణాలను కొట్టేసింది ఎవరనేది మాత్రం ఇంతవరకూ తేలలేదు. కరుడు గట్టిన దొంగల ముఠా పింక్ పాంథర్స్ పనేనన్న అనుమానం చుట్టూ దర్యాప్తు సాగుతోంది. నిజానికి -ఇది పింక్ పాంథర్స్ గ్యాంగ్ పనేనని గట్టిగా చెప్పడానికి తగిన ఆధారాలు లేవు. పింక్ పాంథర్స్ గతంలో పాల్పడిన చోరీల స్వభావాన్ని అన్వయించి అనుమానిస్తున్నారంతే! "మ్యూజియంలో చోరీకి పాల్పడిన వారు దొంగతనాల్లో ప్రొఫెషనల్స్ అని అర్థమవుతుంది.

ఇంతవరకూ ఆచూకీ మాత్రం లేదు. పక్కా సమాచారం, ప్రణాళికతో చౌర్యానికి పాల్పడటం చూస్తుంటే పింక్ పాంథర్స్ పనే అనిపిస్తోంది" అని ఫ్రాన్స్ స్క్వాడ్ బ్యూ'ది స్పీస్' మాజీ చీఫ్ బ్యారీ ఫిలిప్స్ అంటున్నారు. అక్టోబరు 19న పారిస్‌లోని లౌవ్రే మ్యూజియంలో చోరీ జరిగింది. మ్యూజియంలో ఓవైపు నిర్మాణం జరుగుతుండగా.. అక్కడి నుంచి దుండగులు లోపలికి చొరబడ్డారు. అనంతరం సరుకు రవాణా ఎలివేటర్‌లో అపోలో గ్యాలరీలోకి ప్రవేశించారు. నెపోలియన్ కాలంనాటి వస్తువులు, ఆభరణాలున్న గ్యాలరీ అద్దాలను పగలగొట్టి అందులోని తొమ్మిది వస్తువులను దొంగలించారు. వీరు వెళ్తుండగా.. అందులోని ఓ ఆభరణం మ్యూజియం బయట పడిపోయింది. మిగతా ఆభరణాల విలువ 88 మిలియన్ యూరోలు (భారత కరెన్సీలో దాదాపు రూ.895 కోట్లు) ఉంటుందని అధికారుల అంచనా. ఈ చోరీకి పాల్పడిన దుండగులను పట్టుకునేందుకు దాదాపు 100 మందితో కూడిన దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు.

# 'జైషే' మహిళలకు ఆన్‌లైన్ కోర్స్‌లు?

**- భద్రతా దళాలను ఉటంకిస్తూ ఆంగ్లమీడియా కథనాలు**



పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ జరిపిన 'ఆపరేషన్ సిందూర్'తో ధ్వంసమైన నెట్వర్క్‌ను విస్తరించేందుకు తొలిసారి ప్రత్యేకంగా జైషే మహిళా బ్రిగేడ్‌ను ఏర్పాటు చేసినట్లు ఇటీవల నిఘావర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పాటైన జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థ మహిళలకు ఉగ్రవాదంపై ఆన్‌లైన్ కోర్సులు నిర్వహించనున్నట్లు నిఘావర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు తెలిపాయి. ఈ కోర్సుకు 'తౌఫత్ అల్ ముమినాత్'గా పేరు పెట్టినట్లు తెలుస్తోంది. జైషే చీఫ్ మసూద్ అజార్ చెల్లెళ్లు సాదియా అజార్, సమైరా అజార్ దీనికి నాయకత్వం వహిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో బహవల్‌పూర్‌లోని జైషే ప్రధాన కేంద్రంపై భారత్ బాంబులు జారవిడిచిన సంగతి తెలిసిందే. ఆ దాడుల్లో మసూద్ అజార్ కుటుంబానికి చెందిన 10మంది మృతి చెందారు. మృతుల్లో మసూద్ బావ, సాదియా భర్త యూసఫ్ అజార్ కూడా ఉన్నాడు. కాగా మసూద్ మరో సోదరి సమైరా భర్త.. పుల్వామా ఉగ్రదాడి కుట్రదారు ఉమర్ ఫరూక్ గతంలో భారత భద్రతా దళాల ఎన్కౌంటర్‌లో మరణించాడు. ప్రస్తుతం వీరిరువురూ మహిళా బ్రిగేడ్ సభ్యులకు ఆన్‌లైన్ కోర్సుల్లో మతపరమైన, జిహాద్‌కు సంబంధించిన పాఠాలను బోధించనున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇతర మహిళలను కూడా ఉగ్రవాదం వైపు ఆకర్షించడానికి ఈ బ్రిగేడ్ సభ్యులు పని చేస్తున్నట్లు తెలిపాయి. ఈ మహిళ బ్రిగేడ్‌లో జైషే కమాండర్ల భార్యలతోపాటు బహవల్పూర్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లీ, హరిపూర్‌వంటి ప్రాంతాల్లో ఆర్థికంగా బలహీనవర్గాలకు చెందిన మహిళలను సభ్యులుగా నియమించుకున్నట్లు తెలుస్తోంది. నవంబర్ 8నుంచి సెషన్లు ప్రారంభం కానున్నాయని.. ఇందులోభాగంగా ప్రతిరోజు 40నిమిషాల పాటు మసూద్ చెల్లెళ్లు, కమాండర్ల కుటుంబసభ్యులు మహిళలకు పాఠాలు బోధిస్తారని నిఘావర్గాలు పేర్కొన్నాయి. ఇందుకోసం మహిళా బ్రిగేడ్‌లోని సభ్యులనుంచి కొంత మొత్తంలో విరాళాలు కూడా సేకరిస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త మహిళా బ్రిగేడ్ భారత్‌లో తన నెట్వర్క్‌ను ఏర్పాటుచేసే అవకాశం ఉందని ఇటీవల నిఘా వర్గాలు హెచ్చరించాయి. సోషల్ మీడియా, ఆన్‌లైన్ నెట్వర్క్‌తో జమ్మూకశ్మీర్, యూపీవంటి ప్రాంతాల్లో మహిళలను ఈ బ్రిగేడ్‌లో చేరేలా ఆకర్షించే ప్రమాదముందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో భారత అధికారులు అప్రమత్తమైనట్లు సమాచారం.

# శ్రీలంకలో మున్సిపల్ చైర్మన్ కాల్చివేత

**రాజకీయ పార్టీల తగాదాలే కారణమా?**



శ్రీలంకకు చెందిన ఓ రాజకీయ నేత పార్టీ ఆఫీస్‌లోనే దారుణ హత్యకు గురయ్యారు. వెలిగామా కౌన్సిల్ ఛైర్మెన్ లసంత విక్రమశేఖర (38) బుధవారం తన కార్యాలయంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సమయంలో ఇద్దరు దుండగులు ఆఫీస్లోకి చొరబడ్డారు. తమవద్ద ఉన్న గన్‌తో విక్రమశేఖరపై పలురౌండ్లు కాల్పులు జరిపారు. అనంతరం పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన విక్రమశేఖరను ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టామని.. దుండగుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు వెల్లడించారు. దాడికి కారణాలు తెలియాల్సి ఉంది. వెలిగామా కౌన్సిల్ నియంత్రణపై ప్రతిపక్ష సామగి జన బలవేగయ పార్టీకి అధికార పార్టీ 'నేషనల్ పీపుల్స్ పవర్' పార్టీకి మధ్య తీవ్ర పోరు ఉన్న నేపథ్యంలో కౌన్సిల్ చైర్మన్ హత్యకు గురికావడం అక్కడి రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

# కేంద్రం.. కొత్త స్కీమ్!

**అమెరికాలోని 'స్టార్ల'ను వెనక్కితెచ్చే ప్రయత్నం**



అమెరికా ఉన్నత విద్యపై ట్రంప్ సర్కారు కఠిన ఆంక్షలు అమలుచేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అగ్రరాజ్యం సహ విదేశాల్లోని భారతీయ, భారత సంతతికి చెందిన విద్యా నిపుణులను స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. పరిశోధకులు, విద్యావేత్తలను వెనక్కి తీసుకొచ్చి వారు దేశీయ విద్యాసంస్థల్లో పనిచేసేలా కొత్త స్కీమ్‌ను తీసుకురానున్నట్లు సమాచారం. ఈమేరకు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం వెల్లడించింది. దేశీయ పరిశోధన, సృజనాత్మక రంగాన్ని బలోపేతం చేయడం కోసం కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రతిభావంతులైన పరిశోధకులు, విద్యా నిపుణులను వెనక్కి తీసుకొచ్చి వారికి గ్రాంట్లు ఇవ్వాలని యోచిస్తున్నట్లు సమాచారం. దేశానికి తిరిగొచ్చిన స్కాలర్లు ఇక్కడ లాబోరేటరీలు ఏర్పాటుచేసి, రీసెర్చ్ బృందాన్ని నియమించుకునేలా వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించే అవకాశం ఉందని సదరు కథనం పేర్కొంది. ఇందుకోసం ఇప్పటికే ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ కార్యాలయం.. ఉన్నత విద్యాశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్మెంట్, బయోటెక్నాలజీ విభాగ నిపుణులతో చర్చలు ప్రారంభించిందట. ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో వారికి ఉద్యోగాలు ఇచ్చేలా ప్రణాళికలు చేస్తున్నట్లు సమాచారం. స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్)లోని 12-14 ప్రాధాన్య రంగాల్లోని నిపుణులకు ఈ స్కీమ్ అందించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు ఐఐటీ డైరెక్టర్లతోనూ సంప్రదింపులు జరిపినట్లు సమాచారం.



# ఉగాండాలో భారీ రోడ్డు ప్రమాదం

**- 63 మంది దుర్మరణం**

ఉగాండా రాజధాని కంపాలలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 63మంది మృతిచెందినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. కంపాలలో గులు రోడ్డుపై పలు వాహనాలు ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. గులు హైవేపై ఓ బస్సు డ్రైవర్ లారీని ఓవర్‌టేక్ చేస్తూ.. ఎదురుగా వస్తున్న మరో బస్సును ఢీకొట్టింది. వెంటనే డ్రైవర్ బస్సును మరో వైపునకు తిప్పడడంతో పక్కన.. ఎదురుగా వస్తున్న రెండు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో నియంత్రణ కోల్పోయిన పలు వాహనాలు వరుసగా ఢీకొట్టుకొని బోల్తా పడ్డాయి. మృతదేహాలను పోస్టుమార్టానికి, గాయపడిన క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించామని అధికారులు పేర్కొన్నారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతుందన్నారు. దేశంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం ఓవర్ టేకింగ్ చేస్తుండమేనని.. వాహనదారులు రోడ్లపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అక్కడి ప్రజలను కోరారు.

చైతన్యరథం

# నేడు ఆస్ట్రేలియాతో రెండో వన్డే

◆ భిన్నంగా రోహిత్ శైలి

హిట్‌మ్యాన్‌గా పేరొందిన స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మకు ప్రస్తుతం పరీక్షాకాలం నడుస్తోందని చెప్పకతప్పదు. వన్డే కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్న రోహిత్ ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో రెండంకెల స్కోరు కూడా చేయలేక అభిమానులను నిరాశపరిచాడు. ప్రస్తుతం గురువారం జరిగే రెండో వన్డేకు సిద్ధమవుతున్నాడు. అడిలైడ్‌లో ప్రాక్టీస్ సెషన్ కు కూడా హాజరయ్యాడు. ఈ సెషన్‌లో రోహిత్ తన సహజశైలికి భిన్నంగా కనిపించడం అభిమానుల్లో టెన్షన్ పెంచేసింది. ఇప్పటికే టెస్టులు, టీ20ల నుంచి తప్పుకున్న రోహిత్ ఇక వన్డేలకు గుడ్‌బై చెబుతాడా? అన్న వార్తలు జాతీయ మీడియాలో వైరల్‌గా మారాయి. సాధారణంగా రోహిత్ నెట్ ప్రాక్టీస్ సెషన్స్ సమయంలో మీడియాతో మాట్లాడుతుంటాడు. అభిమానులను కూడా నవ్వుతూ పలక రిస్తుంటాడు. కానీ ఈసారి మాత్రం రోహిత్ శైలి ఇందుకు భిన్నంగా ఉందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. ప్రాక్టీస్ సెషన్ తరువాత కూడా రోహిత్ మౌనంగా ఒక్కడే హోటల్‌కు వెళ్లిపోగా చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, గౌతం గంభీర్ మాత్రం యశస్వీ జైస్వాల్‌తో సుదీర్ఘ చర్చలో మునిగిపో యారు. రోహిత్ స్థానాన్ని భర్తీ చేయగల సత్తా యశస్వికి ఉందన్న అభిప్రాయం విన బడుతోంది. ఈ నేపథ్యంలో నెట్ ప్రాక్టీస్ సెషన్‌లో కనిపించిన సీన్స్‌పై ఆసక్తికర చర్చ మొద లైంది. రోహిత్‌ను బెంచ్‌కు పరిమితం చేసే ఛాన్సే లేకపోయి నప్పటికీ ఇది అతడికి కచ్చితంగా పరీక్షా కాలం అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. జాతీయ మీడియా కథనాల ప్రకారం వన్డేలకు సారథ్యం వహించాలని రోహిత్‌కు ఉన్నా



ఆ బాధ్యతలను తప్పనిసరి పరిస్థితుల్లో గిల్‌కు అప్పగించాల్సి వచ్చిందట. వన్డే కెప్టెన్‌గా గిల్‌ను ప్రమోట్ చేసినట్టు తొలుత అగార్కర్ ప్రకటిం చిన విషయం తెలిసిందే. ఇక ఈ సిరీస్‌లో తన సత్తా చాటేందుకు రోహిత్ పూర్తిస్థాయిలో సిద్ధమయ్యా డు. ముఖ్యంగా ఫిట్‌నెస్‌ను బాగా మెరుగుపరుచుకుని అభి మానులతో పాటు విమర్శకుల మెప్పును కూడా పొందాడు. అయితే, ఫిట్‌గా ఉన్నప్పటికీ తొలి వన్డేలో జస్ట్ 8 పరుగులకే హిట్‌మ్యాన్ వెనుదిరగడం అభిమానులను ఆందోళనకు గురి చేస్తోంది.




## అడిలైడ్ పిచ్‌పై యూవీ లైట్లు

### ఆస్ట్రేలియాతో వన్డేకు ముందు జాగ్రత్త చర్యలు

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య జరిగిన తొలి వన్డేకు వర్షం నాలుగుసార్లు అడ్డు పడింది. పెర్త్ వేదికగా జరిగిన ఆ మ్యాచ్‌ను వరుణుడి కారణంగా 26 ఓవర్లకు కుదించాల్సి వచ్చింది. పదేపదే వర్షం అంతరాయంతో పచ్చికపై తేమ పెరగడం, పిచ్ పూర్తిగా బౌలర్లకు అనుకూలించడంతో ఓ దశలో టీమిండియా 45 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొనే గురువారం అడిలైడ్ ఓవల్ స్టేడియంలో జరిగే రెండో వన్డేకు అక్కడి గ్రౌండ్ సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం అక్కడ కూడా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో.. పిచ్‌పై తేమ శాతం పెరగకుండా ఉండేందుకు అల్ట్రావైలెట్ లైట్ల (అతినీలలోహిత కాంతి)తో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అధిక వేడితో కూడుకున్న వెలుతురు వచ్చే ఈ యూవీ లైట్లను పిచ్‌పై ఉంచుతున్నారు. ఇలా చేయడం వల్ల తేమశాతం తగ్గడమే గాకుండా పిచ్ పొడిగా ఉంటుంది. అయితే, రెండో వన్డే రోజు అక్కడ వర్షం కురిసే అవకాశం లేదని వాతావరణ శాఖ చెబుతోంది.




### దక్షిణాఫ్రికాతో రెండో టెస్టు..

## రెండో ఇన్నింగ్స్ పాక్ 94/4

పాక్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 94 పరుగులకు 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. తొలి ఇన్నింగ్స్ లో పాక్ 333 పరుగులు చేయగా, దక్షిణాఫ్రికా 404 పరుగులు చేసింది. 71 పరుగులు వెనుకబడిన పాక్ రెండో ఇన్నింగ్స్‌లో మూడో రోజు ఆట ముగిసే సరికి 94/4తో ఉంది. ప్రస్తుతం ఆ జట్టు 23 పరుగుల ఆధిక్యంలో ఉంది. బాబర్ ఆజమ్ 49, రిజ్వాన్ 16 పరుగులతో ఉన్నారు.

### మహిళల వన్డే ప్రపంచకప్..

## ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా ఘన విజయం

మహిళల ప్రపంచకప్ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. తొలుత ఇంగ్లండ్ జట్టు 50 ఓవర్లలో 244/9 పరుగులు చేసింది. జట్టులో టామ్మిన్ బ్యూమంట్ 78 పరుగులు చేసింది. అన్నాబెల్ సూదర్‌ల్యాండ్ 3 వికెట్లు తీసింది. అనంత రం బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు 24 పరుగులకే 3 వికెట్లు, 68 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో అన్నాబెల్ సూదర్‌ల్యాండ్ 98, గార్డనర్ 104 పరుగులతో విజయతీరాలకు చేర్చారు. 40.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.

## దుబాయ్ రండి..ట్రోఫీ ఇస్తా

- తీరు మారని నఖ్వీ..కొత్త ప్రతిపాదన
- పద్ధతి మార్చుకో..బీసీసీఐ హెచ్చరిక

న్యూఢిల్లీ: ఆసియా కప్ ముగిసి మూడు వారాలు దాటినా.. ట్రోఫీ మాత్రం విజేత భారత్ చెంతకు చేరలేదు. ఈ విషయంలో ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) చీఫ్ మొహిసిన్ నఖ్వీని బీసీసీఐ మరోసారి తీవ్రం గా హెచ్చరించింది. ట్రోఫీని సరైన పద్ధతిలో భారత్‌కు చేర్చాలని డిమాండ్ చేస్తూ మెయి ల్ చేసింది. ఇందుకు అఫ్గానిస్థాన్, శ్రీలంక బోర్డులు కూడా బీసీసీఐకి మద్దతుగా



నిలిచాయి. అయితే, తీరు మారని నఖ్వీ.. ట్రోఫీ అప్పగిస్తానంటూనే కొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు. అదేంటంటే.. వచ్చేనెల 10న దుబాయ్‌లో ఓ ఈవెంట్‌ను ఏర్పాటు చేస్తామని, ఆ కార్యక్రమానికి భారత కెప్టెన్ సూర్యకుమార్ సహా జట్టు సభ్యులంతా రావాలని బీసీసీఐకి పంపిన లేఖలో కోరారు. ఆ ఈవెంట్‌లో తన చేతులమీదుగానే ట్రోఫీ అందిస్తానని అందులో వివరించారు. ఇదిలా ఉండగా.. వచ్చే నెలలో జరిగే ఐసీసీ సమావే శంలో నఖ్వీపై బీసీసీఐ ఫిర్యాదు చేసే అవకాశాలు ఉన్నాయి. ఆసియా కప్ ఫైనల్లో పాక్‌ను ఓడించిన భారత్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే.

## పాక్ వన్డే సారథి షహీన్ షా అఫ్రీది

కరాచీ: పాకిస్తాన్ క్రికెట్ సారథిని మరోసారి మార్చారు. ఈసారి వన్డే కెప్టెన్ రిజ్వాన్‌పై వేటుపడింది. వచ్చే నెల ఆరంభంలో దక్షిణాఫ్రికాతో మొదలయ్యే మూడు వన్డేల సిరీస్‌కు సీనియర్ పేసర్ షహీన్ షా అఫ్రిదికి సారథ్య బాధ్యతలు అప్పగించారు. వైట్‌బాల్ కోచ్ మైక్ హెస్సన్ సూచనల మేరకే నాయకత్వ మార్పు జరిగినట్టు తెలుస్తోంది. కోచ్‌గా హెస్సన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు మాత్రమే రిజ్వాన్‌తో కలిసి పని చేశాడు. ఇంత తక్కువ సమయంలో కెప్టెన్‌పై హెస్సన్ ఇలాంటి అభిప్రాయానికి రావడంపై మాజీ ఆటగాళ్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రిజ్వాన్‌ను తప్పించాలన్న నిర్ణయం వెనుక సెలెక్షన్ కమిటీ, హైపర్ఫామెన్స్ డైరెక్టర్ ఆకిబ్ జావెద్‌తోపాటు పీసీబీ చైర్మన్, మాజీ కెప్టెన్లు మిస్బావుల్ హక్, సర్ఫరాజ్ ఖాన్‌ల ప్రమేయం కూడా ఉన్నట్టు తెలుస్తోంది. అలాగే పాలస్తీనా గురించి బహిరంగంగా మాట్లాడడం కూడా ఓ కారణం అంటున్నారు. ముఖ్యంగా బెట్టింగ్ కంపెనీలను తాను ఎండార్స్ చేయనని రిజ్వాన్ అన్నాడు. అయితే బెట్టింగ్ కంపెనీ లతో ఒప్పందాలున్న పాక్ క్రికెట్ బోర్డుకు ఇది ఇబ్బంది కల్గించి ఉండవచ్చు.



### పాక్ క్రికెటర్ ఇంట తీవ్ర విషాదం

పాకిస్థాన్ ఆల్ రౌండర్ ఆమిర్ జమాల్ ఇంట తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కొన్ని గంటల క్రితమే పుట్టిన జమాల్ మరణించింది. చనిపోక ముందు బిడ్డ తన చేతి వేళ్లను పట్టుకున్న ఫొటోలను షేర్ చేశాడు.

# వన్డే క్రికెట్ చరిత్రలో వెస్టిండీస్ సంచలనం

◆ 50 ఓవర్లు స్పిన్ బౌలర్లతో బౌలింగ్

ఒకప్పుడు వెస్టిండీస్ క్రికెట్ ప్రపంచంలో రారాజులాగా వెలిగింది. ఆ జట్టుతో మ్యాచ్ అంటే ప్రత్యర్థి జట్లు వణికిపో యేవి. కారణం..విండీస్ ఫాస్ట్ బౌలింగ్ ఆ రేంజ్‌లో ఉండేది. ఆ తర్వాత అనూహ్యంగా చిన్న జట్ల స్థాయికి ఈ కరేబియన్ జట్టు పడింది. పలు సందర్భాల్లో చిన్న జట్ల చేతుల్లో కూడా ఓటమి చవిచూసింది. ఇటీవల కాలంలో ఏ రికార్డును తన ఖాతాలో వేసుకోని విండీస్ తాజాగా ఓ సంచలన రికార్డును నమోదు చేసింది. దీంతో ప్రస్తుతం ఈ కరేబియన్ జట్టు పేరు మారుమోగుతుంది. విషయం ఏంటంటే గత మంగళవారం బంగ్లాదేశ్‌లోని ఢాకా వేదికగా జరిగిన రెండో వన్డేలో వెస్టిండీస్ జట్టు తమ ఇన్నింగ్స్‌లోని 50 ఓవర్ల మొత్తాన్ని స్పిన్ బౌలర్ల చేత వేయించి వరల్డ్ రికార్డు నమోదు చేసింది. క్రికెట్‌లో పూర్తిస్థాయి సభ్యదేశం ఈ అద్భుతమైన ఫీట్‌ను సాధించడం ఇదే మొదటిసారి. తొలి వన్డేలో బంగ్లా స్పిన్ కు దెబ్బతిన్న విండీస్.. రెండో వన్డేలో స్పిన్నర్లతో దాడికి దిగాల ను భావించింది. ఇది కరేబియన్ క్రికెట్ సంప్రదాయానికి పూర్తి విరుద్ధమైన నిర్ణయమైనా.. పిచ్ కండిషన్స్‌కు తగ్గట్టుగా తీసుకున్న సరైన నిర్ణయంగా ఆ జట్టు నిరూపించింది. వెస్టిండీస్ జట్టు ఐదుగురు స్పిన్ బౌలర్ల ను (అకీల్ హొసేన్, రోస్టన్ ఛేజ్, ఖారీ పియెర్రీ, గుడకేశ్ మోటీ, అలిక్ అథనాజ్) ఉపయోగించింది. వీరి ధాటికి బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లకు 213 పరుగులు మాత్రమే చేయగలిగింది. తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన విండీస్ కూడా నిర్ణీత 50 ఓవర్లకు 213 స్కోర్ చేసింది. దీంతో సూపర్ ఓవర్‌తో కరేబియన్ జట్టు విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో రెండు రికార్డులు బ్రేక్ అయ్యాయి. వన్డే చరిత్రలో 50 ఓవర్లు స్పిన్నర్లతో బౌలింగ్ వేసిన తొలి జట్టుగా వెస్టిండీస్ నిలిచింది. ఇరు జట్లు కలిపి మొత్తం 92 ఓవర్లు స్పిన్ బౌలింగ్ చేయడంతో మరో అరుదైన వరల్డ్ రికార్డు కూడా నమోదైంది.




# ఆ ఐటెమ్స్ మళ్లీ చేయాలనుంది!

తాను చేసిన ఐటెమ్ సాంగ్స్ అన్నీ మళ్లీ చేయాలనుందని అంటోంది నటి రమ్యకృష్ణ. జగపతిబాబు వ్యాఖ్యాతగా సాగుతోన్న టాక్ షో 'జయమ్ము నిశ్చయమ్మురా'. ఇప్పటికే పలువురు సినీ తారలు షోలో ఎన్నో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తాజాగా రమ్యకృష్ణ అతిథిగా వచ్చి సందడి చేశారు. తన డైలాగులతోపాటు, నటించిన సినిమాలకు సంబంధించిన అనేక విషయాలను పంచుకున్నారు. ఇందుకు సంబంధించిన ప్రోమోను జీ5 విడుదల చేసింది. 'నువ్వు చేసిన వాటిలో ఏ సినిమా మరోసారి చేయాలనుందని'



జగపతిబాబు అడిగిన ప్రశ్నకు.. రమ్యకృష్ణ ఆసక్తికర సమాధానమిచ్చారు. తన ఐటెమ్ సాంగ్స్ అన్నీ మళ్లీ చేయాలనుందన్నారు. 'బాహుబలి'లో శివగామిగా నటించేటప్పుడు నిజంగానే తను రాజమాతలా మారిపోయానని చెప్పారు. 'నా మాటే శాసనం..' డైలాగుతో అలరించారు. శుక్రవారం, ఆదివారం జీ తెలుగులో ఈ టాక్ షో ప్రసారం కానుంది.

# ఫౌజీ టైటిల్ నేడే..




హను రాఘవపూడి, ప్రభాస్ కాంబోలో పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఓ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. ప్రభాస్‌కు జోడీగా సోషల్‌మీడియా స్టార్ ఇమాన్వీ నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అప్‌డేట్‌ను మూవీ టీమ్ పంచుకుంది. గురువారం ఉదయం దీని టైటిల్‌ను ప్రకటించనున్నట్టు చిత్రబృందం తెలిపింది. ఈమేరకు ఆ ఆసక్తికరమైన క్యాప్షను పంచుకుంది. 'పాండవుల పక్షాన ఉన్న కర్ణుడు..' అనే క్యాప్షన్‌తో ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. '1932నుంచి ఇతడి కోసం అందరూ వెతుకుతున్నారు'. 'ఒంటరిగా పోరాడిన బెటాలియన్' అనే ట్యాగ్ లైన్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమా 'ఫౌజీ' (వర్కింగ్ టైటిల్)తో ప్రచారంలో ఉంది. విభిన్నమైన కథ, భారీ బడ్జెట్‌తో సిద్ధమవుతోంది. ఇందులో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారు. 1930వ దశకంలో జరిగే కథగా.. మాతృభూమి ప్రజలకు న్యాయాన్ని అందించడానికి యోధుడు చేసే పోరాటంగా మూవీ రానుంది. వాస్తవ సంఘటనలకు కొంత ఫిక్షన్ జోడించి హను రాఘవపూడి ఈ కథను సిద్ధం చేశారు.

# థామా.. డే వన్ కలెక్షన్స్ ఎంతంటే?



రష్మిక, ఆయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రల్లో ఆదిత్య సర్పోదర్ రూపొందించిన చిత్రం 'థామా'. తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన సినిమా మంచి ఆదరణ సొంతం చేసుకుంది. మొదటి రోజు కలెక్షన్స్‌పై ఆసక్తి నెలకొంది. తొలిరోజు వసూళ్లను నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా మొదటిరోజు రూ. 25.11 కోట్లు వసూలు చేసినట్టు చెప్పుకుంది. హిందీ, తెలుగు భాషల్లో సినిమా ఒకేసారి విడుదలైన విషయం తెలిసిందే. హారర్ కామెడీ ఫిల్మ్ తొలిరోజు రూ. 25.11 కోట్లు వసూలు చేసిందని.. ఇది బాక్సాఫీస్ ధమాకా విజయమని నిర్మాణ సంస్థ మాడాక్ ఫిల్మ్స్ ప్రకటించుకుంది. ఆయుష్మాన్ ఖురానా కెరీర్‌లో మొదటిరోజు ఈ స్థాయిలో వసూళ్లు సాధించిన తొలి చిత్రం ఇదేననీ పేర్కొంది.

***కథేంటంటే..:*** అలోక్ గోయల్ (ఆయుష్మాన్ ఖురానా) ఓ జర్నలిస్ట్. ఒకరోజు మిత్రులతో కలిసి ఓ పర్వత ప్రాంతానికి న్యూస్ కవరేజ్‌కు వెళ్తాడు. అక్కడ అతనిపై ఎలుగుబంటి దాడి చేయగా.. తడ్కా (రష్మిక) తనని కాపాడుతుంది. ఆమె -మనుషుల రక్తాన్ని తాగే అలవాటున్న బేతాళ జాతి యువతి. ఈ జాతికి ఎన్నో అతీత శక్తులుంటాయి. ఈ జాతికి నాయకుడు థామాగా పిలిచే యక్షాసన్ (నవాజుద్దీన్ సిద్ధిఖీ). అతనివల్ల జరిగిన ఓ తప్పు కారణంగా బేతాళ జాతి అతడిని దశాబ్దాలుగా గుహలో బందీగా ఉంచుతుంది. అలాంటి బేతాళ సామ్రాజ్యంలోకి అలోక్ వచ్చాడని తెలిసి.. ఆ జాతి వాళ్లు అతడిని శిక్షించే ప్రయత్నం చేసినపుడు తడ్కా తప్పిస్తుంది. ఈ క్రమంలోనే అతనిపై ప్రేమతో తన జాతిని విడిచి జనజీవనంలోకి వస్తుంది. మరి ఆ తర్వాత వీళ్ల ప్రేమ ప్రయాణం ఎన్ని మలుపులు సాగింది? అలోక్‌కు కూడా తడ్కా ఓబేతాళిని అని ఎప్పుడు తెలిసింది? ఈ కథకు 'భేడియా', 'ముంజ్యా', 'స్త్రీ-2' చిత్రాలతో ఉన్న లింకేంటి? అన్నది మిగిలిన కథ.

# మహేష్.. రికార్డు సృష్టిస్తాడా?



టాలీవుడ్‌లో స్టార్ హీరోలు ఒకరి రికార్డును మరొకరు బద్ధలుకొట్టడం కామన్. అయితే, సోషల్ మీడియాలో కూడా కొన్ని రికార్డులు స్టార్ హీరోల పేరిట ఉన్నాయి. అలాంటి వాటిలో ఎక్స్ (గతంలో ట్విట్టర్)లో ఓ తెలుగు సినిమా ప్రమోషనల్ పోస్ట్ సాధించిన రికార్డును ఏ హీరో కూడా బీట్ చేయలేకపోయారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన 'పుష్ప-2' చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌కు ట్విట్టర్‌లో మాసివ్ రికార్డు ఉంది. ఆ ప్రమోషనల్ పోస్ట్‌కు ట్విట్టర్ హ్యాండిల్‌లో ఏకంగా 285 వేల లైకులు, 14 మిలియన్ ఇంప్రెషన్‌లు దక్కాయి. దీంతో ఇప్పటివరకు తెలుగులో అత్యధిక రీచ్ కలిగిన పోస్ట్‌గా 'పుష్ప-2' నిలిచింది. ఇక ఇప్పుడు ఈ రికార్డును బద్దలుకొట్టే అవకాశం సూపర్ స్టార్ మహేష్ బాబుకు మాత్రమే ఉందని సినీ సర్కిల్స్ టాక్. దర్శకుడు రాజమౌళితో మహేష్ చేస్తున్న మోస్ట్ హైప్ ఉన్న సినిమానుంచి నవంబర్‌లో సాలిడ్ ట్రీట్ రానుంది. ఒకవేళ ఎవరి ఊహలకు అందని విధంగా రాజమౌళి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను డిజైన్ చేస్తే, 'పుష్ప-2' రికార్డును బద్దలుకొట్టడం ఖాయం. మరి ఈ విషయంలో బన్నీ రికార్డును మహేష్ బీట్ చేస్తాడా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.

# స్మృతి సీరియల్‌లో గేట్స్ అప్పియరెన్స్

కేంద్ర మాజీమంత్రి స్మృతి ఇరానీ ప్రధాన పాత్రలో నటిస్తోన్న సీరియల్ 'క్యోంకీ సాస్ భీ కభీ బహు థీ 2'. ఇప్పటికే ఈ ధారావాహికలో ఎంతోమంది సెలబ్రిటీలు అతిథి పాత్రల్లో కనిపించారు. ఇప్పుడు మరో ప్రముఖ వ్యక్తి ఇందులో గెస్ట్‌గా కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఇందులో మూడు ఎపిసోడ్లలో అతిథిగా కనిపించనున్నట్టు ఆంగ్ల మీడియా పేర్కొంది. "ఇందులో స్మృతి ఇరానీ తులసి పాత్రతో బిల్‌గేట్స్‌తో వీడియో కాల్‌లో



మాట్లాడతారు. ఈ సన్నివేశం మూడు ఎపిసోడ్లు ఉండనుంది. గర్భిణులు, శిశువుల ఆరోగ్యానికి సంబంధించిన సందేహాలపై ఆ వీడియో కాల్‌లో తులసి ఆయనతో మాట్లాడుతుంది. ఆ ఎపిసోడ్లలో ప్రజలకు ఎన్నో విషయాలపై అవగాహన కల్పించనున్నారు. ఇలాంటి విషయాల్లో సామాజిక అవగాహనను ప్రోత్సహించడానికి స్మృతి ఇరానీ ఈ సీరియల్‌ను వేదికగా చేసుకున్నారు" అని ఆంగ్ల మీడియా తెలిపింది. ఇక ఈ సీరియల్‌లో ఇటీవల కొందరు సెలబ్రిటీలు సందడి చేశారు. సాక్షి తన్వర్, కిరణ్ కర్మాకర్, ఏక్తాకపూర్లు మెరిశారు. అమర్ ఉపాధ్యాయ్ కూడా ఓ ఎపిసోడ్‌లో కనిపించారు. ఇప్పుడు బిల్‌గేట్స్ కనిపించనున్నట్టు వార్తలు రావడంతో అందరిలోను ఆసక్తి నెలకొంది. 25 ఏళ్ల క్రితం స్మృతిఇరానీ నటించిన హిందీ సీరియల్ 'క్యోంకీ సాస్ భీ కభీ బహు థీ. 2000 జులైలో ప్రారంభమైన ఈ ధారావాహిక 2008 నవంబరు వరకూ విజయవంతంగా ప్రసారమైంది. అందులో ఆమె.. గృహిణి తులసి పాత్రలో నటించి, ప్రేక్షకుల ఆదరణతోపాటు పలు అవార్డులు అందుకున్నారు. దానికి సీక్వెల్‌గా రూపొందినదే "క్యోంకీ సాస్ భీ కభీ బహు థీ 2'.

# అదీ.. 'బాస్టియన్'.. రేంజ్ మరి!

ముంబయిలో ఖరీదైన రెస్టారెంట్లలో శిల్పాశెట్టి 'బాస్టియన్' ఒకటనే విషయం తెలిసిందే. తాజాగా దీనిగురించి రచయిత్రి శోభా డే కొన్ని వివరాలను వెల్లడించారు. ఈ రెస్టారెంట్‌లోకి అడుగుపెడితే ఎలా ఉంటుందో తెలిపారు. మోజోస్టోరీతో ఆమె మాట్లాడుతూ ఈ రెస్టారెంట్‌కు మంచి ఆదాయం వస్తుందని చెప్పారు. "ముంబయికి సంబంధించిన కొన్ని విషయాలు నన్ను ఆశ్చర్యపరుస్తాయి. ఈ నగరంలో ఒక రెస్టారెంట్ రాత్రికి రాత్రి రూ. 2-3 కోట్ల టర్నోవర్ చేస్తుంది. సాధారణ రోజుల్లో రూ. 2 కోట్లు, వారాంతంలో రూ. 3 కోట్ల ఆదాయం వస్తుంది. అది నిజం కాదేమో అనుకున్నా. కానీ, ఆ నంబర్ల గురించి స్వయంగా విన్నాను. ఆ రెస్టరంట్ ఏదో కాదు.. శిల్పాశెట్టి 'బాస్టియన్'. నేను దాని లోపలికి వెళ్లి షాకయ్యాను. సుమారు 1400మంది అతిథులు అక్కడ స్టే చేయొచ్చు. ఒకేసారి 700మంది భోజనం చేసే వీలుంది. అలాంటి రెండు పెద్ద పెద్ద హాల్స్ ఉన్నాయి. వారంతా భోజనం చేస్తుంటే నేను నమ్మలేకపోయాను" అని శోభా డే తెలిపారు. తాజాగా ముంబయిలోని బాంద్రాలో ఉన్న 'బాస్టియన్'ను మూసివేస్తున్నట్టు శిల్పా సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. దీన్ని 'బాస్టియన్ బీచ్ క్లబ్' పేరుతో జుహులో తెరవనున్నట్టు తెలిపారు. ఎన్ని బ్రాంచ్‌లు తెరిచినా ఈ బాంద్రాలోని రెస్టారెంట్ మాత్రమే వాటికి మూలమని చెప్పారు. ఇది ఎప్పటికీ ప్రత్యేకమేనన్నారు.

# సాంగ్ షూట్ షేర్ చేసిన ఆషికా

సీనియర్ హీరో రవితేజ నటిస్తున్న 'మాస్ జాతర' 31న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అయింది. భాను భోగవరపు డైరెక్ట్ చేసిన చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సక్సెస్ కొడుతుందా? అన్న ఆసక్తి లేకపోలేదు. ఈ క్రమంలోనే రవితేజ నెక్స్ట్ ప్రాజెక్టు ఆర్‌టి76పై హీరోయిన్ ఆషికా రంగనాథ్ సాలిడ్ అప్డేట్ ఇచ్చింది. ప్రస్తుతం సినిమా షూటింగ్ స్పెయిన్‌లో జరుగుతుందని.. అక్కడ సాంగ్ షూటింగ్ చేస్తున్నట్టు ఆమె కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇక ఈ పాట షూటింగ్‌తో స్పెయిన్ షెడ్యూల్ పూర్తవుతున్నట్టు చిత్ర యూనిట్ తెలిపింది. ఆర్‌టి76 చిత్రాన్ని దర్శకుడు కిషోర్ తిరుమల డైరెక్ట్ చేస్తుండగా 2026 సంక్రాంతి కానుకగా చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

